జనచైనా అక్టోబరు విప్లవ విజయానికి అంకితం

61

సృజన

ఈ చప్పట్లలో అనంతకోటి పీడితజన విజయధ్వానాలు
ఈ చప్పట్లు దోపిడీమూకల గుండెలపై చావుతప్పెటలు
ఈ చప్పట్లలో లాంగ్‌మార్చ్ వీరయోధుల పదఘట్టనలు
ఈ చప్పట్లలో స్వార్థం శిరస్సు నరికిన ఆయుధంచప్పుడు
ఈ చప్పట్లలో ప్రపంచ పీడితజనానికి విప్లవం పిలుపు
అరుణారుణ భవిష్యత్‌లోకి మేల్కొలుపు—



సృజన

ఆధునిక సాహిత్య వేదిక

మాస పత్రిక

జనచైనా అక్టోబరు విప్లవ విజయానికి అంకితం

61

సృజన చందా రేట్లు

విడిప్రతి	రూ. 1-50 (ప్రత్యేక సంచికలు మినహా)
సంవత్సర చందా	రూ. 15-00
అర్ధ సం॥ చందా	రూ. 8-00

సృజన, హనుమకొండ, వరంగల్ - 506 001

నిర్వహణ

'సాహితీ మిత్రులు'

2 రూపాయలు

ited, Printed & Published by P. Hemalatha for 'Sahithee Mithrulu'
Printed at Venkataramana Mudranalayam,
J.P.N. Road, Warangal-506002 (A.P.)

భవిష్యత్తు ఉజ్వలంగా ఉంది–

అరెస్టులతో, సోదాలతో, కుట్రలతో విరసం హడలిపోతుందనీ, మూతపడుతుం దనుకొనే ప్రభుత్వం మాట అటుంచి యింకెవరైనా భావిస్తే అది కేవలం భ్రమే అవుతుంది–

అయితే విరసం ప్రధానకార్యదర్శి కామ్రేడ్ త్రిపురనేని మధుసూదనరావుతో పాటు మన విరసం ముఖ్యులు కొందరు కటకటాలవెనక ఉన్న యీ తరుణంలో మనపై గురుతరమైన బాధ్యత ఉన్నది–

ఈ దోపిడీ ప్రభుత్వ పాశవిక చర్యలకు వ్యతిరేకంగా ఉవ్వెత్తుగ ప్రజాభిప్రాయాన్ని నిర్మించవలసిన అవశ్యకతఉన్నది– ఎందుకంటే ప్రజలే మన ప్రాణవాయువు. మనకు ప్రజల్లో అచంచలమైన సంపూర్ణమైన విశ్వాసమున్నది. ప్రజలు అజేయులు– అందుకే ప్రజలతో కలసిపోవాలి, ప్రజలంటే పీడితులు, కార్మికులు, కర్షకులు–

సాంస్కృతిక సైన్యంగా మనం యింకా ముందుకుపోవాలి– మన కలాలూ, గళాలూ యింకా బలపడాలి– ఇంకా ప్రజలకు చేరువకావాలి– చేరువ కావాలంటే మనం ప్రజల నుండే పాఠాలు నేర్చుకోవాలి– ప్రజలు మన అధ్యాపకులు– ప్రజాపోరాటాలు మనకు ఇన్‌స్పిరేషన్–

పోరాటం ఆనందం– పోరాటమే జీవితం– జీవితమే విప్లవం– విప్లవం యీనాటి యుగధర్మం– మనం 'ఏటికి ఎదిరీదేవాళ్ళము'గా ఉండాలి– ఇప్పుడు దారి ఎంత దారుణంగాఉన్నా 'భవిష్యత్తు ఉజ్వలంగా' ఉంది–

దేశంలో ఇవ్వాళ 'విప్లవ పరిస్థితులు అద్భుతంగాఉన్నాయి'– 'ఒక్క పుల్ల గీస్తే చాలు– విప్లవం దావానలమై మండుతుంది'–

మార్క్సిజం – లెనినిజం మావో ఆలోచనా విధానంమీద మన సమస్త కళలనూ ప్రజలు గీటురాయిగా పదనుపెట్టుకుందాం– ఈ దేశం నెత్తురుపీల్చే సామ్రాజ్యవాదాన్నీ, సోషల్‌సామ్రాజ్యవాదాన్నీ, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్నీ మొదలంటా నరికేయడానికి సాగుతున్న సాయుధ రైతాంగ పోరాటంలో సాంస్కృతిక సైన్యంగా మన పాత్ర అజేయంగా నిర్వహిద్దాం–

మన పొరుగు దేశమైన జనచైనా అక్టోబర్ 1న తన విప్లవ విజయపు 25వ వార్షికోత్సవం దిగ్విజయంగా జరుపుకొన్నది– సోషలిష్టు నిర్మాణదశలో యిప్పుడు ఆశ్చర్యకరమైన విజయాలు సాధిస్తున్నది– శ్రామికవర్గ సాంస్కృతిక మహా విప్లవంలో భాగంగా కన్ఫూషియస్, లిన్‌పియావో ముఠాల పురాతన అభివృద్ధి నిరోధక పెట్టుబడిదారీ పునరుద్ధరణ భావాలను తుడిచిపెడుతూ, మావో ఆలోచనను మనసులో నింపుకొని మహోజ్వల భవిష్యత్తువైపు సాగిపోతోంది– మనల్ని పిలుస్తోంది– ఈ శుభసమయంలో అశేష చైనా ప్రజానీకానికి యివే మా విప్లవ శుభాకాంక్షలు–

ఎ లాంగ్ లాంగ్ లైఫ్ టు చెయిర్మన్ మావో!

చెయిర్మన్ మావోకు

ఎం. టి. ఖాన్

నీ కళ్ళలో అరుణారుణ సూర్యుడు*
చీకటి సముద్ర తీరాల్లో లైట్ హౌజ్‌లా
నువ్వు స్థిరంగా నిల్చున్నావు
ప్రపంచ తిరోగమన శక్తులు బలమైన కెరటాలు కెరటాలుగా
విరుచుకుపడి నిన్ను కదిలించలేక వెనక్కి పోతున్నాయి;
దీనంగా, అవమానంతో

నీ ఆలోచనల నిరంతర సృజనాత్మక ప్రతిభ
కాలం చెల్లని మార్క్సియన్ పంథాలో శక్తివంతమై
పొలాలను పండించే వసంతసూర్యుని వెచ్చదనంవలె
ప్రపంచ దేశాలన్నింటా
విప్లవాల పంటను సమృద్ధిగా పండిస్తున్నది-

శ్రామికవర్గ విప్లవాల బాటలను కాంతివంతంగా తీర్చడానికి
చింగ్‌కాంగ్ పర్వతాలనుంచి ప్రకాశిస్తున్న
ఎర్రపూల అరుణ కీలలు
చైనా యువతరాన్ని జ్వాలా పుష్పాలుగా మారుస్తున్నవి

హోచిమిన్ నడిపించిన వియత్నాం యువతరానికి
అండగా నువ్వు స్థిరంగా నిలిచి
విప్లవ కణాన్ని దావానలంగా మార్చడానికి సహకరించావు
అది లావాలా ఎగజిమ్ముతూ
సామ్రాజ్యవాదం మొహంమీద చావుదెబ్బలు కొట్టింది

బీటలువారిన నేలలో
తొలకరి జల్లులు కొత్త ప్రాణాల్ని చిగురింపచేసినట్లుగా
భారత రైతాంగ విముక్తికోసం పోరాడే
ధైర్యాన్ని నువ్వు పునరుద్ధరించావు

ఆఫ్రికా అడవుల లోతుల్లో
ఒక ప్రేమార్ద్రమైన సోదరునివలె
స్వాతంత్ర్య యోధులకు

నీ చేతిని అందించి
వాళ్ళ కాళ్ళమీద వాళ్ళు పోరాడేలా చేసావు

నీ మొక్కవోని ఆలోచనా విధానం
పాలస్తీనా గెరిల్లాల చేతుల్లో గ్రెనేడ్
అది జియోనిజం గుండెల్లో పేలుతోంది

వర్గ యుద్ధంజెండాను ఉన్నతంగా పట్టుకొని
డస్సెల్‌డార్ఫ్‌లో, ప్యారిస్‌లో విద్యార్థులు ఊరేగింపులుచేస్తున్నారు
ప్యారిస్ కమ్యూన్ వర్గ చైతన్యాన్ని పునరుద్ధరించి
రివిజనిజం వేర్లను తెగనరుకుతున్నారు

మానవ చరిత్ర గమనాన్ని మారుస్తూ
చెయిర్మన్ మావో! విప్లవ యుద్ధాలద్వారా
నువ్వు తూర్పుగాలిని
పడమటి గాలిమీద గెలిపిస్తున్నావు.

---

* ప్రపంచగమనాన్ని
వెలుగు తీరాలవైపు నడుపుతూ

ఉదయ కిరణాలు :

మావో సూక్తులు — కామ్రేడ్ వెంపటాపు సత్యనారాయణ

అన్నా అన్నా విన్నావా
ఎన్నడైనా కన్నావా
పీడితజాతికి విముక్తి చూపే
మావో సూక్తులు విన్నావా ॥అన్నా॥

పీడిత జాతిని దోపిడి మూకలు
పీడించుచు నున్నాయటరా
ప్రపంచ పీడితులంతా ఒకపై
పోరుసల్ప మన్నాడటరా ॥అన్నా॥

అధికారం మనచేతికి రానిదే
అంధకారమట మన బ్రతుకు
తుపాకిగొట్టంద్వారా రాజ్యం
తప్పక వచ్చుని చెప్పాడు ॥అన్నా॥

ప్రజలకోసమై మరణించుట
మహాపర్వతముకన్న బరువటరా
దోపిడీ మూకలకొరకు చచ్చుట
యీకకన్నమరి తేలికటరా ॥అన్నా॥

ధైర్యము తోడను యుద్ధభూమిలో
భయములేక పోరాడాలటరా
విరామ మెరుగక పోరుసల్పిన
విజయం తప్పక సిద్ధించూ ॥అన్నా॥

ప్రజాశక్తికి మించిన శక్తి
ప్రపంచమున మరి లేదటరా
ప్రజలందరు మరి కలిసి పోరితే
శత్రునాశనము తప్పదటా ॥అన్నా॥

తూర్పుగాలి
(East Wind Prevails)
యాత్రిక్

అడవినుంచి అలసటగావచ్చి వెన్నెలలో పరవశించి
రాత్‌కిరాణీని పలకరించిన గాలి
నా ఊపిరిలో ఎన్నో సత్యాలను ఊదుతుంది.
అనాచ్ఛాదిత శరీరాలను, గుడిసెలను, ఆలోచనలనూ
అణచుకున్న స్వప్నాలను, ఆకాంక్షలనూ స్పృశించి
దినమంతా నేల నాలుగుచెరగులా నిర్మాణమయ్యే
చరిత్రకు సాక్షిగా
అన్నివేపుల్నించీ తోసుకొచ్చి
నా మనసుమీది విజయాల్ని రాస్తుంది గాలి.

ప్రజల గుండెల్లో రహస్యంగా పోరాటం నిర్మిస్తున్న కామ్రేడ్స్
పంపించిన సందేశంవలె వెచ్చగా నా నొసలు సోకి
జనం మోపిన కర్తవ్యంవలె చుట్టూ ఊపిరిసలపని అలలవలె తాకి
నన్ను హెచ్చరిస్తున్నది గాలి నన్ను జాగరూకుణ్ణి చేస్తున్నది.

తలుపులూ తాళాలూ ఎంతో జాగ్రత్తగా వేస్తారు
నిద్రకూ సుఖానికీ వెలియై కాపలాలు కాస్తుంటారు
రాదల్చుకున్నదా దేన్నీ ఖాతరుచేయకుండా తోసుకొని వస్తుంది
ఉరుములనూ మెరుపులనూ వర్షాన్నీ మోసుకొని వస్తుంది
తెల్లవారేవరకు చుట్టూ దృశ్యాన్నే మార్చి వేస్తుంది.

ఉధృతంగా వ్యాపిస్తున్న తూర్పుగాలిని
బంధించడానికి జైళ్ళు, కాల్చడానికి తుపాకులు
ఎదిరించడానికి దోపిడీ చీకట్లు ఎగబడుతున్నయి
ఉదయ సూర్యకాంతిలో ఎక్కడా కనిపించకుండా
అంతటా సంచరిస్తూ తూర్పుగాలి.

విప్లవాల యుగం మనది

చెరబండరాజు

విప్లవాలయుగం మనది
విప్లవిస్తే జయం మనదె ॥విప్ల॥

కష్టజీవులార మీరు
కుమిలి కుమిలి చావకండి
సాయుధ పోరాట ప్రజా
సైనికులై కలియరండి ॥విప్ల॥

ప్రజాయుద్ధ జలపాతం
దోపిడిపై విరుచుకపడి
బూర్జువాల రాజ్యాంగం
మట్టిపాలు కానున్నది ॥విప్ల॥

త్యాగాలకు వెనుదీయని
వాడే మన సహచరుడు
శత్రువుపై జాలిలేని
వాడే మన స్నేహితుడు ॥విప్ల॥

పోలీసుల రాజ్యంలో
పౌరహక్కు లడుగంటెను
కోర్టులలో జన న్యాయం
గొంతునులిమి చంపబడెను ॥విప్ల॥

చెరసాలలు ఉరికొయ్యలు
వెలుగును బంధించలేవు
ప్రతి నిమిషం పోరాడే
ప్రజలను భయపెట్టలేవు ॥విప్ల॥

రాక్షస సామ్రాజ్యవాద
పర్వతాలే కూలుతుంటె
శ్రమజీవుల శక్తి ముందు
ఏ శక్తులు నిలువగలవు? ॥విప్ల॥

(కోర్టులో పాడితే విని రాసుకున్నది)

ఏనుగు - ఎలగపండు

తాతిరాజు

బడ్డీకొట్టు
భిక్షాలుగాడికీ
రిక్షా రాముడికీ
అప్పులిప్పిస్తామని
ఆశబెట్టి వూరిస్తే
అవుసనుకున్నాన్రో దేవుడో!

బంజర్లు గైరాన్లు
గుంజుతామని
సరిగా పంచుతామని
సాటితే
సెవులొగ్గి ఇన్నాను శివుడో!

సొరగానికి దారిరుకని
సాములోరు సెప్పిండు
సొరగమే దిగొస్తుందని
వోట్లబాబు సెప్పిండు

ఏనుగు మింగేసిన
ఎలగపండు మాదిరిగా
ఏం బావుకుంతన్నం
ఎన్నిక సిగతరగా!

కాల్తన్న కడుపునిండ
జొన్నకూడు లేదుగంద
ఆకలితో సచ్చేకన్న
పోరాటం మేలుగంద?

గెరిల్లా గీతం

మేమంతా తుపాకి పట్టడంలో నేర్పరులం
మా ప్రతి బులెట్‌కూ ఒక శత్రువు దొరుకుతాడు
మేము రెక్కలున్న సైనికులం
ఎత్తైన పర్వతాలన్నా, లోతైన జలాలన్నా
భయంలేదు

దట్టమయిన అడవుల్లో అన్ని చోట్లూ
మా కామ్రేడ్స్‌కు ఆశ్రయాలే
ఉన్నత సానువులమీద, శిఖరాలమీద
అసంఖ్యాకమైన మా సోదరులున్నారు
తినడానికి ఏమీ వుండదు
కట్టడానికి ఏమీ వుండదు
కాని శత్రువే మాకు తిండీ, బట్టా యిస్తాడు
మా చేతుల్లో తుపాకులులేవు, బులెట్లులేవు
మేం ప్రయోగించడం కోసం శత్రువే అవి తయారుచేస్తాడు

మేమిక్కడ పుట్టిన ప్రజలం
ఇక్కడ ప్రతి అంగుళం నేల మాది
ఎవడైనా దానిమీద దాడి చేయాలనుకుంటే
చచ్చేదాకా అతనితో పోరాడుతాం.

[1939-45 లలో చైనాలో పాడుకున్న గీతం]

నల్లగొండా! మళ్ళీ విప్లవశంఖారావం వినిపించు

ఆర్. రవీందర్‌రెడ్డి

నల్లగొండా!
నాటి తెలంగాణ రైతాంగ సాయుధపోరాటంలో
ఎరుపును పులుముకున్న నీవు
ఢిల్లీపాలకుల గుండెల్లో దేశమొత్తంగా రాబోయే
ఎర్రని భయాన్ని సృష్టించినావు.

ఆనాడు నీ గడ్డపై చిందిన విప్లవవీరుల రక్తం
నేడు నక్సల్‌బరీ, శ్రీకాకుళానికి
రక్తపుచారల విప్లవరాస్త్రాను వేసింది.

నైజాంనూ, భూస్వాములనూ, కేంద్రప్రభుత్వ సైన్యాన్ని
గడగడలాడించిన నీ విప్లవ పోరాటంతో
దేశప్రజలు ప్రభావితులవుతున్నకాలంలో
నాయకత్వమే నీ పోరాటానికి వెన్నుపోటు పొడిచింది
విప్లవ వీరులను తుపాకులను దించమంది

కానీ—

ఇప్పటికీ నీ పేదరైతాంగ పరిస్థితులు మారలేదు
ఓట్లరాజ్యం వారిని ధోకాచేసింది—
దేశపు నలుమూలల విప్లవాగ్నులు రగులుకొంటున్నయ్
ప్రజలు బాధల నిష్కృతికి సాయుధంగా విప్లవిస్తున్నారు

నల్లగొండా! మా ఎర్రజిల్లా
ఇక్కడి చెట్లూ, గుట్టలూ ఆనాటి విప్లవగాధల గానంచేస్తూలేవా?
శ్రీకాకుళం, విప్లవగాలులేసందేశాన్నీ వినిపించడంలేదా?
నీ రైతాంగం గుండెల్లో నాటి ఆవేశం, ఇంకా ఎగిసిరావడంలేదా?

నల్లగొండా!
ఈ దోపిడీవ్యవస్థను సమూలంగా కూల్చడానికి
నీ ప్రజలు సాయుధులుకావాలి
నీ గడ్డపై ప్రజలు వేల కంఠాలతో నాటి విప్లవగీతాలు పాడాలి
సాయుధపోరాట ఎర్రజెండా ప్రతిఇంటా ఎగరాలి

ఆనాటి అమరవీరుల రక్తంతో తడిసిన
బాటలో మనం నడవాలి
నిన్నటి తుంగతుర్తి రైతుకూలీల సమ్మె
తుపాకీపట్టే అవసరాన్ని తెలియచేసింది
నల్లగొండా! మళ్ళీ వెనకటి విప్లవశంఖారావాన్ని వినిపించు

వర్లీ
నల్లటి తారురోడ్డుమీద
ఎర్రటి
నీ రక్తపు మరకలు
(నువ్వుచెప్పిన వేశ్యా
సంస్కృతి నీకిచ్చిన కానుక)
చెరిగిపోయాయి

వాటిమీద
ఇందిరాగాంధిదో
ఆమె సహచరులదో
కారుపోయుంటుంది
వివినాయక్‌దో
వాడి కాబినెట్‌దో
వాన్ వెళ్ళుంటుంది

సాయిబాబాదో
("అంధేరి"కి అదేదారి)
వాడి భక్తులదో
బస్సు నడిచుంటుంది
ఇవేవి కాకపోతే

భగవతీదాశ్ జాదవ్ కోసం

సి. వి.

తుపాకులు ధరించినవాళ్ళ
ఇనుపబూట్లు మట్టేసుంటాయి!

కాని
కామ్రేడ్!
చరిత్ర పుటలమీద
క్రిస్టోపర్ కాడ్వెల్
సంతకంలా
శ్రీకాకుళం గడ్డమీద
సుబ్బారావు పాణిగ్రాహి
జ్ఞాపకంలా
ఆ రక్తపు మరకలు
కోట్లాది దళిత ప్రజల
గుండెల్లో
ఎర్రఎర్రని ప్రతీకారాన్ని
రేపుతూ
ఉన్నాయ్!

(పోలీసు కాల్పుల్లో మరణించిన దళిత్ పాంథర్ కవి యువకుడు భగవతీదాశ్ జాదవ్ కోసం......)

అజేయ శక్తి

ఓ కార్మిక వీరుల్లారా!
ఓ కర్షక యోధుల్లారా!
మన సమైక్యశక్తి అజేయశక్తని
జగానికంతా చాటండి ॥ఓ కా॥

ప్రజాస్వామ్యమనె మేలిముసుగులో
ప్రజావంచకులు రాజ్యంజేతురు;
ధనికులు మరింతధనికులై
పేదలరక్తం పీల్చేస్తారూ ॥ఓ కా॥

ఒకచేతిలో అరుణపతాకం
వేరొకచేతిలో మరతుపాకి
కదలించర మనబలగం
ఎదురించర వైరిమూక ॥ఓ కా॥

కూలికొరకు మనపోరాటం;
కూడుకొరకు ఒక ఆరాటం;
ఇదికాదుర మనధ్యేయం!
ఈ రాజ్యానికి మనమే అధినేతలం.

—గంగిరెడ్డి

"తుపాకిగుళ్ళు పుష్పించటం ఆరంభించినప్పుడు......"

*జార్జ్ రెబెలో

[ఆఫ్రికా విముక్తి వుద్యమదేశాలయిన అంగోలా, మొజాంబిక్, గినిబిసావువంటి దేశాలలోని విప్లవ కవిత్వాన్ని స్వీకరించి "తుపాకీగుళ్ళు పుష్పించటం ప్రారంభించినపుడు" అన్న పేరుతో మార్గరెట్ డికెన్సన్ ప్రచురించిన పుస్తకంపై "రేపటి స్వేచ్ఛ ఎక్కడ" అన్న పేరుతో 'ఫ్రాంటియర్'లో ఐ. కె. శుక్లాగారి వ్యాసంలోని ఒక గేయానికి ఇది స్వేచ్ఛానువాదం]

అనువాదం– రవి

రాసోదరా, రా,
వచ్చి నీ జీవితపథాన్ని విశదీకరించు
రాసోదరా, రా,
వచ్చి శత్రువు నీ శరీరంపై ముద్రించిన
తిరుగుబాటు చిహ్నాలను చూపించు.
రా, వచ్చి చెప్పు,
"ఇక్కడ– నా చేతులు నలిపివేయబడ్డాయి
ఎందుకు? — అవి తమ మాతృభూమిని
సంరక్షించుకుంటున్నందుకు
"ఇక్కడ– నా శరీరం చిత్రహింసకు గురిచేయబడింది
ఎందుకు?– దురాక్రమణదారులకు
తలవొగ్గ నిరాకరించినందుకు"
"ఇక్కడ– నా నోటికి గాయాలు
ఎందుకు?– నా దేశప్రజల స్వేచ్ఛాగీతాన్ని
ధైర్యంగా ఆలపించ సాహసించినందుకు"
రా సోదరా, రా,
వచ్చి నీ జీవితపథాన్ని విశదీకరించు
రా, నీవు, నీ తండ్రులు, తాతముత్తాతలు
మౌనంగా కలలుగన్న తిరుగుబాటుగురించి
వివరంగాచెప్పు.

రా, నాకుచెప్పు
నిన్నటికలలే నేటి యుద్ధాలుగా
పరిణతి చెందాయని
వీరయోధుల పుట్టుకతో,
భయమెరుగని మాతృమూర్తుల
పోరాడే తనయులగాంచి
పులకించింది భూమాత
రా, వచ్చి ఇదంతా నాకు చెప్పుసోదరా
తర్వాత
నేను దాన్నంతా క్లుప్తీకరించి
చిన్నపిల్లలకుకూడా బోధపడేట్లు
ఇంటింటికీ గాలిలా చొరబడి చాటుతాను
"మా దేశంలో
తుపాకీగుళ్ళు పుష్పించటం ప్రారంభించాయని"

[*జార్జిరెబెలో (George Rebelo) మొజాంబిక్ విమోచనసంస్థ "ఫ్రిలిమొ" సమాచారశాఖ కార్యదర్శి. "మొజాంబిక్ రివల్యూషన్" పత్రికా సంపాదకుడు.]

ఈ తరం

సుధాకర్

ఈతరం
విప్లవాగ్ని ప్రవాహాన్ని ఆపేందుకు
జులుమ్ ఆనకట్ట
దానికిందే డబుల్ డైనమెట్

ఈతరం
వర్గకసితో రగుల్కొంటున్న
గుండెలపైకి
నిర్బంధం, నిర్మూలన
చన్నీళ్లచల్లే ప్రయత్నం

ఆ గుండెలకిందే
వర్గశత్రు నిర్మూలన పెట్రోల్ గనులు

ఈతరం
క్రోధావేశాల్ని చల్లార్చేందుకు
దోపిడీ దొరసాని అంగాంగాల
నంగనాచి విన్యాసాలు
వాటికిందే వాటిని తాపుతన్నే
దృఢనిశ్చయం

ఈతరం
మంచులో మురవాల్సిన
మందారాలు ఎన్నో
సాయుధ పోరాట మంటల్లో
మెరుస్తున్నాయ్
సమసమాజ సౌందర్యం కోసం
ఎర్రని త్యాగాలను కురుస్తున్నాయ్

ఈతరం.
సృష్టిస్తోన్న ఎర్ర భయం ముందు
తెల్లభయం నిజంగా తెల్లబోతున్నది
ఇంతెందుకు- ఇన్నెందుకు
విను
ఓ సస్తావ్యవస్థా!

ఈతరం
మెదడులో మార్క్స్
రక్తంలో లెనిన్
గుండెలనిండా మావోసేటుంగ్.

దిగ 'జారుడు'

భూషణం

భయంకరంగా
గాండ్రించిందని
హడలి చచ్చి
వెనక్కి వస్తే
ఇది ఉత్త మట్టి
పులి అని నువ్వ
పోల్చేదెప్పుడు ? !

నీకు గుండెచాలక
తెలివి తలకెగదన్ని
పోరాట మార్గపు
పక్కపక్కల తిరిగి
అడవిలో అన్నలకు
అశ్రుతర్పణగా
రెండు పూలూ
మూడు కబుర్లూ
ముచ్చటగా వదిలి
తిరోగమన మార్గాన్ని
పురోగమన మనుకుంటున్న
నువ్వ పులిని గురిచూచే దెప్పుడు ? !
చూచి చంపేదెప్పుడు ? ! !

పోరాటం పోరాటం
అని నువ్వ అణాపరక
పోరాటాలకు దిగజారి
ఎత్తుకు పై ఎత్తులనే
సిద్ధాంతం చేసుకున్న
నీకూ... అడవికీ
ఆరామడల దూరం !

తుపాకీ గురిచూచి పేల్చినవాడే
పులిని చంపగలవాడు
పల్లకు రోడ్డుమీద
పళ్ళికిలించినవాడు
పులి ముందర నక్కగాడు.

పొలిటికల్ కమిస్సార్

చైనా మూలం : లియూ పాయ్-యు

అనువాదం : అరుణ

(గత సంచిక తరువాయి)

ఇక రెండవ పోరాటం సంగతి. అయిదు నిమిషాల ముందు వరకు అంతా సవ్యంగానే ఉంది. శత్రువుపై ప్రధానమైన దాడిచేద్దామనుకుంటూండగానే శతృవు ఎదురుదాడి మొదలైంది. బెటాలియన్ కమాండ్ పోస్టుకు వందమీటర్లవరకు గుళ్ళు దూసుకొస్తున్నాయి, శత్రువులు పెద్దగా అరుస్తూ టామీగన్ సాయంతో తమముందున్న వాళ్ళందర్నీ తుడిచిపెట్టాలని చూస్తున్నప్పుడు కమిస్సార్ అక్కడే ఉన్నాడు ఆ కాల్పులూ, మంటలూ, చెవులు పగిలిపోయే శబ్దాలూ అతిభయానకంగా ఉన్నప్పటికీ వూ అక్కడే నిశ్చలంగా నిలబడ్డాడు. మౌజర్‌ను తన చేతిలోకి తీసుకుని బెటాలియన్ కమాండరు అరుస్తూ ముందుకు దూసుకుపోయాడు. కాని కొన్ని అడుగుల తర్వాత అక్కడే నిలిచిపోయాడు. అయినా కమిస్సార్ ఒక్క అడుగుకూడ వెనక్కు తిరగ లేదు. సరిగ్గా అటువంటి క్లిష్టపరిస్థితిలో పక్కనే పోరాడుతున్న ఒక కంపెనీ కమాం డర్ పైనుండి ఆదేశాలందకముందే తన దళాన్ని పై మూలగా శత్రువుముందుకునడిపిం చాడు. ఏమాత్రం చప్పుడు చెయ్యకుండా దళసభ్యులు శత్రువుపై తమ బాయ్‌నెట్లను ఎక్కుపెట్టారు. ఈ అతిసాహసవంతమైన దాడికి ఎదురు నిలవలేక శత్రువులు నిలు వునా కుప్పకూలిపోయారు. అప్పటికీ పోరాటరంగంలో ఉన్న కమిస్సార్ ఆ దళం దాడిచేయడంలో చూపిన ధైర్యాన్ని మెచ్చుకున్నాడు. పోరాటం ఆగిన తర్వాత ఆ కంపెనీ కమాండర్ పేరు అడిగి తన డైరీలో రాసుకున్నాడు. అతని పేరు వెన్ సింగ్ కాంగ్. అయితే ఆదరపూర్వకంగా ఇన్‌స్ట్రక్టర్‌ని చూస్తూ అన్నాడు :

"నేనేమన్నానో అతనికి చెప్పొద్దు. తర్వాత అతనిని నా దగ్గరకు రమ్మని చెప్పండి."

వెన్ సింగ్ కాంగ్ షాంటుంగ్‌కు చెందినవాడు; పొట్టిగా, బలిష్టంగా ఉన్నాడు. రెండు గంటల తర్వాత అతడు కమిస్సార్ వద్దకు వచ్చాడు. యుద్ధరంగంలో వెన్, అతని కంపెనీ శత్రువును చిత్తుచేసి విజయం సాధించినందుకు అభినందించిన తర్వాత చిన్నగా నవ్వుతూ కమిస్సార్ వెన్‌ని ఇలా ప్రశ్నించాడు :

"పోరాటంలో మీరు రక్షణ తీసుకున్నారా ?" కొంత సేపటినుండి అతడిదే ఆలో చిస్తున్నాడు.

"లేదు" యాంత్రికంగా అన్నాడు వెన్.

"లేదు... అది మంచిదేనా మరి?"

"ఊహూఁ మంచిదికాదు...."

ఈ అమాయకమైన జవాబువిని కమిస్సార్ పెద్దగా నవ్వాడు.

వూ తన మనస్సులో మనుష్యుల్ని రెండు రకాలుగా విభజించాడు: ధైర్యసాహసాలు కలవాళ్ళు, పిరికివాళ్ళు. పిరికివాళ్ళకు ధైర్యం కలిగించడానికి వారిని ప్రోత్సహించాడు; ధైర్యసాహసాలు కలవాళ్ళ విషయంలో వ్యూహం, ఎత్తుగడలకే అధిక ప్రాధాన్య మివ్వాలనుకున్నాడు.

"ఏమవుతుందన్నది తర్వాతి సంగతి. మీరు తప్పకుండా రక్షణ తీసుకోవాలి శత్రువు ఎదురు దెబ్బతీస్తే మీ దళం ఏంచేసేది? అది ఊహించడానికే భయంగావుంది. కమాండరుకు వ్యక్తిగత ధైర్యసాహసాలు మాత్రమే ఉంటె చాలదు. ఇవాళంటే మీరు చేసింది రైటేకావచ్చు. అది ఒక ప్రత్యేక అత్యవసర పరిస్థితి, కాని రక్షణ విషయంలో మీరు తప్పక శ్రద్ధవహించాలి. పాత అనుభవాలమీద ఆధారపడి ప్రస్తుత సమస్యలను పరిష్కరించాలంటేచాలదు. ఇది ఎత్తుగడలకు సంబంధించిన ఒక ప్రత్యేకసమస్య. ఒక్క విషయం గుర్తుంచుకోండి. ధైర్యసాహసాలతోపాటు నేర్పు ఉంటేనే విజయం తథ్యం." అని వివరించాడు వూ. వెన్ మొదట దయా సంతోషాలతోనిండి ఆకర్షణీయమైన కమిస్సార్ ముఖంవైపు తర్వాత ఖాళీగా వేళ్ళాడుతున్న అతని ఎడమచేతివైపు చూచాడు. "ఇతడు తాను ఒక చెయ్యి పోగొట్టుకున్నానని ఎప్పుడో మరచిపోయినట్టున్నాడు" అనుకున్నాడు.

అవసరమైనదానికంటే ఎక్కువ చెప్పానేమోనని కమిస్సార్ అనుకున్నాడు. ఇంతాచేస్తే ధైర్యసాహసాలు పుణికిపుచ్చుకున్న ఒక కంపెనీ కమాండరుకు ఇంతగా చెప్పాల్సిన అవసరమేలేదు; పోరాటంలో తనంతట తనే నేర్చుకునేవాడు. అసలు విషయమేమిటంటే రక్షణ తీసుకోవడం అనేది ఒక కమాండరుకు పెద్ద అవమానంగా చాలమంది భావిస్తారు. దానిని పోగొట్టడానికి ఈ సంఘటనను అందరికీ తెలియచెప్పాలని నిశ్చయించాడు.

ఆ తర్వాత వాళ్ళిద్దరూ భోజనానికి కూర్చున్నారు. కమిస్సార్ ఒక్క చేత్తోనైనా నేర్పుగా తింటున్నాడు. ఉన్నట్టుండి అతడడిగాడు.

"ఇప్పుడు తమ జీవితం ఎలా వుందనుకుంటున్నారు మనవాళ్లు?" జవాబు కోసం తల పైకెత్తాడు కమిస్సార్. వెన్ సూటిగానే జవాబు చెప్పాడు.

"చాల మంది దేనినైనా తట్టుకొనగలరు. కొంత మంది మాత్రం ఎప్పుడూ [illegible]తోనే ఉంటారు. నామటుకు నాకు ప్రస్తుత పరిస్థితులు ఏమంత కఠినంగాలేవు.

గ్రేట్‌వాల్‌కు దక్షిణంగా మనం చెట్లబెరళ్ళు తింటూ గెరిల్లా పోరాటం చేసిననాటికంటే ఇప్పుడు జీవితం ఎంతో మెరుగ్గావుంది.

ఏమైనా అలాంటి జవాబువిని వూ చాల సంతోషించాడు. అంతా సవ్యంగానే ఉన్నట్టు నటించడం అంటే అతనికిష్టం లేదు. మాట వరసకు తమ పై అధికార్లతో క్రిందివారు "అంతా సవ్యంగానే ఉంది మాకేం సమస్యలే లేవు"అని పై మాటగా చెబుతుంటారు. అటువంటప్పుడు వూ నొక్కి నొక్కి అడుగుతుంటాడు. "నిజంగా? ఏ ఒక్కరివిషయంలోనూ? అంటే సైద్ధాంతిక సమస్యలపై పోరాడేవారే లేరన్నమాట. కార్యకర్తలకేం పనేలేదా? అదేంకాదు, పోరాడటం అంత చిన్న విషయంకాదు. అది చాల కష్టనష్టాలతో కూడుకున్నది ఆ కష్టాన్ని మనం గుర్తించుతాం. ఒక యోధుడు మనస్ఫూర్తిగా పోరాడేవాడైతే మానసిక సంఘర్షణకులోనై తద్వారా తాను ఎవరికోసం పోరాడుతున్నాడో అర్థంచేసుకుంటాడు. ముఖ్యమైన విషయం అదే. అందుకే అతడు వర్గశత్రువును ద్వేషిస్తాడు; కష్టాలంటే ఏమాత్రం భయపడడు. మనవాళ్ళంతా అలా ఉన్నప్పుడుమాత్రమే ఆ యూనిట్ బలంగాను శత్రువును చావుదెబ్బ కొట్టగలిగేదిగాను ఉందని చెప్పవచ్చు."

అంతలో అతనికి ఏదో ముఖ్యమైన విషయం గుర్తొచ్చి ఇలా అన్నాడు:

"మీకు గుర్తుందా? మన దగ్గర ఒక్కొక్క రైఫిల్‌కు ఐదో, ఆరో బుల్లెట్లు మాత్రమే ఉన్నాయి. ఎవ్వరూ వాటిని వృధాచేయాలనుకోవడంలేదు. అయితే 'ఫైర్! ఫైర్!'అని మనం అరిచాం. మనదగ్గర అంతాకలిసి మూడు షెల్సే ఉన్నాయి."

"నేనెట్లా మర్చిపోగలను? ఇప్పుడు ఖాళీ షెల్స్‌ని ఎవ్వరూ ఏరుకోరు. ఏరుకుంటారా?"అని వెన్ పెద్దగా నవ్వాడు.

వెన్ నవ్వు కమిస్సార్‌కు అతిముఖ్యమైనదిగా కనిపించింది. ఆ నవ్వు తమగత పోరాటంయొక్క గొప్పతనాన్నీ ప్రస్తుతం కొంతమేరకు బుల్లెట్లు వృధాకావడాన్నీ వివరించినట్లనిపించింది. వూ చాల సంతోషించాడు. భోజనం పూర్తయింది. అతడు నెమ్మదిగా అన్నాడు.

"సరే. మర్చిపోవద్దు ...దానిని గురించి మీరు ఆలోచించినప్పుడు అంతా సవ్యంగానే ఉంటుంది."

ఒకే దళంలో పోరాడేటప్పుడూ, కందకాల్లో ఒకరిపక్క ఒకరు నేలకు కరచుకొన్నప్పుడు తనను ఎంత బాగా అర్థం చేసుకున్నాడో, ఇప్పుడూ కమిస్సార్ తననంత బాగా అర్థంచేసుకున్నాడని వెన్ అనుకున్నాడు. వెన్ వచ్చినప్పటికంటే వెళ్ళేంతర్వాత కమిస్సార్‌కు అత్యుత్సాహంగాను, ఆత్మవిశ్వాసంతోను ఉన్నట్టు అనిపించింది.

ఇది జరిగింతర్వాత కొద్దిరోజులకే ఆ రెజిమెంట్‌కుసంబంధించిన ఒక తీవ్రమైన సమస్యను వూ పరిష్కరించవలసివచ్చింది. రెండవ బెటాలియన్ ఇన్‌స్ట్రక్టర్ వ్యక్తిగత విషయాలకు ప్రాధాన్యమిచ్చి నామ మాత్రంగా పనిచేస్తుండడమే ఆ సమస్య.

కమిస్సార్ మొదట షెన్ గత జీవితాన్ని గురించి తెలుసుకున్నాడు. గతంలో అతడొక ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు. జపాన్ వ్యతిరేక పోరాటంలో ఒక సారి గాయపడ్డాడుకూడా; అయితే యిప్పుడు ఆర్నెల్లన్నా కాకముందే మూడుసార్లు ఫిర్యాదులు రాసి పంపాడు. పార్టీశాఖ అతనికి అదనపు బాధ్యతలను వప్పగించినప్పుడు దానిని తిరస్కరించేవాడు. అంతేగాక ఆ విషయం రెజిమెంట్ సైనికులందరిముందు చర్చనీయాంశం చేసేవాడు. షెన్ యుద్ధరంగంలో పనిచేయడానికి ఇష్టపడటంలేదని కమిస్సార్‌కు తెలుసు. ఎందుకంటే సైనికజీవితమంటే తనకు ముఖం మొత్తిందని కనిపించిన వాళ్ళందరితోనూ చెప్పేవాడు. ఈ మధ్యనే తన కోరికను నాలుగవసారి పై అధికార్ల ముందుంచాడు. రాజకీయాలలో తనకున్న అనుభవంవల్ల కమిస్సార్ యిది గ్రహించగలిగాడు. ఇది ఒక దీర్ఘకాలిక యుద్ధం. ఇందులో చాలమంది చనిపోవచ్చు. అంతేగాక ఇప్పుడు యుద్ధం అతి తీవ్రంగాను, పాశవికంగాను ఉంటున్నది. ఇదిఅంతా యదార్థమే అయినప్పటికీ, విప్లవ విజయం ఇటువంటి గడ్డుపరిస్థితుల్లోనే నిర్ధారింపబడు తుంది. "నేను చనిపోతానేమో అని భయపడి ఊగిసలాడేవాళ్ళు కొందరు తమ ఆత్మ విశ్వాసాన్ని, ధైర్యసాహసాలను పెంచుకొనలేకపోవడమేగాక ఎటువంటి చొరవ, ఉత్సాహం చూపలేదు. దాంతో వారిలో పోరాటం అంటే విసుగూ, చికాకూ కలుగు తాయి. గ్రేట్‌వాల్ దాటి వచ్చింతర్వాత పరిస్థితుల ప్రాబల్యంవలన మొదటిసారి అలాంటివారి బలహీనతలు బయటపడినాయి... ఇటువంటి చిక్కు సమస్య ఎదురు కావ డంతో వూ దానిని ప్రతిఘటించడానికే నిశ్చయించుకున్నాడు. నిజానికిది పొలిటికల్ కమిస్సార్‌గా తనకు అతిముఖ్యమైన సమస్య అనుకున్నాడు. ఎందుచేతనంటే శత్రు వర్గాలు మనవాళ్ళలో సిద్ధాంతపరమైన సమస్యలు సృష్టిస్తున్నారు. కనుకనే దానికంత ప్రాధాన్యత ఉందనుకున్నాడు.

ఒకచోట పోరాటం అయింతర్వాత మరొకస్థానానికి చేరుకోవడానికి సైన్యం కష్టపడవలసి వచ్చింది, రెండవ బెటాలియన్‌లో కొంతమంది యుద్ధరంగంవదిలివెళ్లి పోయారని మిలిటరీ రిపోర్టులనుండి అతడు తెలుసుకున్నాడు. తన కొత్త క్వార్టర్సుకు చేరుకున్న తర్వాత రెండవ బెటాలియన్ కమాండ్ పోస్టుకు వెళ్లాడు. అది ఒక రైతు ఇల్లు. కాంగ్‌మీద కూర్చుని షెన్ మరో ముగ్గురితో కలిసి ఏదో ఆడుతున్నాడు! కమి స్సార్ అడిగాడు:

"బెటాలియన్ కమాండరెక్కడ ?"

"యుద్ధరంగం వదిలిపోయినవాళ్ళను గురించి తెలుసుకొనడానికి ఐదవ కంపెనీకి వెళ్ళాడు."

"డిప్యూటీ ఇన్‌స్ట్రక్టరెక్కడ ?"

"అతడూ వెళ్ళిపోయిన వాళ్ళను గురించి వాకబుచేయడానికి మెషిన్‌గన్ కంపెనీకి వెళ్ళాడు" అని షెన్ నిర్లక్ష్యంగా జవాబు చెప్పాడు.

అటువంటి మనిషిని క్షమించలేక పోయాడు వూ నిలబడి అదంతా చూస్తుంటే అతని కళ్ళు నిప్పులు చెరుగుతున్నాయి; అయినా ఎలాగో కోపాన్ని దిగమింగాడు కమిస్సార్.

ఇన్‌స్ట్రక్టరు షెన్ వ్యక్తిగత సమస్యల ప్రభావం బెటాలియన్ పై అతి త్రీవంగా పనిచేస్తుందనుకున్నాడు. పోరాటసమయంలో తనక్రింది కామ్రేడ్‌ని చెవిపై ఒక్కటిచ్చాడట షెన్. ఆ కామ్రేడ్ పెద్దగా అరవడంతో బెటాలియన్ మొత్తం ఆయుధాలతో సిద్ధమయ్యారట. ఈ విషయాన్ని అతి తీవ్రంగా సభ్యులంతా చర్చించారు. షెన్ నియమాల నతిక్రమించాడనీ, ఒక అధికారి క్రిందివారిని యిలా కొట్టడం సిగ్గుచేటని వారు భావించారు. ఇన్‌స్ట్రక్టర్ షెన్ మాత్రం తనంత ఘనుడూ, శక్తివంతుడూ.... లేడని అనుకుంటున్నాడు.

ఆ సాయంకాలం కమిస్సార్ రెజిమెంట్ కమాండ్ పోస్టుకు తిరిగి వచ్చాడు. కమాండరు టేబుల్‌మీద కొవ్వొత్తి వెలుగుతూంది. వూ కమాండరుకెదురుగా కూర్చున్నాడు. తన ఒకే ఒక్క చేతిని టేబుల్‌మీద ఆనించి ఒక నిట్టూర్పు విడిచాడు. రెజిమెంట్ కమాండరును కలుసుకున్నాడు కనక తన కష్టాలను అతనికి చెప్పాలనుకున్నాడు. అతనివైపు చూడకుండానే తనలో తను అనుకుంటున్నట్టు ఇలా అన్నాడు :

"అలాంటివాడిని చూస్తూ ఊరుకోలేను. పార్టీ అతనికి అంత ముఖ్యమైన బాధ్యతనిచ్చింది. అక్కడే అతడు పార్టీని దెబ్బతీస్తున్నాడు పార్టీ ప్రతిష్ట అంటే అతనికేమాత్రం లెక్కలేదు."

"షెన్ మాటేనా మీరు చెబుతున్నది ?"

వూ తల పైకెత్తి చూచాడు.

"కామ్రేడ్ ! అతని విషయం ఆలోచించవలసిందే. మనవాళ్ళ అభిప్రాయం అడిగాను. ఒకరేదారినిపోతే అందరూ ఆ దారినే పోయినట్టుంది— మొదట యుద్ధరంగం వదలిపోవటం, తర్వాత పోరాటశక్తి సన్నగిల్లటం, ఆ తర్వాత... మీరే ఊహించండి!

మనం మితవాదులం కాకూడదు. అతని డిమాండ్లను అంగీకరిద్దాం కాని యుద్ధరంగం నుండి మాత్రం అతనిని పంపొద్దు; ఇంకా ఓపికతో అతనికి తెలియచెప్పి మంచిదారిలోకి తేవడం మన కర్తవ్యం. రెజిమెంటల్ కమాండ్ పోస్ట్‌లో పనిచేయడానికి పంపుదాం. మీరే మంటారు ? కొత్తవాళ్ళను అతని స్థానంలోకి ప్రమోట్ చేయవచ్చు. ప్రజలకొరకు పాటుపడుతూ, రాజకీయ కర్తవ్యాన్ని నిర్వహించే కార్యకర్తలు కావాలేగాని సొంత విష యాలు చూచుకొనేవాళ్లుకాదు. డిప్యూటీ ఇన్‌స్ట్రక్టర్‌ని అతని స్థానంలోకి ప్రిమోట్ చేయమని నేను ఇప్పుడే ఫోన్‌చేస్తాను. అతడు గట్టివాడే."

తను చెప్పినదానికి రెజిమెంటల్ కమాండరు ఒప్పుకోవడంతో వూ ముఖంలో చిరునవ్వు తొంగిచూచింది. మళ్ళీ ఎప్పటిమాదిరే ఉత్సాహంగా సంతోషంగా ఉన్నాడు.

షెన్‌ను రెజిమెంట్ కమాండ్ పోస్టుకు పంపడాన్ని అతని బెటాలియనువాళ్ళంతా ఒప్పుకున్నారు. షెన్ మాత్రం అందరితో యిలా చెప్పాడు.

"నన్ను పరిశీలనలో ఉంచారు!"(అంటే అతని పనులనుగురించి ప్రశ్నించవచ్చు)

నిజానికి తనను రెజిమెంట్ కమాండ్ పోస్టుకు మార్చిన రోజు కమిస్సార్‌కూ తనకూ జరిగిన సంభాషణను అతడు మరచిపోలేదు అతడు లోపలికి వెళ్ళేటప్పటికి కమిస్సార్ గోడలకు ఉన్న మ్యాప్‌లవైపు చూస్తూ ఆలోచిస్తున్నాడు చాలా సేపటికి అతడు ఇటు తిరిగి షెన్‌ను చూచాడు అతని ముఖం కఠినంగా వుంది. ఎడమవైపున ఖాళీ చొక్కాచెయ్యి నిశ్చలంగా వేళ్లాడుతూంది. నెమ్మదిగా వూ అన్నాడు:

"రెజిమెంట్ కమాండ్ పోస్టులో మీ శాయశక్తులా పనిచేయండి."

కొంతసేపటి తర్వాత షెన్ అతికష్టంమీద అన్నాడు:

"నేను అడిగింది... విశ్రాంతి..."

"ఏమిటీ? విశ్రాంతా? ఆ మాటను మనం తలచుకోవడానికే వీల్లేదు. మనం పోరాడుతున్నాం కాని విశ్రాంతి తీసుకోవడంలేదు."

కాని షెన్ వ్యక్తిగతవాదపు ఊబిలో కూరుకుపోయాడు. అతడు తనలో తాను "నేను ఒకసారి పోరాటంలో గాయపడ్డాను. విప్లవానికి చేయగలిగినదంతా చేసేశాను, ఎప్పుడూ సుఖపడలేదు; ఇప్పుడు విజయం చేరువలో ఉంది. ఈ కొద్దిరోజులూ చావును ఎలాగైనా తప్పించుకొనగలిగితే బాగుంటుంది"అనుకుంటాడు. అయితే ఇదంతా కమి స్సార్‌కు ఎలా చెప్పగలడు? గాయపడ్డానని చెబుదామా అంటే కమిస్సార్ ఒక చెయ్యే పోగొట్టుకున్నాడు కదా. అందుకే అతడు ఏమీ చెప్పకుండానే కమిస్సార్ మాటలను లెక్కచెయ్యని ధోరణిలో నిలబడినాడు. ఉన్నట్టుండి కమిస్సార్ అతనికి దగ్గరగా వచ్చాడు. అతని కళ్ళలోని దయనూ, కాంతినీ షెన్ గుర్తించాడు.

వూ నెమ్మదిగా ఇలా అన్నాడు:

"కామ్రేడ్ పోరాటంలో మీరు గాయపడిన మాట నిజమే; విప్లవం మిమ్మల్ని మర్చిపోదు; కాని ఒక్కసారి మీరు గాయపడినంత మాత్రాన... ఆలోచించండి. మీరే ప్రశాంతంగా ఆలోచించండి. మీరూ రక్తాన్ని చిందించారు... నేనూ చిందించాను. మన రక్తం వృధా అవుతుందనుకుంటున్నారా? ఇప్పుడు ప్రజలలో చైతన్యం మేల్కొన్నది. చేయిచేయి కలిపి పోరాడుతున్నారు. బ్రహ్మాండమైన విజయం అతిచేరువలో వుంది. చివరికంటా విప్లవం కొరకు పోరాడటంకన్నా గౌరవప్రదమైనదేమైనా వుందేమో ఆలోచించండి."

నిజానికి కమిస్సార్ అతనిని తీవ్రంగా నిందించలేదు. అందుకు పూర్తి విరుద్ధంగా అతడు ఓపికగాను, నెమ్మదిగాను నచ్చచెప్పాడు. ఇది షెన్ హృదయాన్ని కదిలించి అతని అంతరాంతరాలను కలచివేసింది. ఆ తర్వాత కమిస్సార్‌వద్దకు వెళ్ళి అతనితో గట్టిగా మాట్లాడాలని అనుకునేవాడు. ప్రతిసారి కోపంగా తలుపువరకు వెళ్ళేవాడు; వూ స్నేహపూర్వకంగా పలకరించడంతో ఏదోవిధంగా అతని కోపం సర్దుకునేది. అదే సమయంలో సైన్యంలో వర్గవిద్యను బోధించారు; "కష్టాలు చెప్పుకునే" ఉద్యమాన్ని మొదలు పెట్టారు. మిగిలిన యోధులందరిలాగే కమిస్సార్ కూడ తన గతాన్ని అక్షరం పొల్లుపోకుండా గుర్తుకు తెచ్చుకున్నాడు; గతాన్ని ఇప్పటితో పోల్చుకున్నాడు. క్వార్టర్సుకు చేరుకున్న తర్వాత షెన్‌ను గార్డుల కంపెనీకి పంపితే మంచిదని భావించి వూ అలాగే చేశాడు. అక్కడ తన పని నామమాత్రమేననీ, వారిద్వారా తనను ఎడ్యుకేట్ చేయడానికే అక్కడికి పంపుతున్నారని షెన్ అర్థంచేసుకున్నాడు. దాంతో అతనిలో ద్వేషం తలెత్తింది. చేసేదేంలేక ప్రతి రోజు గార్డుల కంపెనీ ఉన్న దొడ్లోకి పోయి, ముళ్ళమీద కూర్చున్నట్టు కూర్చునేవాడు.

"ఎన్ని బాధలు పడ్డాం మనం" అన్నారు వాళ్ళు.

"అయితే? వాటిని గురించి డప్పువాయించుకుంటూ తిరగాలా?" అనుకున్నాడు షెన్.

వాళ్ళు ఆ బాధల్ని తలచుకుని విని కన్నీరు కారుస్తూంటే "విప్లవ వీరులు దుఃఖించనేకూడదు" అనుకుంటాడతడు. ఎప్పుడైనా తీరికవుంటే రిపోర్టివ్వమని కమిస్సార్ అడుగుతాడేమోనని చెవులు మాత్రం మూసుకోలేకపోతున్నాడు.

ఒకసారి కమిస్సార్ చిన్న నిట్టూర్పు విడిచి అతని కళ్ళలోకి సూటిగా చూస్తూ అన్నాడు:

"ఇన్ని సంవత్సరాలుగా మనం విప్లవంలో పాల్గొంటున్నా మనబుద్ధి వికసించనే లేదు. మొదట మనమందరం పేదవాళ్ళమే. విప్లవపోరాటంలో చేరి ఐక్యమయ్యాం; అయినప్పటికీ ఇప్పుడు మాత్రమే, ప్రతివాళ్లూ గతంలో ఎలా బాధపడ్డారో విన్నతర్వాత మాత్రమే గతంలో నేను బాధలుపడిన విషయాన్ని వేలాది మన సోదరసైనికులు పడిన బాధలనూ యదార్థంగా గుర్తించగలిగాను."

నిజానికి ఈశాన్య విముక్తి ప్రాంతంలో భూసంస్కరణోద్యమకాలంలో చైతన్యవంతులైన రైతులు అనేకమంది సైన్యంలో చేరారు. ఇంత కాలం బాధలు పడడానికి, కష్టపడడానికి మాత్రమే అలవాటుపడిన వారిచేతులు ఈనాడు తుపాకులు పట్టాయి. ఇది బ్రహ్మాండమైన విషయంకాని సామాన్యమైనది కాదు. యధాలాపంగా షెన్ రైతుప్రజానీకపు బాధలను చివరికి తన బాధలనూ తలచుకున్నాడు. అతడు మధ్యతరగతి రైతు కుటుంబానికి చెందినవాడైనప్పటికీ, పది సంవత్సరాలకిరితం పరదలూ, కరువూ వచ్చినప్పుడు అతడుకూడ ఆకులు తిని చెట్ల బెరడును నమిలినవాడే. ఉపవాసాలతో అతడు చావుకు అతిచేరువకాగా, వస్తులతో, రోగాలతో అతని తల్లి మరణించింది. ఆ తరువాత ఎనిమిదవ రూట్ ఆర్మీ వచ్చి కౌలురేట్లు, వడ్డీ తగ్గింపు, ఉత్పత్తి పెంపుదల ఉద్యమాలు నిర్వహించిన తర్వాతే క్రమంగా అతని కుటుంబం ఉన్నత మధ్యతరగతి కుటుంబస్థాయికి చేరుకొనగలిగింది.

గతాన్ని గురించిగాని, భవిష్యత్తును గురించిగాని ఆలోచించని కోవకు చెందినవాడు షెన్. అయితే ఒకసారి అతని మనస్సులో గతం కదలాడడం ఎప్పుడు మొదలైందో అప్పటి నుండి తన అవాస్తవిక దృక్పథాన్ని క్రమంగా మార్చుకున్నాడు షెన్. మనిషి తన పూర్వపు జీవితాన్ని మర్చిపోకూడదని షెన్ గుర్తించాడు– ఇన్ని సంవత్సరాలు విప్లవంలో భాగంగా ఉన్నతర్వాత ధనవంతుల నాయకత్వాన్ని తాను ఎలా ఆమోదించగలడు? అనుసరించగలడు? విదేశీ గడియారాలు, పెన్‌లు, బంగారపు ఉంగరాలంటే తనకెంత మోజు? వాటినిచూస్తూ తనను తనే మరచిపోయేవాడు దీనికంతకూ తనను తనే తిట్టుకోవాలిగాని ఇతరుల్ని కాదు. దేనికైనా ఒకటికి పదిసార్లు ఆలోచించేవాడైనప్పటికీ, తన బలహీనత గుర్తొచ్చేటప్పటిక మాత్రం మూలకారణాన్ని గుర్తించకుండా దాటవేసేవాడు, ఆ విషయాన్ని తనలో తాను ఒప్పుకొనటానికి కూడ సిగ్గుపడేవాడు దాంతోపాటు మరికొన్ని సమస్యలు కూడ ఉన్నాయి; ఇంత జరిగింతర్వాత తన బెటాలియన్‌కు తిరిగి వెళ్ళగలడా? రాత్రింబగళ్ళు పాడిందేపాట– ముందుకు పోవడం, పోరాడటం, మీటింగులు పెట్టడం, అనుభవాన్ని నెమరు వేసుకొనటం, ఇదంతా ఎంత విసుగ్గా ఉంది! అంతకుమించి ఇప్పుడు తాను తిరిగివెళ్ళినప్పుడు వాళ్ళ

ముఖాలెలా చూడగలడు? ఈ ఆలోచన రాగానే మళ్ళీ కుంగిపోయాడు. శిశిరాకాశం కొంత సేపు కాంతివంతంగాను, కొంత సేపు మబ్బులతో కూడి ఉన్నట్లు అతని మనస్సు ఎప్పుడెలా మారుతుందో చెప్పటం కష్టంగా ఉంది. రోజురోజుకూ అతనిలో ఈ సిద్ధాంత పరమైన పోరాటం జరుగుతూండడంతో, అతని భావాలు క్షణక్షణం మారుతూండడంతో కమిస్సార్‌ను కలుసుకోవాలనిపించలేదు. కొన్నిసార్లు ఇలా అనుకుని తనకుతనే ఓదార్చుకునేవాడు: "అతనిని చూడడానికి భయపడేటంత చెడ్డపని నేనేం చేశాను?" కమిస్సార్‌కు దూరంగా ఉండాలని షెన్ ఎంత ప్రయత్నించినా ప్రతిరోజు అతనిని చూడక తప్పేదికాదు. ఎంత పని ఒత్తిడిఉన్నా, కష్టాలుపడుతున్నా వూ ఎప్పటిలాగే నవ్వుతూ, ఉత్సాహపరుస్తూ అలసట అనేది ఎరగనట్టుండేవాడు. షెన్ రెజిమెంట్ కమాండ్ పోస్టుకు వెళ్ళినప్పుడు కమిస్సార్ వంటమనిషిని మందలించటం చాలసార్లు విన్నాడు:

"మాకు మరల మంచి భోజనం వండినందుకు కృతజ్ఞత. అయితే ఇంకొకసారెప్పుడూ ఇలాచెయ్యొద్దు. లక్షలాది రైతులకు తినడానికి తిండేలేదు. సైనికుల జీవితం ఇంతకష్టంగా ఉంది అటువంటి పరిస్థితిలో మన సుఖం మనంచూచుకోకూడదు"

మరొకసారి సరఫరాశాఖ ముఖ్యునితో వూ ఇలా అన్నాడు:

"ఏవైనా మంచి ఆహార పదార్థాలున్నప్పుడు వాటిని సైనికులకే పంపండికాని మాకు పంపొద్దు. సైనికులనుగురించే మొదట ఆలోచించాలి. అధికారులనుగురించి మాత్రమే ఆలోచించేపద్ధతులు మార్చుకోవాలి."

కష్టాలను చెప్పుకొనే ఉద్యమం తర్వాత ఈ విషయాలు మరింత స్పష్టంగా బయటపడినాయి.

కమిస్సార్ నిరాడంబరత్వం, విసుగులేకుండా అతడు పనిచేసే తీరుచూచి షెన్ ఆశ్చర్యపడ్డాడు. తనలో మార్పుకోసం వూ ఎదురుచూస్తున్నాడని అతనికి తెలుసు. ఇది తెలిసింతర్వాత అతని మనస్సుకు నిలకడే లేకపోయింది.

ఆ సాయంకాలం ఉదయంలోగా పోరాటరంగానికి పోవలసి వుంటుందనే వార్త విని షెన్ మనస్సు అశాంతితో నిండిపోయింది వెళ్లాలా? వద్దా? ఏదో ఒకటి నిర్ణయించుకోవాలి. చిట్టచివరకు ఇంక ఒక్క రోజుకూడ ఇక్కడ ఉండకూడదనుకున్నాడు. తనను వెనక్కు పంపమని ఖచ్చితంగా అడగాలని నిర్ణయించుకున్నాడు. ఆ నిర్ణయం తర్వాత ఆలోచించవలసిందేమీ లేకపోయింది. ముందు గొయ్యి ఉన్నాసరే యీసారి ముందుకే వెళ్లాలనుకున్నాడు. ఆ నిశ్చయంతోనే తిన్నగా రెజిమెంట్ కమాండ్‌పోస్ట్‌కు వెళ్ళాడు.

కమాండ్ పోస్ట్ కిటికీలోనుండి మినుకు మినుకు మంటున్న దీపపుకాంతిలో వచ్చే పోయే మనుషుల నీడలు కనిపిస్తున్నాయి. లోపల కమిస్సార్ పనిలో ఉండి ఉండవచ్చు అనుకున్నాడు. ఆగిపోయాడు.

అనుకున్నట్లే లోపలనుండి మాటలు వినిపిస్తున్నాయి ఏదో సమస్యపై చర్చ జరుగుతూంది. కమిస్సార్ నవ్వు ప్రతిధ్వనించింది. వెంట వెంటనే టెలిఫోను మోగుతుండగా, ఒకదాని తర్వాత ఒక సమస్యను పరిష్కరిస్తూనే వున్నాడు.

కొంత సేపు అలాగే నిలబడి చూచాడు షెన్. తాను వచ్చినట్టు తెలియచేద్దామను కుంటూంటేనే శరీరమంతా చలిచెమటలు కమ్మినట్లూ, ఏదో తెలియని చీకటి అగాధం లోకి పడిపోతున్నట్టూ అనిపించింది. ఆ కారు చీకటిలో కమిస్సార్ ఒక్కడే అతనికి కాంతిరేఖగా కన్పించాడు, అతడు పురోగమించడమేగాని విశ్రాంతి ఎరగడు. మరి తనో ? వెలుతురుకూ తనకూ మధ్య కిటికీకి పెట్టిన కాగితమొక్కటే అడ్డుగా ఉన్నప్పటికీ గాఢాంధకారంలో మునిగి ఉన్నట్లనిపించింది. చీకటిని గురించి తీవ్రంగా ఆలోచిస్తూ "చీకటి !"అని పైకే అనేశాడు. దానిని గురించి జాగ్రత్తగా ఆలోచించాడు అప్పుడు తన కనుబొమ్మలమీది చల్లని చెమటను తుడుచుకున్నాడు.

సరిగ్గా అదే సమయంలో బహుశా రెజిమెంటల్ కమాండరుకేమో కమిస్సార్ ఫోను చేస్తున్నాడు.

"మంచిది"అన్నాడు వూ బిగ్గరగా. శత్రువుమీద దాడిచేసే బాధ్యతను మొదటి బెటాలియన్ తనకే ఇవ్వమంటూందా ? సరే. సరే. మీకు తెలుసుకదా మెదటి బెటా లియన్ ఎప్పుడూ అన్నిట్లోనూ ముందే వుంటుంది."

అప్పుడు ఉత్సాహం, ఆత్మవిశ్వాసం పొంగులువారుతున్న రెజిమెంటల్ కమాం డరు గొంతు వినిపించింది.

"కామ్రేడ్ వూ ! మీరు ఫోనుదగ్గరే ఉండండి ఎంత ఐదు నిమిషాలు కూడ పట్టదు ఇంకా కొంత చెప్పవలసి వుంది."

కమాండరు తన బెటాలియన్‌ను గురించే చెబుతున్నాడని షెన్‌కు తెలుసు. వెంటనే అతడు ఏం జరుగుతుందో ఊహించుకొనసాగాడు. ఒకదానితర్వాత ఒకటి ఉత్తరాలు తన చేతిలో పెడుతున్నారు— మమ్మల్ని పంపమంటే మమ్మల్ని పంపమని కంపెనీలు రాసినఉత్తరాలు. ఎప్పుడైతే తాము పోరాటానికి వెళుతున్నామని తెలుసు కుంటారో అప్పుడు సైనికులందరిలో ఉద్రేకం, పట్టుదల, ఉత్సాహం వెల్లివిరిస్తూం టాయి. అటువంటి రాత్రి కంపెనీ హెడ్‌క్వార్టర్సులో ఏ ఒక్కరూ ఆదమరచి నిద్రి

పోరు. దళనాయకులూ, పోరాట యోధులూ తలుపుదగ్గర గుమికూడారు. వారు చెమటలు కక్కుతూ పరుగెత్తుకొచ్చారు. ఎందుకంటే ఎవరైనా తమకంటే ముందే అక్కడికి చేరుకుని శత్రువుపై మొదటిదెబ్బతీసే అవకాశం తమకు లేకుండా చేస్తారేమోనని భయం.

అప్పుడు దళకార్యకర్తలు షాక్‌స్క్వాడ్‌కు ఎవరు నాయకత్వం వహించాలాఅని వాదించుకుంటున్నారు. ఆ ఉత్సాహంలో పెద్దగా అరుస్తున్నామనికూడ మర్చిపోయారు వాళ్ళు... తాను ఇంకా అక్కడే ఉన్నట్లు, వారితోపాటు మునివేళ్ళపై నిలబడి ఆ వీరోచిత సంతోషాన్ని పంచుకుంటున్నట్లూ భావించాడు షెన్. బెటాలియన్ కమాండరుతో కలిసి యోధులు స్వహస్తాలతో రాసిన ఉద్రేకపూరితమైన ఉత్తరాలు ఒకదాని తర్వాత ఒకటి చింపుతున్నట్లనిపించింది. ఆ ఊహలలోనే కొట్టుకుపోతున్నాడు. [టెలిఫోను కోసం చెయ్యిచాపుతాను...ఇప్పుడు?] కిటికీ వెలుపల నిలుచున్న అతనిలో ఆసక్తితో పాటు అసహనంకూడ ఎక్కువైంది— తన బెటాలియన్ యింత ఆలస్యం చేస్తున్నదెందుకు?

ఉన్నట్టుండి టెలిఫోను మోగటం వినిపించింది. నిశ్శబ్దంగా వింటున్నాడు కమాండర్ మొదట నవ్వాడు. తర్వాత నిరుత్సాహంగా అన్నాడు.

"రెండవ బెటాలియనా? దాడిచేసే ప్రధాన బాధ్యతను మీకివ్వాలా?... సరే, నాకు తెలుసుగా. మనవాళ్ళను ప్రోత్సహించండి. మీరెప్పుడూ జ్ఞాపకమే ఉంటారు.

షెన్ పనిచేసిన బెటాలియనే రెండవ బెటాలియను. డిప్యూటీ ఇన్‌స్ట్రక్టరను కుంటా ఫోనుచేసేది అనుకున్నాడు. ఇదివరకు ఆ పనులన్నీ తనవే. అదంతా వింటూ అక్కడ ఒక్కక్షణంకూడ నిలువలేక వెనుదిరిగి బయటకు వెళ్ళిపోయాడు. ఆకాశంలో చుక్కపొడిచి పైకి వస్తూంది. ఆ చీకటిరాత్రి చీమ చిటుక్కుమన్నా వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. తను దాటిపోతున్న ప్రతి గది కిటికీలోనుండి దీపకాంతి మినుకు మినుకుమంటూంది. వారంతా పోరాటానికి సిద్ధమౌతున్నారని తనకు తెలుసు. తానొక్కడే... మరొకవైపు పయనిస్తున్నాడు, తెల్లవారేసరికి తనలో తాను అంచనా వేసుకుంటున్నాడు: ఒకటి, రెండు, మూడు .. ఐదుగంటలలో వాళ్ళంతా శత్రువుమీదికి తుపాకులు ఎక్కుపెడుతూంటే తాను వెనక్కు వెళుతుంటాడు. నిజమే. వాళ్ళను వదిలిపెట్టిపోతున్నాడు. అయితే ఏమిటి?... ఇప్పటినుండి సైన్యంలో తననెవ్వరూ లెక్కచెయ్యరు. వెనక్కు వెళ్ళడమా? విశ్రాంతి తీసుకుంటున్న వాళ్ళంతా తిరిగి యుద్ధరంగానికి రావాలని పార్టీ ఆదేశంకదా! దక్షిణానికి పోవడమా? అధ్యయన తరగతుల్లో అడవాళ్ళడుగుతూంటే తానేం చెప్పాలి?

ఉన్నట్టుండి తనలో తాను చెప్పుకున్నాడు.

"అనేక పోరాటాల్లో పాల్గొన్నావు. రక్తం చిందించావు. ఇలా మరలిపోతూ ఎక్కడికి చేరుకుంటావు? విప్లవాన్నొదిలేసి— విప్లవం యింకా పురోగమించుతూనే వుంది. నువ్వు వెనుకబడి, చెడిపోయి పనికిరాని చెత్తగా తయారవుతావు."

తన బెటాలియన్‌ను గురించి కంపెనీలను గురించి అదేపనిగా ఆలోచించాడు— అందరూ ఒకే కాంగ్ మీద ముడుచుకొని నిద్రపోవడం, ఒకే కుండలోది తినటం, పోరాటరంగంలో అందరూ కలిసి దాడిచేయడం, ఒకరికొకరు సాయపడుతూ మద్దతుగా నిలబడటం తలచుకున్నాడు. పని అంటే తను చూపిన అయిష్టత, నిరుత్సాహం మొదలైన గతంలో తాను చేసిన పొరబాట్లను తలుచుకున్నాడు. తాను సరిగా వారిని సిద్ధపరచక పోవడంవల్లనే సైన్యం సరిగా పోరాడలేదు. తత్ఫలితంగా ఎందరో ప్రాణాలు కోల్పోవడానికి తాను కారణమయ్యాడు. చిటికెనవేలునుండి తలవెంట్రుకలవరకు ఒక్కసారి అతని శరీరమంతా కంపించిపోయింది. అతని గుండెల్లో మంటలు మండుతున్నట్లనిపించింది. చిట్టచివరగా ప్రతీయోధుని వీరోచితవదనం అతని కళ్ళముందు తళుక్కుమన్నట్లుంది. ఒకే ఒక్క చేతితో, తలపైకెత్తి తుపాకి గుళ్ల ఆహ్వానించుతుండగా ముందుకు నెట్టుకొనిపోతున్న కమిస్సార్‌ని చూచాడు— మరి నీవో— నిజంగా నీవు విప్లవాన్ని వదిలి పోగలవా? ఎలాంటి వాడివి నువ్వు? ఇంకా వారిని నీ సోదరులని పిలుస్తావా? అతని కళ్ళనుండి వేడి కన్నీటి బిందువులు రాలుతున్నాయి. తానొక అగాధంవైపు పయనించుతున్నానని గుర్తించాడు. ఏం జరిగినా ముందుకే పోవాలిగాని వెనక్కు గాదు. వెక్కిళ్ళతో ఉగిపోయాడు.

ప్రస్తుతానికి షెన్ సమస్యను మర్చిపోయి కమిస్సార్ తన సర్వశక్తుల్నీ పోరాటంపై కేంద్రీకరించాడు.

మొదట శత్రువుయొక్క బలమైన కేంద్రంపై దెబ్బ తీశారు. దాడి చేస్తున్న బెటాలియనులోని పదవ కంపెనీ సైనికులు చాలమంది నేలకొరిగారు. పరిస్థితి విషమించడంతో వెంటనే కొత్త వాళ్ళను పంపి నష్టాన్ని భర్తీచేయాలని రెజిమెంట్ అధికార్లు నిశ్చయించారు. పట్టుదలతో పోరాడే సాంప్రదాయంగల పదవకంపెనీ తమకే ఇంకొక అవకాశం ఇవ్వమని రెజిమెంట్ పార్టీ బ్రాంచ్‌ని అర్థించింది. రెజిమెంటల్ కమాండరు డివిజనల్ కమాండ్ పోస్ట్ నుండి స్వారి చేస్తూ వచ్చాడు. తలంతా చెమటతో తడిసిపోగా టోపీ తీసివేశాడు. నమ్మకంతో, నెమ్మదిగా అన్నాడు:

"కామ్రేడ్ వూ! మేం వెంటనే పోరాటానికి వెళ్లాలని నిశ్చయించాం!"

కమిస్సార్ నవ్వుతూ పదవ కంపెనీ అభ్యర్థనను అతని చేతికిచ్చాడు. రెజిమెంటల్ కమాండర్ అది చదివి సంతోషంతో నవ్వుతూ వెనుదిరిగి వెళ్ళబోయాడు.

కమిస్సార్ అతనిని ఆపి అడిగాడు.

"ఎక్కడికి ?"

"పదవ కంపెనీకి. దాడి మొదలుపెట్టడానికి !"

కమిస్సార్ స్థిరంగా అన్నాడు;

"నన్ను వెళ్ళనివ్వండి. మీరు రెజిమెంట్ మొత్తాన్ని శత్రువుపైకి నడిపించండి. ఒకసారి మనం కొండ మీదికి చేరుకోగలిగితే మీరు తిన్నగా ముందుకు నెట్టుకురావచ్చు" గాలిలో ఒక అర్థచంద్రాకారం గీసి చూపించాడు.

సన్నగా వాన చినుకులు పడుతున్నాయి ఆ అభ్యర్థన కాగితాన్ని జేబులో పెట్టుకొని ఒక బురదదారిని కొండమీదికి బయలుదేరాడు. ఒక రాత్రంతా కాపలా కాస్తూ యిప్పటికీ సైన్యం కొండమీదే వుంది. దక్షిణాన శత్రువు ఆక్రమించిన కొండను స్వాధీనం చేసుకునే బాధ్యతను వారికివ్వబోతున్నాడు కమిస్సార్. వారు ఉన్నచోటు నుండి దాడిచేయాలంటే ఎక్కను, దిగనూ దాదాపు రెండు మైళ్లుంది; అయితే వ్యూహరీత్యా ప్రధానమైన ఆ కొండను స్వాధీనం చేసుకోవటమే విజయసాధనకు కీలకమైన విషయం. వాళ్ళ బాధ్యత అతిముఖ్యమైనదని మాటలకంటే తాను స్వయంగా రావడమే వివరించగలదని కమిస్సార్ అనుకున్నాడు.

మధ్యాహ్నం మూడు గంటలకు దాడి ప్రారంభమైంది. మొదటి, రెండవ, మూడవ దాడుల్ని భయంకరంగా కాల్పులు జరుపుతూ శత్రువు తిప్పికొట్టాడు. దానితో ఆ కంపెనీకి పట్టుదల ఎక్కువైంది. ఒకవైపునుండి శత్రువును దెబ్బ కొట్టలేకపోతే మరొకవైపునుండి ప్రయత్నించింది. ఒక్క క్షణం కూడ విశ్రాంతి లేకుండా అన్నివైపులనుండి శత్రువుపై తీవ్రంగా దాడిచేస్తున్నారు. ఎలాగైనా ఆ కొండను స్వాధీనం చేసుకోవడమో లేదా ఆ ప్రయత్నంలో చనిపోవడమో తేలిపోవాలి. ఫిరంగిగుళ్ళు తుపాకి తూటాలు అతివేగంగా దూసుకొస్తున్నాయి; ఆ కొండప్రాంతమంతా దట్టమైన పొగతో నిండిపోయింది.

ఆ కొండను ఆనుకుని ఉన్న మరొక కొండపై నిలబడి కమిస్సార్ తన ఫీల్డ్ గ్లాసెస్‌లోనుండి పరిశీలనగా చూచాడు.

సాయంకాలమయ్యేసరికి పోరాటం కీలకస్థాయికి చేరుకుంది. ఇప్పుడు ఆకొండను ఆక్రమించుకోలేకపోతే ప్రతిష్టంభన ఏర్పడటమో లేక పరిస్థితి విషమించడమో జరుగు

తుంది. అదనపు బలాలను శత్రువు అక్కడికి రప్పించగలిగితే రెజిమెంట్ ఆ దాడిని ఎదుర్కొనలేకపోవచ్చు. వూ వెనక్కు తిరిగి తనచేతిలోని ఫీల్డ్‌గ్లాసెస్‌ని సహాయకుడు లీపిన్‌కు ఇచ్చి కిందికి దిగి ఆ కొండ ఎక్కుతూంటే అతని ఖాళీచెయ్యి గాలికి వూగులాడుతూంది. అతనితోవున్న కార్యకర్తలు రెండుసార్లు అతనిని ఆపడానికి ప్రయత్నించారు; వాళ్ళవైపు చూడనైనా చూడకుండా వాళ్ళ చేతులను నెట్టివేసి ముందుకు సాగిపోయాడు.

చెవులు బద్దలయ్యే శబ్దాలతో 60 మిల్లిమీటర్ల గుళ్ళు అతనిచుట్టూ రాళ్ళూ, మట్టీ వెదజల్లుతున్నాయి; అయినా అతడు చెక్కుచెదరలేదు. కాల్పులు ఆగిన ప్రతి క్షణం వేగంగా కొండమీదికి పరుగెత్తుతూ తిన్నగా ముందుకు పోతూనే వున్నాడు. తుపాకి గుళ్ళు అతని తలమీదినుండి దూసుకుపోతున్నాయి. అలాంటి శబ్దాలు విని చాలాకాలం కావడంతో ఆసక్తిగా తలపైకెత్తాడు; కాని ఒక్క క్షణంకూడ ఆగలేదు. గాయాలు తగిలి దారిపక్కన పడివున్న యోధుల కళ్ళన్నీ అతనిపైనే వున్నాయి. కాని ఏఒక్కరూ మాట్లాడలేదు. పైకి చేరుకుంటూండగా ఒక కార్యకర్త చేతినుండి మీడియం రైఫిల్‌ని గుంజుకున్నాడు కమిస్సార్. దాడికి తనే స్వయంగా నాయకత్వం వహించబోతున్నాడు. శత్రువును నాశనం చేయడానికి తన బలాన్నికూడ సైనికుల బలంతో జోడించాలనుకున్నాడు. సరిగ్గా అదే సమయంలో వెనుకనుండి ఎవరో అతని ముందుకు దూసుకుపోయారు. ఎవరో గుర్తుపట్టడానికి వీల్లేనంత వేగంగా ముందుకు దూసుకుపోయాడా మనిషి. కాని శక్తికొద్దీ ఆ మనిషి అరుస్తూంటే వినడానికి ఒక్క క్షణం ఆగాడు.

"కాల్చండి! కొండపైభాగాన్ని ఆక్రమించండి! చియాంగ్ కై-షేక్ నశించాలి"

అతని ధైర్యంతో ఉత్తేజితులైన సైనికులు అతనితోపాటే ముందుకురికారు; వెంటనే కొండమీదికి దాడి మొదలుపెట్టారు. కొద్దిసేపు ముఖాముఖి పోరాడారు. ఆ తర్వాత శత్రువు తట్టుకొనలేక కిందికి పారిపోతూంటే రెజిమెంటంతా అరుచుకుంటూ వాళ్ళ వెంటబడి తరిమారు.

ఆ కొండమీద నిలబడి విజయం సాధించినందుకు గుర్తుగా డప్పులు మోగించమని అజ్ఞాతయోధుడు ఆదేశించాడు. రెజిమెంట్ కమాండర్‌కు అది సంకేతమన్నమాట. వెనుకనుండి వెనకే వరుసగా చచ్చిపడివున్న శత్రువులను చూచుకుంటూ కమిస్సార్ కిందికి దిగాడు. కొండ ఆవలివైపునుండి తుపాకులు గర్జిస్తూనే వున్నాయి. అంటే దాడి చేస్తున్న దళం ప్లానుప్రకారం పురోగమిస్తూందన్నమాట. ఇరవై నిమిషాల తర్వాత పోరాటం ఆగిపోయింది. చెమటతో తడిసి, మట్టిగొట్టుకున్న ముఖంతో కమిస్సార్ గర్వంగా పదవ కంపెనీ సైనికుల దగ్గరకు నడిచాడు. ఆ దాడిని నడిపించింది ఎవరో

కాదు, ఇన్‌స్ట్రక్టర్ షెన్ అని కమిస్సార్ అప్పుడే తెలుసుకున్నాడు. షెన్ తనను అనుసరించుతున్నాడనే విషయం తానే మాత్రం గమనించనేలేదు. ప్రతి చిన్న సంఘటననూ గమనించగలవాడు వ్రూ. ఉద్రేకపూరితమైన ఆ క్షణంలో దాడి చేయడంలో వస్తున్న కొత్త మలుపులను గురించే ఆలోచించాడు కాని చుట్టూవున్నవారిని గమనించనే లేదు తాను చేసిన పనికి తనను తానే నిశ్శబ్దంగా మందలించుకున్నాడు. ఇప్పుడు ప్రతి పోరాటం తర్వాత జరిగినట్టుగానే సైనికులంతా అతని చుట్టూ గుమికూడారు. షెన్ పక్కన నిలబడి సిగరెట్ కాలుస్తూ చిన్నగా నవ్వి నెమ్మదిగా అన్నాడు కమిస్సార్.

"మామూలు సమయాల్లో చాంగ్ ఎవరో లీ ఎవరో నేను గుర్తించగలను, కాని యుద్ధరంగంలో మాత్రం అక్కడ తమ బాధ్యతల్ని నిర్వర్తించేవారినే తప్ప యితరులెవ్వర్నీ గుర్తించలేను."

ఎర్రగౌను అమ్మాయి

చైనామూలం : పెన్ ఛి-లిన్

అనువాదం : శ్రీకాకుళరావు

అంఘా గ్రామం అకస్మాత్తుగా నిస్తబ్ధంగా మారిపోయింది ! బహుశా అక్కడి స్త్రీలు వాళ్ళకిష్టమయిన ఎరుపురంగు గౌనులు తీసేసి వేరే బట్టలు వేయాల్సిరావటం కావచ్చు !

జపాన్ సైన్యం, వాళ్ళ అధీనంలోవున్న 'టుంగ్-పు' రైలు మార్గానికి 10 'లీ'ల దూరంలో వున్న వూరికి వస్తున్నట్లు కబురంపారు. అంతకు రెండునెలలక్రితం జపాన్ సైన్యం అవూరిమీద చేసిన దాడితో భయకంపితులైన జనం పొలం పుట్రా వదిలిపెట్టి పారిపొయ్యారు. తిరిగివచ్చి కొంపా గోడు చక్కబెట్టుకొనేలోపలే పులిమీద పుట్రగా జపాన్ సైన్యం 'ఉపశమనం' (pacification) కలిగించటానికి వూరూరా తిరుగుతున్నట్లు, అప్పుడే పక్కవూరు 'లూ'కి చేరారని తెలిసింది. అక్కడ పాపం ఎనిమిదేళ్ళ బాలికమీద జరిగిన అఘాయిత్యం చుట్టుపక్కల ఎంతో కలవరాన్ని కలిగించింది. యిది ఏదో దురదృష్టకరమైనదిగా మనం అనుకోవచ్చుగాని, గ్రామీణుల దృష్టిలో మాత్రం నైతికంగ హీనమైన చర్య.

రచ్చబండదగ్గిర సమావేశమైన జనానికి హాన్‌చన్ (hanchien) (చైనా భాషలో ద్రోహి అని అర్థం) తెచ్చిన వర్తమానం ఆందోళన కలిగించింది. జపాను సామ్రాజ్య

వాడసైన్యం 'ఆంఘూ' గ్రామానికి వస్తారని. ఆలోపలే గ్రామస్తులందరూ 'వుపశమనం' పొందటానికి సిద్ధమవాలని కబురుచేసారు. ఎవరైనా వూరినుంచి పారిపోయినట్లు కనబడితే మొత్తం గ్రామాన్నే ఆహూతిచేస్తామనే హెచ్చరించారు. అంటే యికపై ఏంజరుగుతుందనే విషయంలో ఎవరికీ ఎలాంటి అనుమానంలేదు. స్త్రీలందరూ పొడుగాటిశిరోజాలను కత్తిరించుకొని యిష్టమున్నా లేకపోయినా, ఆధునిక పద్ధతిలో పొట్టి జుత్తుగా మార్చుకున్నారు. చాలామందికి కాళ్లు కట్టేసినట్లయింది. అయినప్పటికి ఎరుపురంగు దుస్తులు యింకా వేసుకునేవున్నారు. కాన్-సియావో‌కి పెళ్ళయి మూడునెలలయింది. కాన్-సియావో భార్య బట్టలు మార్చాలనుకొనేసరికి అనుకోని యిబ్బంది ఎదురయింది. నిజానికి ఆవిడవి వూళ్ళోవాళ్ళందరికన్నా సరికొత్త జత. ఆ వూరిలోయెవెంబడి పారే కాలువ మురికినీళ్ళలోనే అందరూ బట్టలు వుతికి, ఆరవేసుకొంటారు. అయినా ఆవిడ బట్టల ఏరుపు మెరుపు ఏమాత్రం తగ్గలేదు. బట్టలు తీసేయడానికి పెద్ద ఆలోచించాల్సిన పని లేకపోయినప్పటికి, తీసేసి వేరే ఏ బట్టలు వేసుకోవాలనేదే సమస్య ?

గతంలో జపాన్ సైన్యంనుంచి తప్పించుకొనే ఆదుర్దాలో కొండల్లోకిపోయేటప్పుడు, బట్టలమూట ఎక్కడో మర్చిపోవటం జరిగింది. దాంతో యిప్పుడు యిద్దరికి యిబ్బందయింది. కొండలనించి తిరుగొచ్చిన రెండునెలల కాలంలోను, ఆవిడ మహా అయితే కాలిజోళ్ళు, మేజోళ్ళు, బాడీ, లంగాల్లాటివి మాత్రం తయారుచేసుకోగలిగింది గాని, వేరే బట్టలజత ఆలోచనకురాలేదు. ఎవరికైన అదనపు జతవుంటే తెచ్చుకుందామనే ఆశతో పుట్టింటికి వెళ్ళింది. మునిమాపువేళ నిరాశగ తిరుగొచ్చి 'కాంగ్'మీద చతికిలపడింది ఇంతలోనే కాన్-సియావో తిరిగొచ్చి ఆవిడ బట్టల సమస్య తీర్చాడు.

సాయంకాలం రచ్చబండదగ్గిర పిచ్చాపాటి మాట్లాడుకొనేటప్పుడు వూరిపెద్దతో-కాన్-సియావో ఘర్షణపడి చికాగ్గా తిరిగొచ్చాడు. తనకెంతో యిష్టమైన ఎరుపు గౌనులోనే భార్య కనపడేసరికి, క్షణకాలం అలానే నిలబడిపోయాడు. వెంటనే కర్తవ్యం గుర్తుకొచ్చి "త్వరగా బట్టలు మార్చుకో" అంటూ తన మామూలునల్లరంగు బట్టలు ఆవిడముందు పడేసాడు.

ఆవిడ అర్థంకాక అలానేచూస్తూ నిలబడింది.

"నిన్నే ! త్వరగా బట్టలు మార్చుకోమని చెప్పేది."

భర్త స్వభావం తెలిసి, ఎదురుచెప్పటం అనవసరమనుకొని, అలాగేనంటూ తల వూపింది. వెంటనే ఒకరి బట్టలు వొకరు(?)మార్చుకొన్నారు. కాన్-సియావోభార్య ఆకుపచ్చరంగు కోటుని, ఆవిడ కాన్ నల్లరంగుకోటుని వేసుకొన్నారు.

"ఏం జరగబోతుందోనని ఎంతో ఆత్రంగ, ఆదుర్దాగ వున్నప్పటికి ఆవిడపెదవి విప్పలా, కాన్ గడపదాటుతుంటే ఆవిడ కంట్లో నీళ్లు తిరిగాయి. పోయేవాడల్లా ఒక్క-

క్షణం ఆగి, వెనక్కి తిరిగి "వెళ్లు, వెళ్ళి హాయిగ నిద్రపో. మళ్ళ రేపొస్తాను" అంటూ ముందుకు సాగిపోయాడు.

....

సూర్యకిరణాలు చెట్లగుబుర్ల మీద పరుచుకొంటుండగ, 'సామ్రాజ్యవాద సైన్యం' వూళ్ళో కడుగుపెట్టింది. మొత్తం పదకొండుమందిలో పదిమంది గుర్రాలమీద రాగ, హాన్ చీన్ (ద్రోహి) మటుకు నడిచేవచ్చాడు. రాగానే 'వుపశమన'కార్యక్రమానికి ముందుగా, రచ్చబండదగ్గరికి వూరిపెద్దను పిలిచి 'వేడివేడి టీ'కి తొందరపెట్టారు. బహుశా వాళ్ళ వుపశమన కార్యక్రమంలో యిది తొలిమెట్టేమో. 'సామ్రాజ్యవాద సైన్యం' 'మీ నిత్యావసర వస్తువుల్ని దోచుకో'దంటూ, 'కాకపోతే మేమొచ్చాం కాబట్టి కాసిని వుల్లి పాయలతో కాల్చిన గోధుమరొట్టెలు పంపించం'డని హుకుం జారీచేసాడు

"చిత్తం"

"పేదప్రజలనుండి మా సైన్యం ఏమీ దోచుకోదు. కాకపోతే ఎవరైతే మానుంచి స్వస్థత పొందాలనుకొంటున్నారో వాళ్లు మాత్రం కాబేజీలు పంపండి ఏం?"

"అలాగేనండి"

"అలాగే కాసిని ముల్లంగి దుంపలు"

"చిత్తం"

"తాజాగుడ్లు-అబ్బే ఎన్నో అక్ఖర్లేదు- ఓ వంద."

వూరిపెద్ద క్షణకాలం తటపటాయించి, చేసేదిలేక అన్నాడు-

"అలాగే... చిత్తం"

అరుబయలు విడిచిన పది గుర్రాలు పచ్చచిక్కుళ్ళు తింటుంటే, రచ్చబండదగ్గర ఏడు జపాన్ గాడిదలు, ద్రోహి కలిసి గోధుమరొట్టెలు ఆత్రంగ మేస్తున్నారు. మిగతా మూడు జపాన్ గాడిదలు బహుశా మెట్టపొలాలు చూట్టానికెళ్ళుండచ్చు

తిండి తిప్పలు ముగించాక దున్నలా బలిసిన సార్జెంట్, హాన్‌చీన్‌ని పిలిచి సమావేశం గురించి చెప్పాడు. వెంటనే గ్రామపెద్దని పిలిచి హాన్ చీన్ చెప్పాడు. "ఇక్కడ మీరంతా ఎంతో బాధలుపడుతున్నారు. అందుకనే మీకు వుపశమనం కలిగించటానికి మేమొచ్చాం; వూళ్ళో దండోరావేయించి మిగతా వాళ్ళందర్నీ పిలిపించండి. అందరూ శాంతివచనాలు విని వూరటపొందే అవకాశం కలుగుతుంది."

చాటింపు విన్న తర్వాత 80 పాకలనించి ఎనభై మందంటే సరిగ్గా 80 మంది బయటికొచ్చారు. జనాభాలెక్ఖకోసం బలవంతంగా తీసుకొస్తే, ఆ వచ్చినవాళ్ళలో సగం

మంది పిల్లలు. జనం పోగయేసరికల్లా రచ్చబండదగ్గరికి గంపలనిండా గుడ్లు కాబేజీలు, ముల్లంగి దుంపలు సిద్ధమయ్యాయి. ఉపశమన కార్యక్రమం మొదలయింది. హాన్‌చీన్ దుబాసీగా. సార్జెంట్ శాంతి బోధ మొదలెట్టాడు

"జపాన్ సామ్రాజ్యవాద సైన్యం అపజయమనేది ఎరగదు! ముమ్మాటికి ఎరగదు! మా సైన్యం తిరుగులేనిది! మిమ్మల్ని (చైనాజాతిని) చంపటానికి కాదుసుమా మేమొచ్చింది; రక్షించటానికి. ఒక విషయంమాత్రం బాగాగుర్తుంచుకోండి! చైనాలోని అనాగరికమైన భయంకర బందిపోట్లే 8వ మార్గ సైన్యం. తెగించిపోరాడే పటాలాలు. అయితే మీకేభయమక్కరలేదు! మేం వొచ్చాం! యికనించి యీ బందిపోట్ల గురించి మీరు విన్నవి, కన్నవి అన్నీ మాకు తెలియజేయాలి!"

ఉపన్యాసం పూర్తికాగానే సార్జెంట్ ప్రశ్నలు, జనం జవాబులు మొదలయ్యాయి!

"సామ్రాజ్యవాద సైన్యం జనాన్ని చంపుతుందా?"

"చంపదు"

"పోనీ ప్రజలను దోచుకుంటుందా?"

"లేదు...లేదు..."

"తగలబెట్టి సర్వనాశనంచేస్తుందా?"

"అబ్బే... అలాచేయదుగాక చేయదు"

మరి...మా సైన్యంఅంటే మీకు భయమా?"

"భయమా? ఎందుకు?, లేదు"

"మరైతే ఆ బందిపోట్లు వచ్చినప్పుడు వూళ్ళోవుంటూ, మేంరాంగానే ఎందుకు పారిపోతుంటారు?"

... ...

ఎవరూ పెదవి విప్పలా

... ...

నాలిక్కొరుచుకున్నాడు సార్జెంట్! ఈ ప్రశ్నవేయటంతో తనుచేసిన పొరపాటు తెలిసొచ్చి- మాటమార్చి వుపన్యాసాన్ని క్లుప్తంగా ముగించాడు.

"మేం మళ్లావొస్తాం! ఎవరూ పారిపోకండి! ఈతాప అంతా ప్రశాంతంగావుంది కదా. జనాన్ని చికాకుపరచే వుద్దేశం మాకు ఎప్పుడూలేదు"—

తత్వబోధ పూర్తికాగానే ప్రయాణానికి సిద్ధమయ్యారు కాయగూరలు, మిగతా సరంజామా తయారుగావుంది. ఎటొచ్చీ మిగతాముగ్గురు సైనికులజాడ ఏమైంది తెలి

యటంలా, సార్జెంట్ చెప్పినమీదట హాన్‌చీన్ తప్పిపోయిన వీరులగురించి వూళ్ళో వాళ్ళనడిగాడు. మాకు తెలియదంటే మాకుతెలియదన్నారు. వూరిబయట ఎక్కడయినా తిరుగుతున్నారేమో చూసిరమ్మని, వూరిపెద్ద కొంతమందిని పంపించినా, వాళ్ళెక్కడకుపోయిందీ తెలియలా. చేసేదిలేక ఆయనే బయల్దేరాడు!

"ఒకవేళేమైనా ఆ పాడుముండ కాన్ భార్యగాని వీళ్ళని వొంపు సొంపులు చూపి మాయ బుచ్చిందేమో"ననుకొని అటుగా బయల్దేరాడు. తలుపుతట్టి లోపల కిడుగుపెట్టేసరికి, గోడనానుకొని, 'కాంగ్'మీద భయం భయంగా కదులుతూ, వూరిపెద్ద కంటికి కాన్-సియావో కనపడ్డాడు. వచ్చే కోపాన్ని, నవ్వుని తమాయించుకుంటూ, వెక్కిరింతగన్నాడు. 'ఓహో! వీరాధివీరా! ఆడదానిలా మూలకూచుంటావనుకోలా! సరేలే, ముందు ఆ ముగ్గురు సైనికుల్ని మాయబుచ్చి నీ భార్య ఎక్కడికి తీసుకెళ్ళిందీ చెప్పంటూనే, తను పిచ్చిగా వాగుతూంది కాన్-సియావోతోగాక, అతని భార్యతోనేనని గ్రహించేసరికి కంగుతిని, వెనకడుగువేసి యింటింటికి తిరిగి వెతకటం మొదలెట్టాడు. తిరిగి తిరిగి పిచ్చికోపంతో రచ్చబండదగ్గరికి చేరాడు. ఇంత త్వరలోనే తనకంత అపజయం కలుగుతుందని వూహించలా. ఆందోళనతో సతమతమవుతూ తను కిందా మీదా పడుతుండగా రచ్చబండకు ఎదురుగావున్న రాట కొయ్యకు తన్ని కట్టేసారు.

దాంతో వూరుమొత్తం భయంతో, ఆదుర్దాతో గిజగిజలాడింది. ఈలోపలే తను చూపుమేరలో కొంతమంది పల్లెజనం 11 ఏళ్ళ కుర్రవాడిని ఈడ్చుకుంటూ రావటంచూసి జనం ఆందోళన తారాస్థాయినందుకొంది. దానికితోడు వాళ్ళంతా ఆ కుర్రాణ్ణి చూపెట్టూ "వీడికి తెలుసు తెలుసం"టూ కేకలేస్తున్నారు. జావకారిపోతున్న హాన్ చీన్ వెంటనే అరిచాడు—

"రేయ్. చెప్పరా? వాళ్లెక్కడికిపోయారు?"

"అయ్యా, ఓ ఎర్రగౌను అమ్మాయిని తరుముతూ యిటే... యిలా తూర్పు దిక్కుగా పోయారండి. మరండి- వాళ్లు అలా... అలా.... దూరం దూరంగా కనుచూపు కందకుండా పోయారండి."

హాన్ చీన్ జరిగిందంతా సార్జెంట్‌కి చెప్పి, వేడివేడి చివాట్లు తిన్నాడు. తమాయించుకొని వెంటనే 'ఆ ఎర్రగౌను అమ్మాయిని పట్రాండి' అంటూ అరిచాడు.

జనమంతా ఆశ్చర్యంతో తలమునకలవుతున్నారు. ఇంతలో ఒకతను రాటకొయ్యలమీంచి చూస్తూ సంజ్ఞలు చేసాడు. హోరుగాలికి వంగిన గోధుమమొక్కల్లావున్న జనం ఒక్కతడవగా దక్షిణదిక్కుగా చూశారు.

"అదుగో... వచ్చే వచ్చే ఎఱ్ఱగౌను అమ్మాయి. వచ్చే వచ్చే."

పెద్దపెద్ద అంగలువేసుకొంటూ దక్షిణ దిక్కునుంచి వురుకులు పరుగులతో వస్తున్న ఎర్రిగౌను అమ్మాయి కనబడింది. (ఆ పెద్దఅంగలు చూస్తుంటే- అమ్మాయేనా అంటూ చాలామంది ఆశ్చర్యపోతున్నారు) అంతకంటే ఆశ్చర్యకరమైనసంగతి- ఆవెనకే బూడిదరంగు యూనిఫామ్‌లో కదలివస్తున్న పటాలం కనబడింది. ఆడవుల గుండా దగ్గరిదారివెంబడి వాళ్ళు రచ్చబండ చేరుకోబోతున్నారు

"యిదిగో... యిదిగో... ఎర్రిగౌను అమ్మాయి...వచ్చే... వచ్చే" అంటూ కేకలు. అంతే".

ఒక్క వుదుటున అపజయమెరగని సామ్రాజ్యవాద సైన్య వీరాధివీరులు ఏడు గుఱ్ఱాలెక్కి వుత్తరదిక్కుగా పలాయనం చిత్తగించారు. పోగుచేసుకొన్న సరంజామాగాని, 38 మూడు తుపాకులుగాని, మూడు గుఱ్ఱాలగురించిగాని పట్టించుకొనే తీరికకూడాలేకుండా, చక్కాపోయారు. హాన్‌చీన్‌కూడా గుర్రిమెక్కిపోదామని ప్రియత్నించాడుగాని, వీలుగాక గుర్రాల దౌడులో రేగినధూళిలో కాళ్ళుకొట్టుకొంటూ పరుగు మొదలెట్టాడు. ఈ లోపల రావలసినవాళ్ళు రానేవచ్చారు. వాళ్ళలోని క్వాన్-పీ-సూ పరిగెత్తి హాన్‌చీన్‌ని పట్టుకోడం జరిగింది. జనం గుండెనిండుగా గాలిపీల్చుకొ వచ్చిందెవరో చూశారు. ఎర్రిగౌను తొడుక్కుంది కాన్-సిమావోయే. వచ్చే హడావుడిలో బట్టలు మార్చుకొనే సమయంచిక్కలా!

"భేష్ 'ఈ కాయగూరలు' గుడ్లు మనం మన గెరిల్లాలకి అందజేద్దాం." అంటూ వూరిజనాన్ని అడిగాడు.

"యిన్ని బాధలుపడుతూ ఈవూళ్ళొ యింకా వుండగలమనే అనుకొంటున్నారా?"

అంతా నిశ్శబ్దంగా కాన్ చెప్పేది వింటున్నారు:

"అలాంటప్పుడు మరి మనం ఏంచెయ్యాలి? చాలా సులభమైన మార్గమేమిటంటే. మూటా ముల్లే సర్దుకొని కొండల్లోకి కదిలిపోయి మన గెరిల్లాలతో కలిసిపోదాం".

ఎనభైనుంచి అయిదొందలదాక పోగైన జనం ఒక్కపెట్టున, "అవును. అంతే చేద్దాం" అంటూ కేకలేసారు.

ఒక గంటలోపల జనం బారులు బారులుగా కొండల్లోకి ప్రివాహంలా కదిలిపోయారు కంచరగాడిదలు, ఆవులు, గేదెలు, దున్నలతోపాటు, వెంటతీసుకెళ్ళగలిగిన సరంజామా మొత్తంతో కదిలిపోయారు. ఆడా, మగ-పిల్లా, పాప అంతా మూటా ముల్లె మోసుకొంటూ కోడిపెట్టలు, పందిపిల్లలతోసహా సాగిపోయారు.

కాన్-సియావో దంపతులిద్దరూ పక్కపక్కనే నడుస్తున్నారు. అవే బట్టలతో ప్రయాణం చేస్తుండటంవల్ల దూరంనించి చూట్టానికి ఎవరు ఎవరో ఒకంతట అంతు పట్టటంలా.

ఆరోజు రాత్రి గెరిల్లా ప్రధాన కార్యాలయంవద్ద గ్రామస్థులందరికీ ఆహ్వానసూచకంగా విందు ఏర్పాటు జరిగింది. ఆ విందులో గెరిల్లా కమాండరు ముఖ్యంగా కాన్-సియావోని ముందుకు పిలిచి అతని దేశభక్తిని, ధైర్యసాహసాల్ని పొగిడాడు. "ముగ్గురు జపాను సైనికుల్ని, మూడు తుపాకుల్ని, మూడు గుర్రాల్ని, హాన్ చీన్ (ద్రోహి)ని పట్టిచ్చిన కాన్-సియావో గొప్ప బహుమానానికి అర్హుడని, ఆ మేరకు తను పైకి తెలియచేస్తా" నన్నాడు. అయితే గెరిల్లా కమాండర్ దృష్టిలో యింతకంటె అమూల్యమైన విషయం— "కాన్-సియావో వూరు వూరంతా కదిలి వచ్చేలా చేసి, మొత్తం గెరిల్లా దళాలనే యింకా పటిష్టవంతం చేయటం.

బహుమతి సంగతి వింటూనే కాన్-సియావో ధైర్యం కూడగట్టుకొని నెమ్మది, నెమ్మదిగా అన్నాడు.

"నాకు వేరే ఏమీ వద్దు కమాండరు! కావల్సిందల్లా గెరిల్లా దుస్తులు (యూనిఫామ్) మాత్రమే."

చిరునవ్వుతో వింటున్న కమాండర్ అప్పుడే చూశాడు. కాన్-సియావో ఇంకా ఆ ఎర్రగౌనులోనే వున్నాడు.

వెంటనే గెరిల్లా యూనిఫామ్ కాన్-సియావోకి అందచేయబడింది. కార్యక్రమం అయిపోగానే వెంటనే ఎర్రగౌను మార్చుకొని యూనిఫామ్ వేసుకొన్నాడు. తీసేసిన బట్టల దుమ్ముదులిపి భద్రంగా మూటకట్టాడు.

మూట చేతపట్టుకొని తాత్కాలికంగ ఆడవాళ్ళు విడిదిచేసినచోటకెళ్ళాడు. అక్కడ్నించి భార్యని యివతలికి పిలిచి, మూట ఆవిడచేతికిస్తూ అనునయంగా, చిరునవ్వుతో భార్య భుజంతడుతూ అన్నాడు—

"రాబోయే మంచిరోజులకోసం, వీటిని పదిలంగా వుంచు—"

— చైనీస్ కథ "The Red-Trousers" కి అనువాదం.

"విప్లవనాయకులు ఎందరు అస్తమించినా
నూతన నాయకత్వాన్ని సృష్టించుకొంటూ
విప్లవంయెడ అచంచల విశ్వాసంతో ముందుకు
సాగిపోయేవారే నిజమైన ప్రజాయోధులు—"

"చాలమంది నూతన పోరాట యోధుల్ని సృష్టించండి"

యువతరంపట్ల లూసన్[1] శ్రద్ధాసక్తులు

చైనాలో యువకులు లూసన్‌గురించి మాట్లాడేటప్పుడు, ఆయననొక సరియైన (సూటియైన (Evacting) యువతరంగురించి శ్రద్ధతీసుకొని వారిని నడిపించిన వెచ్చని హృదయంగల ఉపాధ్యాయునిగా తలచుకుంటారు.

1919లో చైనాలో విదేశీ సామ్రాజ్యవాదానికి, భూస్వామ్యానికి వ్యతిరేకంగా సముజ్జ్వలమైన విప్లవోద్యమంవచ్చింది. అదే మే 4 ఉద్యమం. నిర్భయులైన విద్యార్థులు యీ ఉద్యమానికి నాయకులు. చైనాను రెండువేల సంవత్సరాలకుపైగా పీడిస్తున్న భూస్వామ్య విధానం, భూస్వామ్య ఆలోచనావిధానం, భూస్వామ్య సంస్కృతి- అనే చీకటి. గాలిలేని "ఇనుపకొట్టు"ను బద్దలుచేయడానికి జాగృతమై సాయుధంగా పోరాడవలసిం దిగా యువకులు సాహసోపేతమైన పిలుపునిస్తూ ఎన్నోకథలు వ్యాసాలు యీ ఉద్యమ కాలంలో లూసన్ రాసాడు. యువతరం విముక్తిని గెలుచుకొనేట్లు చేయడంలో చీకటి బంధనాలను తోసేయత్నంలో లూసన్ తన భుజాలొడ్డినాడు; యువకులు విశాలమైన, కాంతివంతమైన ప్రపంచంలో అడుగుపెట్టడానికి తోడ్పడ్డాడు.

1925లో ఉత్తర యుద్ధప్రభువుల ప్రభుత్వం యీ దేశభక్తిపూరితమైన ప్రజా స్వామిక ఉద్యమాన్ని అణిచేసింది. విద్యార్థి ప్రతినిధులను వాళ్ళపాఠశాలలనుంచి బహిష్కరించింది. పెకింగ్‌లోవున్న మహిళా ఉపాధ్యాయ శిక్షణ విశ్వవిద్యాలయాన్ని (నార్మల్ యూనివర్సిటీని) బలవంతంగా రద్దుచేసింది (కూల్చివేసింది?) మహిళా విద్యార్థులను పోలీసులతో. బందిపోటు దొంగలతో బయటకీడ్పించింది. అప్పుడు యీ విశ్వవిద్యాలయంలో చదువుచెప్తున్న లూసన్ ప్రగతిశీల విద్యార్థులపక్షం స్థిరంగావహించి అభివృద్ధినిరోధక అధికారులకు వ్యతిరేకంగా పోరాటంచేసాడు. వాళ్ళ చదువులు కొన సాగించడానికి విద్యార్థులు వేరేచోట్లకు కదిలినప్పుడు, వాళ్ళకు ఎక్కువగంటలు బోధించ డానికి స్వచ్ఛందంగా ఒప్పుకొన్నాడు.

1926 మార్చిలో, చైనాపై జపాన్ దురాక్రమణకు వ్యతిరేకంగా యువకులు, యితర దేశభక్తులు పెకింగ్‌నగరంలో పెద్ద ప్రదర్శనచేసినపుడు, యుద్ధ ప్రభువుల ప్రభుత్వం నిరాయుధులైన ప్రజలమీద కాల్పులు జరుపవలసిందిగా ఆజ్ఞయిచ్చింది. ఆ కాల్పుల్లో ఎంతోమంది ప్రజలు చనిపోయారు. దీన్నే మార్చి 18 సంఘటన అంటారు. లియు హూ-చెన్, అనే మహిళల ఉపాధ్యాయశిక్షణ విశ్వవిద్యాలయానికిచెందిన విద్యా ర్థిని చనిపోయినవారిలోవుంది. అప్పుడు లూసన్ తీవ్రమైన విషాదంతో, కసితో

"కుమారి లియుహో-చెన్ స్మృతికి" (In Memory of Miss Lin Ho-chen), యింకా చిరస్మరణీయమైన వ్యాసాలు యీ యువకుల సాహసోపేతమైన, ఆత్మ త్యాగ శీలమైన ప్రవృత్తిని ప్రశంసిస్తూ రాసాడు. వీళ్ళను "నిజమైన పోరాటయోధులు"గా అయన పేర్కొన్నాడు. "రిపబ్లికన్ స్థాపించిననాటినుంచీ అంధకారమయమైనదినం"గా మార్చి 18 ని వర్ణిస్తూ పాశవికమైన హంతకులనూ, దేశభక్తిపూరిత విద్యార్థులమీద బురదచల్లుతున్న యుద్ధప్రభువులవద్ద వేతనాలుపొందే కిరాయి రచయితలనూ చర్మం వొలిచి (ముసుగుచీల్చి) చూపాడు, న్యాయంపట్ల నిర్భయంగా నిలిచిన లూసన్, యువకులను రెట్టింపుధైర్యంతో ముందుకుసాగమని పిలుపుయిచ్చాడు. అదే సమయంలో కాఠినమైన శత్రువుతో ఉత్త చేతులతో, ప్రదర్శనలతో, ఊరేగింపులతో (పరేడ్‌లతో) కాకుండా మరింత ప్రభావవంతమైన ఎత్తుగడలతో "కందకాల్లోంచి యుద్ధం" (Trench Warfare) చేయడానికి శక్తిని పోగుచేసుకొని పోరాడవలసిందిగా అయన సలహాయిచ్చాడు. ఈ సామ్రాజ్యవాద—వ్యతిరేక, భూస్వామ్య—వ్యతిరేక పోరాటాన్ని చివరిదాకా కొనసాగించవలసిందిగా ఆయన వాళ్ళను కోరాడు.

1927లో చైనా ప్రజల మొదటి విప్లవయుద్ధం (సివిల్‌వార్) విజయవంతమవుతున్న సమయంలో బడా భూస్వాములకు, బడా బూర్జువాజీకి ప్రాతినిథ్యం వహించిన చాంగ్‌కై షేక్ విప్లవానికి విద్రోహంచేసాడు. ఏప్రిల్ 12న ఆయన విప్లవ ప్రతీఘాతుక కుట్రచేసి (Coup d'e'tat) ఎంతోమంది కమ్యూనిస్టులను, కార్మికులను, రైతులను అట్లాగే ప్రగతిశీల విద్యార్థులను, యితర యువ విప్లవకారులను ఊచకోతగాచంపాడు. కొమింటాంగ్ (చాంగ్‌కై షేక్ ప్రభుత్వం) అభివృద్ధినిరోధకులు సాగించిన ఈ ఫాసిస్ట్ దుర్మార్గాలను కువాంగ్‌చౌలో కళ్ళారాచూసిన లూసన్ వేదనతో, క్రోధంతో ఊగిపోయాడు. తన క్షేమంసంగతి ఏమీ ఆలోచించకుండా, అరెస్టయిన విద్యార్థులను తప్పించడంకోసం ఆయన చేయగలిగినంతాచేసాడు. ఆయన అన్ని ప్రయత్నాలూ విఫలమయ్యాక సన్‌యట్-సేన్ విశ్వవిద్యాలయంలో తన ఉపాధ్యాయవృత్తిని వదిలేసాడు.

ప్రజలరక్తంతో చేజిక్కించుకున్న చాంగ్‌కై షేక్ ఫాసిస్ట్ ప్రభుత్వం తెల్ల భీభత్సాన్ని సృష్టించింది. 1930 మొదలుకొని కియాంగ్సీప్రాంతంలోవున్న కమ్యూనిస్టు స్థావరాన్ని ఐదుసార్లు "చుట్టుముట్టి, ఖతంచేయడానికి" చాంగ్‌కై షేక్ కొన్నిమిలియన్ల సాయుధ దళాలను, విమానాలను పంపించాడు. దానికితోడుగా కొమింటాంగ్-ఆక్రమిత ప్రాంతాల్లో విప్లవ సంస్కృతిని తుడిచిపెట్టడానికి నిర్దాక్షిణ్యమయిన దాడులు జరిగినవి. విప్లవ ప్రజలకు సమావేశాలు ఏర్పాటుచేసుకునే, నలుగురు ఒకచోట కలుసుకునే అభిప్రాయాలు వ్యక్తంచేసే, పుస్తకాలు ప్రచురించే హక్కు నిరాకరించబడింది. ప్రగతిశీల

రచయితలు చంపబడ్డారు. ప్రగతి పుస్తకశాలలు శాశనంచేయబడ్డాయి. ప్రగతిశీలమైన పుస్తకాలు, పత్రికలు నిషేధింపబడ్డవి. లూసన్‌కూడ వేధించి, తరచుగా కొమింటాంగ్ ఏజెంట్లు అయననీడపలెవెన్నాడారు. ఈ తెల్లభీభత్సంతో ఏమాత్రంచెదరకుండా లూసన్ పోరాటాన్ని కొనసాగించడానికి వామపక్ష రచయితలను, కళాకారులను సమీకరించాడు.

1931 ప్రారంభంలో, జోవ్‌షిహ్ మొదలైన ఐదుగురు యువరచయితలు ఆరెస్టయ్యారు. కొమింటాంగ్ జేయిల్లో వీళ్ళ ఆలోచనలు తమ ప్రియమైన మార్గదర్శకుని వైపు మళ్ళాయి. లూసన్‌కూడ యీ యువకామేృడ్స్ విషయంలో తన ఆందోళనను వ్యక్తపరిచాడు.

వాళ్ళను రహస్యంగా చంపేసారన్[2] విన్నపుడు. ఆయన తీవ్రంగా చలించిపోయి వరుసగా వ్యాసాలురాసాడు. చైనా శ్రామికవర్గ విప్లవసాహిత్యం- వైతాళికుల రక్తం (Literature of the Chinese proletariat and the blood of the pioneers) అంధకార భూయిష్టమైన చైనాలో సాహిత్యం కళల్లో ప్రస్తుత పరిస్థితి (Present situation in literature and Art in darkest China) మున్నగు వ్యాసాల ద్వారా చైనాప్రజలు, ప్రపంచప్రజలు కొమింటాంగ్ అభివృద్ధి నిరోధకుల నీచమైన నేరాలను ఖండించేలా రాసాడు. శత్రువు పిరికితనాన్ని, పాశవికత్వాన్ని ఎన్నటికీ మరచిపోకుండా పోరాటాన్ని కొనసాగించవలసిందిగా యువకులకు ఉద్బోధించాడు. ఐదుగురు మృతవీరులగురించి లూసన్ ఎంత గాఢంగా చలించిపోయాడో "మరచిపోవడంకోసం రాసింది" (Written for the sake of Forgetting) అనే వ్యాసం వ్యక్తంచేస్తుంది. అభివృద్ధి నిరోధకశక్తులు విజృంభించిన కాలమిది. తీవ్రమైన అణచివేత, సెన్సార్‌షిప్ అమలుజరుగుతున్న రోజులు. అయినా లూసన్ ఒక కవితలో రాసినట్లు, ఈ నిశ్శబ్దంలోకూడ "పిడుగుపాటు గర్జనలు" (Peal of thunder) స్పష్టంగా వినవచ్చు. అభివృద్ధి నిరోధకుల రోజులు దగ్గరబడ్డాయని, విప్లవ ప్రజలే అంతిమంగా గెలుస్తారని ఆయన స్థిరంగా విశ్వసించాడు. మృతవీరులగురించి సంస్మరిస్తూ, అందుకే "ఇతరులుకూడ వాళ్ళను తలచుకొని, వాళ్ళనుగురించి మాట్లాడేరోజు వస్తుంది" అని నిశ్చయంగాచెప్పాడు.

తన జీవితమంతా లూసన్ యువకుల భుజాలకు తన భుజాలొడ్డి వాళ్ళకు శక్తివంతమైన ప్రోత్సాహాన్ని, సహకారాన్ని అందిస్తూ పోరాడాడు. పెకింగ్, అమాయ్, కువాంగ్ చౌ, షాంఘైలలో ఆయన ఎక్కడవున్నా సరే, అక్కడ యువకులు తమ సమస్యలను అధ్యయనంచేసి, చర్చించడానికి కూడేవారు.

యువతరంపట్ల లూసన్ ప్రేమానక్తులు ఉత్తమమైన ఆయన విప్లవ లక్ష్యంలో మొలకెత్తినవి. చైనాలో చీకటిశక్తులు దట్టంగా వున్నాయి. అందువల్ల విదేశీసామ్రా

జ్యవాదం, భూస్వామ్య విధానం, నిరంకుశ పెట్టుబడిదారీ విధానం పరిపాలనను ఒక్క తరంలోనే కూలదోయలేము. అభివృద్ధినిరోధక వర్గాల పాత ఆలోచనా విధానం, సంస్కృతులనుకూడా అట్లాగే ఒక్కతరంలో తుడిచిపెట్టలేం. ఈ కార్యాలు సాధించా లంటే రానున్న ఎన్నో దశాబ్దాల్లో కఠినమైన, దృఢమైన ప్రయత్నాలు అవసరం. అందువల్ల విప్లవకాగడాను ఒక తరంనుంచి ఇంకోతరానికి అందించడానికి కొత్త శక్తులను నిర్మించడం ఆవశ్యకం. యువకులు దేశభవిష్యత్తుకు, దాని ఉత్సాహవంత మైన విప్లవబలానికి ప్రాతినిధ్యంవహిస్తారు. దీర్ఘకాలంలో, యువతరం విప్లవపథం వెంబడి ముందుకుసాగుతుందా లేదా అనేదానిమీదనే, విప్లవ విజయం ఆధారపడి వుం టుంది- అని ఆయన చాల స్పష్టంగా గుర్తించాడు. కొత్త పోరాటయోధుల తరానికి శిక్షణ యివ్వాల్సిన ప్రాముఖ్యతని లూసన్ చాల ముందుగానే గ్రహించాడు. దీనిమీద ఆయన చాల నొక్కి చెప్పాడు. అందుకే భూస్వామ్య శక్తులను, మనుషుల్ని తినే గతకాలపు సంస్కృతిని ఖండించడానికి యువకులను ఉత్తేజ పరచడానికి, తనతోపాటు యువ రచయితలను వీ-మింగ్ (పేరులేనిది) సంస్థ, మాంగ్-యువాన్ భీభత్స సంస్థ వంటి ప్రగతిశీల సాహిత్య సంస్థలను ఏర్పాటుచేయడానికి ప్రోత్సహించాడు. 1930 మార్చిలో, వామపక్ష రచయితల సంస్థ (League of Left-Wing Writers) ప్రారంభ సమావేశంలో "చాలమంది నూతన పోరాట యోధుల్ని సృష్టించడ"మనేది శ్రామికవర్గ సాహిత్యోద్యమ ప్రధాన కర్తవ్యమని లూసన్ దృఢంగా ప్రకటించాడు. ఎన్నో సార్లు కొత్తగా జన్మించిన విప్లవ శక్తులను కాపాడడానికి, పిడివాదుల తిరోగ మన దృక్పథాన్ని, ప్రగతిశీల యువకులను అణచివేసి నాశనంచేసే ప్రయత్నాలను, ఆయన తిప్పికొట్టాడు. యువకులు తమ మిలిటెంట్ పాత్ర నిర్వహించడంలో సహాయ పడడానికి, తీవ్రంగా జబ్బుపడివున్నపుడు కూడ, వాళ్ళ వ్రాత ప్రతులు సరిచేయడంలో, వాళ్ళ రచనలకు ముందుమాట రాయడంలో, వాళ్ళకు ప్రచురణకర్తలను సంపాదిం చడంలో, చివరకు వాళ్ళ ప్రూఫులు చూసిపెట్టడంలో తన వొళ్లు దాచుకోలేదు. పాయి మాంగ్ రాసిన "శిశుమందిరం" (The children's Pagoda) కు రాసిన ముందు మాటలో యీ యువ రచయితలపట్ల లూసన్‌కెంత ఉన్నతభావముందో తెలుస్తుంది.

నూతన విప్లవ వుడ్‌కట్ కళ (కర్రచెక్కడపు కళ) ను పెంపొందించడానికి, కొత్త వుడ్‌కట్ కళాకారులకు సహాయం చేయడానికి, లూసన్ తన డబ్బు ఖర్చుపెట్టి ప్రాచీన చైనావుడ్‌కట్‌ల, కాతెకోల్ విట్జ్‌వంటి వారి ఆధునిక వుడ్‌కట్‌ల ప్రతికృతులు ప్రచురించి యువకులైన వుడ్‌కట్ కళాకారులకు ఈ సంపుటులు కానుకలుగా ఇచ్చాడు. యువ కళాకారులు నేర్చుకోవడంకొరకు ఆయన వుడ్‌కట్స్ ప్రదర్శనలుకూడ ఏర్పాటు

చేసాడు. ఒక వుడ్‌కట్ తరగతి ఏర్పాటుచేసి ఒక జపాన్ మిత్రుణ్ణి ఉపాధ్యాయునిగా నియమించాడు. వేసవి ఎండలో తాను స్వయంగా అనువాదకునిగా పనిచేయడానికి వెళ్ళాడు. ఇంకో పదిరోజులకు మరణిస్తాడనగా, జబ్బుగావున్నా, యువ వుడ్‌కట్ కళాకారుల ప్రదర్శనకు హాజరయ్యాడు. అఖిల చైనా వుడ్‌కట్ ప్రదర్శన (All–China Wood cut exhibition) సంపుటికి ఆయనరాసిన ముందుమాట నూతన వుడ్‌కట్ కళ శక్తివంతమైన ప్రోత్సాహం పట్ల ఆయన ఎంతగా సంతోషించాడో చూపుతుంది. ఈ నూతనకృయల విజయాన్ని ధృవీకరిస్తూ, వీటిలోవున్న కొన్ని లోపాలనుకూడచూపి, మరింత మంచి కళాఖండాలు, మరింతమంది కొత్త కళాకారులు భవిష్యత్తులో వస్తారని గాఢమైన విశ్వాసాన్ని వ్యక్తంచేసాడు.

"ఒక పువ్వు వికసించడానికి నేను తోడ్పడినంతకాలం, నేను ఎరువుగా ఉపయోగపడడానికికూడ సంతోషంగా సిద్ధమవుతాను. జీవనపథంలో ......నా రక్తం ఒక్కొక్కచుక్కే ఇతరులను కాపాడడానికి ప్రవహించనీ ఇది నన్ను బలహీనపరచినా, అలాచేయడం నాకు సంతోషం", అని లూసన్ ప్రకటించాడు. తన జీవితమంతా, యువతరానికి సేవచేయడానికి "తలవంచి, యిష్టపడిన ఎద్దువలె" పనిచేయడానికి ఆయన తన సంసిద్ధతను కుతూహలాన్ని చూపాడు

చైనా భవిష్యత్తు యువకుల సమస్యతో ముడిపడివున్నదిగనుక యువకులను ఆకట్టుకోడానికి పోరాటం ఎప్పుడూ చాల తీవ్రంగానేవుంది, యువకులు కన్‌ఫ్యూషియస్‌ను పూజించి కన్‌ఫ్యూషియస్ రాసిన 'ఉద్గ్రంథాలు' అధ్యయనంచేసి శిథిలమైపోతున్న తమ వర్గానికి విధేయులైన ప్రజలుగా, తగిన సంతానంగా మార్చడానికి ఫ్యూడల్ భూస్వామివర్గాలు వాళ్ళు చేయగలిగినంత ప్రయత్నంచేసారు. దళారీ బూర్జువావర్గం "చైనాను రక్షించడానికి అధ్యయనం" చేయవలసిందిగా ప్రతిపాదించి, విప్లవానికి భయపడి, యువకులను కేవలం పుస్తకాలకు పరిమితమైన పరిశోధనపైపు ఆకర్షించి మభ్యపుచ్చడానికి ప్రయత్నించింది. విప్లవంనుంచి ఏకాకుల్నిచేసి వాళ్ళను దంతపుమేడల్లో బంధించే ప్రయత్నంచేసింది. ఇక బోగస్ (అబద్ధపు) మార్క్సిస్టులున్నారు. సభల్లో పెద్దపెద్ద వాగాడంబర విప్లవపడికట్టు పదజాలంచాటున తమ రివిజనిస్టు ఆలోచనలను దాచుకొని, యువకులను తమ అవకాశవాద పంథావైపు తమ బాకాలూదేవారుగా, అనుసరించేవారుగా, తిప్పుకునే ఆశతో బిగ్గరగా అరుస్తుంటారు. రకరకాల స్థాయిలనుంచి, భిన్నమయిన పరిసరాలనుంచి, వివిధజీవిత, విద్యామార్గాలనుంచి వచ్చినవారుకాబట్టి, యువకులుకూడ తరచుగా సందేహంలో పడుతుంటారు. లూసన్ పేర్కొన్నట్లుగా కొంతమంది యువకులు ఇంకా నిద్రపోతున్నారు, కొంతమంది

మేల్కొన్నారు; కొంతమంది ముందుకుపోతున్నారు. కొందరు వెనక్కితగ్గుతున్నారు; కొందరు శతృవుకు సేవకులుగాకూడ పనిచేస్తున్నారు. ఎందువల్లనంటే యువకులకు అనుసరించడానికి పూర్తిగా భిన్నమైన రెండు మార్గాలమధ్య ఎప్పుడూ అవకాశంవుంది.

యువకులను భ్రిష్టు పట్టించడానికి ఉద్దేశించిన అన్ని తప్పుడు ఆలోచనలను. ధోరణులను లూసన్ స్థిరనిశ్చయంతో ఎదురించాడు. యువకులు అధ్యయనంచేయాలి, కాని, అన్నిటికన్న మొదటిది ముఖ్యమయింది, వాళ్ళు చైనా భవిష్యత్తుగురించి, వాళ్ళ ప్రిజల ఉన్నతిగురించి పట్టించుకోవాలి. వాళ్ళు సమకాలీన సామాజిక సమస్యలపట్ల శ్రిద్ధచూపి యీ యుగంవారిముందుంచిన కర్తవ్యాలగురించి ఎప్పుడూ మరచిపోవద్దని అతడు భావించాడు. పాత సమాజాన్ని కూలదోసి, మానవభక్షకులను తుడిచేసి, చైనాలో యిదివరకు ఎన్నడూతెలియని కొత్తయుగాన్ని సృష్టించే కర్తవ్యం యువకులపై వుందని 1925 లోనే లూసన్ చెప్పాడు భూస్వామ్య విధానమూ, పెట్టుబడిదారీ విధానమూకాని "మూడోయుగం"గురించి ఆయన మాట్లాడాడు. సామాన్య మానవునికి సంపూర్ణ నూతన విముక్తి శకమిది. కొమింటాంగ్ అభివృద్ధినిరోధక పాలకులకు వ్యతిరేకంగా చైనాప్రిజలుచేసిన పోరాటంలో కార్మికులవలె రైతులవలె "అదేయుద్ధాన్ని చేయవలసింది"గా "ప్రిజల్లోకి గాఢంగా చొచ్చుకొనిపోవలసింది"గా "విప్లవజీవితంలో భాగస్వామ్యం పంచుకోవడంగాని దాని స్పందనను సన్నిహితంగా అనుభవించగలగడం" గాని చేయవలసిందిగా యువకులను కోరాడు.

కార్మిక రైతాంగ జనంలోకి గాఢంగా చొచ్చుకొనిపోవడం. సామాజిక పోరాటాల్లో పాలుపంచుకోవడం, బూర్జువా యువకులకు, పెటీబూర్జువా మేధావులకు, తమ ప్రిపంచ దృక్పథాన్ని మలచుకొని విప్లవాన్ని చివరిదాకా తీసుకపోవడానికి ప్రిధానమైన మార్గం. కొంతమంది యువమేధావులు వాస్తవాలనుంచి దూరంగా వుంటున్నారనే సంగతి కార్మికులనుంచి, రైతాంగంనుంచి వేరుగా వుంటున్నారనేవిషయం లూసన్ దృష్టినుంచేమీ తప్పించుకోలేదు. ఫలితంగా, వాళ్ళు ప్రజాబలాన్ని చూడలేకపోయారు, విప్లవంగురించి కాల్పనిక భావాలు ఊహించుకున్నారు. క్రూరమైన వర్గపోరాటాన్ని అందమైందిగా. కవితామయమైనదానిగా భావనచేశారు. కొంతమంది యువకులు విప్లవాన్ని వ్యక్తిక అభివృద్ధికి సాధనంగా భావించారు. ఈ ఆశలను తుఫానులు చెదరగొట్టినపుడు వాళ్ళగుండెలు జారినవి. వాళ్ళింత కాలం పొగడుతూవున్న యీ విప్లవమనే శిలలుతాకి ముక్కలయ్యారు. చరిత్రనేర్పిన యీ పాఠాలనుంచి లూసన్ యువకులకు వాస్తవమైన పోరాటాల్లో పాలుపంచుకొని విప్లవంయొక్క దుష్కరమైన, దీర్ఘకాలికమైన స్వభావాన్ని గ్రిహించవలసిందిగా వినయంగా సలహాయిచ్చాడు. తమ

తప్పుడు ఆలోచనలను అధిగమించడానికి వాళ్ళెప్పుడూ వెనుకాడగూడదు. ప్రయోజ నాత్మకమైన దృక్పథాన్ని అవలంబించాలి. మొత్తం జీవితాలను కార్మికవర్గ ప్రయో జనానికి అంకితంచేయాలి- అన్నాడు.

విప్లవకారులందరూ మార్క్సిజం అధ్యయనంచేయవలసిన ఆవశ్యకతనుగురించి కూడ లూసన్ పేర్కొన్నాడు. విప్లవ సత్యాన్ని చేరుకునేముందు లూసన్ స్వయంగా ఎంతో దీర్ఘకాలం బాధాకరమైన చీకటిలో తడుములాడాడు. ఏ మార్గాన్ని అనుసరిం చాలో తెలియకుండా యీ మార్గానికి ఆ మార్గానికి వృధాగా తిరగడం ఎంతవ్యర్థమో ఆయనకు తెలుసు. మార్క్సిజం దొరికినతర్వాత ఆయన దాన్ని, కుతూహలంగా, నిరంతరంగా, అందులో శక్తికీ, వివేకానికీ ఆధారమున్నదని గ్రహించి అధ్య యనం చేసాడు. "మార్క్సిజం చాల కాంతివంతమైన తత్వశాస్త్రము. నేనిదివరలో చిక్కు విడదీయలేని సమస్యలను మార్క్సిస్టు దృక్పథంలో పరీక్షించినపుడు, అవన్నీ స్పష్టమయినవి"అని లూసన్ ధృవపరిచాడు. తాను బ్రతికినంతకాలం మార్క్సిజం- లెనినిజం అధ్యయనంచేస్తూనే వుండాలని ఆయన నిశ్చయించుకున్నాడు; అట్లాగే విప్లవ పథాన్ని అనుసరించదలుచుకున్న యువకులుకూడ కష్టాలతో చలించకుండా, దీక్షగా, మార్క్సిజం-లెనినిజం అధ్యయనంచేయాల్సిన అవసరమున్నదని నొక్కిచెప్పాడు. ఈ విషయాన్ని సాహిత్యము-కళల్లో వర్గపోరాటంగురించి చెప్పే సందర్భంలోచెప్పాడు.

నిజమైన మార్క్సిజం- మరియు మార్క్సిజం కాని దానిమధ్య తేడా చూడడం నేర్చుకోకపోతే వాళ్ళు సరియైన పంధానుంచి తప్పిపోతారనికూడ లూసన్ యువకులను హెచ్చరించాడు. ఈ విషయంలో తులనాత్మక పరిశీలనాపద్ధతి అనుసరించవలసిందిగా సూచించాడు. నిజమైన బంగారాన్ని కాపర్‌సల్ఫైడ్ నుండి వేరుచేసి చెప్పలేకపోతే రెండింటినీ తూకంవేస్తే, ఏది అసలైనబంగారమో తేలిపోతుంది- అన్నాడు. మార్క్సి జాన్ని క్షుణ్ణంగా చదవాలని కుతూహలపడే యువకులు ఆకర్షణీయమైన వాదనలతో కొట్టుకుపోకుండా స్థిరమైన, ఆధారపడదగిన మార్క్సిస్ట్ క్లాసిక్స్ (మార్క్స్ ఏంగెల్స్, లెనిన్ స్టాలిన్, మావోసేటుంగ్ స్వయంగా రాసిన పుస్తకాలు- అను) అధ్యయనం చేయవలసిందిగా సలహా యిచ్చాడు; వీటిని వాళ్ళు అవకాశవాద సిద్ధాంతాలతో పోల్చి నపుడు వాళ్ళే ఏది సరియైందో, ఏది తప్పో చూడగలుగుతారు.

విదేశ సామ్రాజ్యవాదాన్ని, ఫ్యూడలిజాన్ని, నిరంకుశ పెట్టుబడిదారీ విధానాన్ని కూల్చివేసి శ్రామికవర్గాన్ని, ప్రజలను విముక్తంచేసే నూతన చైనాను నిర్మించడానికి యువకులు వాస్తవ జీవితంలోకి వెళ్ళి మార్క్సిస్ట్ సిద్ధాంతాన్ని అధ్యయనంచేయాలని ఆయన కోరాడు. ఇది చరిత్ర చైనా శ్రామికవర్గంమీద మోపిన బాధ్యత; విప్లవ పోరాటంలో పాలు పంచుకుంటున్న యువకుల ప్రాథమిక లక్ష్యం.

చైనా చరిత్ర1లో సాటిలేని దేశభక్తుడు లూసన్. కుండ బద్దలుకొట్టినట్లు మాట్లాడడానికి, నవ్వడానికి, ఏడ్వడానికి, కోపాన్ని వెలిగ్రక్కడానికి, తిట్టడానికి, పోరాడడానికి సాహసించవలసిందిగా యువకులకు ఆయన ఆవేశపూరితమైన విజ్ఞప్తులుచేశాడు. గుంతలను, ముళ్ళను, అవహేళనలను, చీకట్లోతాకే దెబ్బలను చూసి భయపడవద్దని, చైనాలో చీకటితో కప్పబడిన భయంకరమయిన ఆ దశను నాశనంచేయమనీ, వాళ్ళనాయన కోరాడు. సాయుధులై ఎదురు నిలిచిన హంతకులను అసహ్యించుకుంటూ "వామపక్ష" మితవాద, అభివృద్ధినిరోధక అవకాశవాదధోరణులను ఖండిస్తూ లూసన్ పోరాటం అగ్రభాగాన నిలిచాడు కష్టాలలోకూడ తొణకని ఆయన ధైర్యసాహసాలు లక్షలాది యువకులకు ప్రకాశమానమయిన మార్గదర్శకాలు.

లూసన్ మరణించి ముప్పైఏండ్లకు పైగా గడచినవి. గొప్పనాయకుడు చైర్మన్ మావో, చైనా కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో, చైనా ప్రజలు సామ్యవాద నూతన చైనాను స్థాపించుకున్నారు. మావో ఆలోచనా విధానం సూర్యకాంతిలో, తుషారబిందువుల్లో చిగురిస్తూ ఒక నూతనతరం శక్తివంతంగా ప్రవర్ధిల్లుతున్నది. మా ఉత్తమమైన సామ్యవాదవిధానం మా యువతరం కోసం అపార ప్రకాశమానమైన భవిష్యత్ద్వారాలను తెరిచింది. అయినా లూసన్ తన సమకాలీన యువకులపట్ల చూపిన శ్రద్ధనుగాని, ఆయన వివేకవంతమైన బోధనలనుగాని వాళ్ళు మరువజాలరు. నూతన చైనాయువకుల హృదయాల్లో ఆయన ఉజ్వలమైన మూర్తి ఎల్లప్పుడూ సజీవంగా వుంటుంది.

(Chinese Literature No. 2, 1974– Literary Criticism–శిహ్ యికొ –Shih Yi-Ko– "Create a Host of New Fighters-" Lultsun's care for the younger generation కు తెలుగు)

1) లూసన్ (1881-1936) గొప్ప రచయిత, తాత్వికుడు.

2) ఫిబ్రవరి 7, 1931 రోజున ఇన్‌పు, జౌషిహ్, లిపీ-షెన్, హు యెహ్-పిన్, ఫెంగ్ కెంగ్ అనే అయిదుగురు యువరచయితలను కొమింటాంగ్ అభివృద్ధి నిరోధకులు రహస్యంగా చంపేశారు. వాళ్ళ రెండవ వర్ధంతి రోజు లూసన్ 'Writter for the sake of forgetting' అనే వ్యాసం రాసాడు. (చూ. Chinese Literature No. 2, 1974)

3) పాయిమాంగ్ అనేది ఇన్‌పు మరో పేరు. పాయిమాంగ్ కవితా సంకలనం 'The children's pagoda' చైనా విముక్తం అయ్యేదాకా ప్రచురితం కాలేదు. లూసన్ భద్రపరచి వుంచిన యీ వ్రాత ప్రతిని 1958 లో ప్రజాసాహిత్యప్రచురణ సంస్థ (People's Literature Publishing House) ముద్రించింది. దీనికి

ముందుమాట (డెమీ-కన్వెషన్ స్టూడియో-షాంఘైలో) 1936 మార్చి 11 రాత్రి రాసాడు లూసన్. పాయిమాంగ్ నిజమైన పేరు సుపాయ్. ఆయన తరచుగా వాడుకున్న కలంపేరు ఇవ్ఫు. (చూ. Chinese Literature No. 2, 1974)

4) 1935 వసంతంలో యువచైనా కళాకారులు ఏర్పాటుచేసిన పెకింగ్-టీయిన్ట్సిన్ వుడ్‌కట్ సొసైటీ పెకింగ్, సినాన్, షాంఘై నగరాల్లో అఖిలచైనా వుడ్‌కట్ ప్రదర్శన ఏర్పాటుచేసింది. ఆ ప్రదర్శన నుంచి ఎన్నికచేసిన ఆల్బమ్(సంపుటి)కు లూసన్ 4 జూన్, 1935 న ముందుమాట రాసాడు.
(చూ. Chinese Lite.ature No. 2, 1974.)

జనచైనాలో ప్రజాకళలెలా ప్రదర్శించ బడతాయి?

"తెల్లకురుల అమ్మాయి" సంగీత రూపకం – ఒకపరిశీలన

హో చింగ్-చి

స్వేచ్ఛానువాదం : ముదార్ వేణు

[జనచైనాలో నాటకాలు, సంగీత రూపకాలు (Opera) ఏలా ప్రజాపరం చేయబడ్డాయి? ప్రజల్ని అధ్యాపకులుగాను, విమర్శకులుగాను భావించి వారి అమూల్యమైన సలహాలు తీసుకొని సన్నివేశాల్లో మార్పులు, చేర్పులు, కూర్పులు చేసి ఎప్పటికప్పుడు ప్రజాభిప్రాయానికి అనువుగా వాటిని మలిచి ప్రదర్శిస్తారనే సత్యాన్ని "తెల్లకురుల అమ్మాయి" సంగీతరూపకపు ఉపోద్ఘాతంలో విశదీకరించ బడింది.

కళలు జనచైనాలో ప్రజల పరం ఎలా చేయబడ్డవో యీ ఉపోద్ఘాతం చదివితే తెలుస్తుంది.

దాని స్వేచ్ఛానువాదం యీ కింద యిస్తున్నా. – అనువాదకుడు.]

1940 సంవత్సరంలో వాయవ్యహోపేలో 'తెల్లకురులదేవత' (White haired Goddess) కథ బాగా వ్యాప్తిలోవుంది. కొండప్రాంతంలోని ఓ చిన్న గ్రామంలోని ప్రజలలోను, పార్టీ కార్యకర్తలలోను, వేళ్లూనిన మూఢనమ్మకం ఆ గ్రామంలో మాపని

మందకొడిగా సాగడానికి కారణమైంది. 'తెల్లకురుల దేవత' ఆ ప్రాంతాల్లో కనిపిస్తాం దని ఓ పుకారు వుండేది. ఆమె దేహమంతా తెల్లగా వుంటుందనీ, ఆమె రాత్రిళ్ళు మాత్రమే కనిపిస్తుందని చెప్పుకొనేవారు. ఈ 'దేవత' వూరిబయట పాడుబడ్డ దేవాలయాన్ని తన నివాసంగా చేసుకొందని, గ్రామ ప్రజలు నెలకు రెండుసార్లు నైవేద్యాలు అర్పిస్తుంటారని తెలిసింది. ఆమె ఆదేశం ప్రకారం సాయంత్రం అచ్చట వుంచిన నైవేద్యాలు తెల్లారే సరికల్లా ఆశ్చర్యకరంగా మాయం కావటం చాలాకాలంగా జరుగుతోంది. ఎప్పుడైనా పొరబాటున నైవేద్యాలుంచడం జరగనప్పుడు ఆ చీకటి దేవాలయంనుండి ఓ కీచుధ్వని యిలా వినబడేది:

"మీ దేవతను నిర్లక్ష్యం చేస్తున్నారు–
జాగ్రత్త! ఫలితం అనుభవిస్తారు."

ఒక రోజు జిల్లా పరిపాలనా శాఖ నుండి వచ్చిన ఓ కార్యకర్త గ్రామాధికార్ల ఎన్నికకు ఆ గ్రామంలో ఒక సభ ఏర్పాటు చేశాడు. ముందుగానే సమయం, తేదీ నిర్ణయించినప్పటికీ గ్రామస్థులెవ్వరూ సభకు హాజరుకాలేదు. కారణమడగ్గా గ్రామపెద్దలు యిలా జవాబిచ్చారు.

"ఈ రోజు పౌర్ణమి. వారంతా "తెల్లకురుల దేవత"కు నైవేద్యాలు అర్పించడానికి వెళ్లారు"

వివరాలు సేకరించిన తర్వాత జిల్లా కార్యకర్త "యిదేదో శత్రువుల పన్నాగమైనా కావాలి, లేదా ఏదైనా క్రూరమృగాన్ని వీరిలా భావిస్తుండాలి"అనుకొన్నాడు. ఆ దయ్యాన్ని చంపాలని నిర్ణయించు కొన్నాడు. అదే రోజు రాత్రి గ్రామ రక్షణాధికారిని వెంటబెట్టుకొని, సాయుధంగా ఆ దేవాలయ ప్రాంతానికి వెళ్ళాడు. దేవాలయంలో పశ్చిమంగా చీకటిగా వున్నచోట యిద్దరూ దాక్కొన్నారు. అర్ధరాత్రి తర్వాత, భక్తులందరూ గ్రామానికి వెళ్ళిపోయింతర్వాత, నిండు వెన్నెలలో చల్లటిగాలి– దానివెంట అడుగుల చప్పుడు వినబడింది, ఒక తెల్లటి ఆకారం ఆలయంలోనికి ప్రవేశించింది. ఆ మసక వెల్తురులో ఆ ఆకారం నైవేద్యాల్ని సంగ్రహించడం మాత్రం కనిపించింది. అది దేవాలయాన్నుండి బయల్దేరే సమయానికి జిల్లా కార్యకర్త తానుదాగిన చోటునుండి యివతలకొచ్చి "ఎవరు నీవు."అంటూ అరిచాడు.

మొదట నిర్ఘాంతపోయి, ఆ ఆకారం భయంకరమైన కీచుధ్వని చేస్తూ, అతనిపై లంఘించింది. అతను వెంటనే దానిపై తుపాకీ పేల్చాడు. ఆ ఆకారం దబ్బున కింద పడి వెంటనే పరుగు లంకించింది. ఆ యిరువురు ఆ ఆకారాన్ని వెంబడించారు. అడవి

గుండా పరుగెత్తుతూ కొండపైకి ఆ ఆకారంవెంట తరుముతూ అనుసరించారు. కొండపై కొంత దూరంపోయి కొన్ని మలుపులు తిరిగేసరికి ఆకారం కనిపించలేదు. దిక్కుతెలియక, ఏం చేయడానికీ పాలుపోక యిరువురూ ఆలోచిస్తూ కొంతసేపు అక్కడే నిలబడ్డారు. అంతలోకే వారికి దూరంలో పసిపాప ఏడ్పు వినిపించింది. చీకట్లో దీర్ఘంగా దృష్టి సారించింతర్వాత, దూరంలో చిన్నగా వెల్తురు కనిపించింది. వారు సాహసంగా ముందుకెళ్ళి అచ్చట ఒక గుహను అందులో శిశువు నాడిస్తున్న 'తెల్లకురుల దేవతను' చూశారు జిల్లా కార్యకర్త తుపాకీ గురిపెట్టి "ఎవరు నీవు? చెప్పి నీ ప్రాణాలునిలుపుకో. లేకపోతే నిన్ను పేల్చేస్తా–" అన్నాడు

అప్పుడామె కూలపడి చాలా సేపు ఏడ్చింది. తర్వాత తన స్వీయకథ వారిముందు వెళ్ళబోసుకొంది.

తొమ్మిదేళ్ళ క్రితం (జపాన్ దురాక్రమణ యుద్ధం ప్రారంభం కాకపూర్వం– 'ఎయిత్ రూట్ సైన్యం' ఈ జిల్లాలో ప్రవేశించకముందు)ఆ గ్రామంలో ఓ క్రూరుడైన భూస్వామి వుండేవాడు అతడు గ్రామ రైతుల్ని తీవ్రమైన బాధలకు గురిచేసేవాడు. అతని కౌలుదారుడికొకడికి పదిహేడేళ్ళ కూతురుండేది. చాలా అందగత్తె. తెలివైంది. ఆ అమ్మాయిపై అతడికి మనసైంది. కౌలు చెల్లించమని వత్తిడిచేసి, పీడించి, నానా హింసలకు గురిచేసి, ఆ అమ్మాయి తండ్రిని ఆత్మహత్యకు గురిచేశాడు. ఆ తర్వాత ఎంతో ప్రేమ, ఆదరం ప్రదర్శించి ఆ అమ్మాయిని తన యింటికి తీసికెళ్ళాడు. తన అధీనంలో వుండగా ఆమెని చెరిచాడు. ఫలితంగా ఆమె గర్భం ధరించింది. ఈ విషయం తెలుసుకొన్న ఆ భూస్వామి ఆ అమ్మాయిని హత్యచేయాలని ప్రయత్నించాడు. ఈ పన్నాగాన్ని ముందుగానే పసిగట్టిన పనిమనిషి ఆ అమ్మాయి ఇంటినుండి ఆ రాత్రికి రాత్రే వెళ్ళిపోయేందుకు సాయపడింది. అలా ఆ భూస్వామి యిల్లు వదిలిపెట్టింతర్వాత ఎక్కడికెళ్లాలో, తన భవిష్యత్తునెలా తీర్చిదిద్దుకోవాలో ఆమె కర్థంకాలేదు. అప్పుడామె మనుషులకు దూరంగా కొండగుహ నాశ్రయించింది. అక్కడే ఆమె ప్రసవించింది.

తన అసహ్యతను, అసహాయతను దిగమింగి ఆమె చాలాకాలంపాటు ఆ గుహలో కాలం గడిపింది. సరియైన ఆహారం లేకపోవడంచేత, చలికిసరైన రక్షణ కరువవటం వల్ల తీసుకొనే ఆహారంలో వుప్పులేకపోవడంచేత ఆమె వెంట్రుకలు తెల్లగామారాయి. ఆమె అప్పుడప్పుడు చీకటి దేవాలయం దగ్గరికెళ్ళి, అక్కడి నైవేద్యాలను మాయం చేయడం వల్ల, ఆ గ్రామస్థులు ఆమెను దేవతగా మార్చారు. గ్రామస్థుల అమాయకత్వాన్ని, అజ్ఞానాన్ని వినియోగించుకొని తనకావలసిన ఆహారాన్ని నైవేద్యాలరూపంలో 'తెల్లకురుల దేవత'గా నటిస్తూ సంపాదిస్తూ, ఆ కొండగుహలో తన పాపతో జీవించ సాగింది ఆమె.

ఆమె కథవిన్న కార్యకర్త మనిషిని బలిగావించే. క్రూరమైన పాత వ్యవస్థను తలుచుకొని కరిగిపోయాడు. అతడు ఆ 'తెల్లకురుల దేవత'తో 'ఎయిత్ రూట్ సేన' ప్రజల్ని విముక్తుల్ని గావించిన సంగతి చెప్పి- పూర్వం అలాంటి దారుణమైన దుర్మార్గాలు జరిగాయని, యిప్పుడు ప్రజలు ఎవరికి వారు యజమానులై, సుఖ, సంతోషాల్తో జీవిస్తున్నారని చెప్పాడు. ఆమెను ఆ చీకటి గుహనుండి, నిర్మానుష్య పరిసరాల్నుండి వెల్తురులోకి తెచ్చాడు. ఆ అమ్మాయి మనిషిగా మారి, సరికొత్త జీవితాన్ని ప్రారంభించింది.

ఈ యదార్థగాథ ప్రజల్లో మంచి ప్రచారం పొందింది. జనబాహుళ్యం దీన్ని తీర్చి దిద్దారు. సరిహద్దు ప్రాంతంలోని రచయితలు దీన్ని చిన్న కథలుగాను, పాటలుగాను రాశారు. 1944 నాటికి యిది 'ఎనాన్' చేరింది.

ప్రచారం పొందిన కథల్లో కొన్ని వైవిధ్యాలున్నప్పటికీ, ప్రధాన కథలోను, ముఖ్య సంఘటనల్లోను భేదాల్లేవు. ఈ కథ విన్నప్పుడు మనం తీవ్రంగా కదిలిపోతాం. కౌలుదారు కూతురికి జరిగిన విషాద సంఘటన పాత చైనా ఫ్యూడల్ వ్యవస్థలో కౌలుదార్ల దుస్థితిని కళ్ళకుకట్టినట్లు చూపుతుంది. దాంతో పోల్చినప్పుడు, ప్రస్తుతం చైనాలో కమ్యూనిస్టుపార్టీ నడుపుతున్న ప్రజాస్వామ్యంలో రైతులు తమకుతాము యజమానులుగా ఎంతటి గొప్పసుఖం అనుభవిస్తున్నారో తేటతెల్లమౌతుంది. సంగీత రూపకంలోని మాటల్లో "పాతవ్యవస్థ మనుషుల్ని దయ్యాలుగామార్చింది. నూతనవ్యవస్థ దయ్యాల్ని మనుషులుగా మార్చుతోంది." ఈ కథ ఆ ప్రాంతంలో బాగా ప్రచారం పొందడానికి కారణం చైనారైతాంగం కొన్ని శతాబ్దాలపాటు తీవ్రబాధలకుగురై, యిప్పుడువిముక్తి పొందడమే. కమ్యూనిస్టుపార్టీ నాయకత్వంలో వారి జీవితాలు గొప్పమార్పుపొందింది. వారి గుండెల్లో కొత్తవెల్తురు ప్రసరించి, వారి వూహల్ని, బుద్ధిని కదిలించివేసింది. అందువల్ల ఈ కథ ప్రజాపోరాటంవల్ల కలిగినమార్పును ప్రస్ఫుటింపజేసింది.

ఈ సంగీతరూపకంలో కథలోని ముఖ్యపాత్రల్ని, ప్రధాన సంఘటనల్ని అలాగే వుంచడంజరిగింది. కథలోని ప్రధాన యితివృత్తాన్ని ప్రజల హృదయాలకు సూటిగా హత్తుకునేలా, చక్కగా, ప్రదర్శనానుకూలంగా కథలో కొన్ని చిన్నమార్పులుచేశారు.

యితివృత్తాన్ని అర్థంచేసుకొనడానికి, ప్రదర్శించడానికి కొంతకాలంపట్టింది. కొందరు దీన్ని ఒక దయ్యంకథ అనీ, దీన్లో సాంఘిక పరిస్థితులు ప్రతిబింబించడం లేదనీ అన్నారు. మరికొందరు ప్రజల్లోని మూఢనమ్మకాల్ని తొలగించడానికి అనువైన కథగా దీన్ని రాయొచ్చన్నారు. దీన్ని జాగ్రత్తగా అధ్యయనంచేసింతర్వాత, మేము దీన్ని కేవలం ఒక దయ్యపుకథగాగానీ, మూఢనమ్మకాలను ఎదిరించేదిగానే కాక రెండు

వ్యవస్థలమధ్యనున్న తారతమ్యాలను తెలిపేదిగాను, ప్రజలవిముక్తిని ప్రతిబింబించేదిగాను దీన్ని గుర్తించాము.

సంగీతరూపకంగా దీన్ని మలచడానికి 'రిహార్సలుకు' మూడునెలలకుపైగా పట్టింది. (1945 జనవరినుండి ఏప్రిల్‌వరకు) ఆ వ్యవధిలో మేము ప్రయోగాలుచేస్తూ, మార్పులు, కూర్పులుచేసుకొంటూ, మంచి సంగీతరూపకంగా తీర్చిదిద్దాము సరిహద్దు ప్రాంత జీవితంగూర్చి మాకు బొత్తిగాతెలియదు. రాయడంలోకూడా మాకు అనుభవం లేదు. వీటికితోడు సాంకేతికంగా నాటకనిర్వహణకు తగిన పరికరాల్లేవు. ఆ ప్రాంతంలో అనుభవమున్న కామ్రేడ్ల సలహాలుతీసుకొంటూ, పల్లెప్రాంతాల్లో మా గతానుభవాల్ని జోడించాం. అంతేకాక ఈ కథలోని సంఘటనలగురించి మిత్రులు చాలమందితో చర్చించి, ఈ సంగీతరూపకాన్ని రచించాము. రిహార్సలుసమయంలో ఈ సంగీత నాటకాన్ని నటీనటులు, నిర్మాత చాలామార్పులుచేశారు, చాలామంది నిపుణులు, విద్యార్థులు, మంచి సలహాలందించారు. ప్రత్యేకంగా పేర్కొనదగిందేమిటంటే మా 'రిహార్సల్'కు ఎంతో వుత్సాహంతో చాలమంది పల్లెప్రజలు, పాఠశాల వుపాధ్యాయులు, వంటవాళ్లు,వచ్చేవారు. 'రిహార్సల్'చూచి చిన్నచిన్న అంశాలపైకూడా మంచి సలహాల నిచ్చేవారు. మేము ఆఖరి అంకంలో ప్రస్తుత వ్యవస్థను వర్ణించే సందర్భంలో, సరిహద్దుప్రాంతంలో పాలనా వ్యవహారం నిర్వహించే కామ్రేడ్ల సలహాలను తీసుకొన్నాం.

1945 ఏప్రిల్‌లో ఈ సంగీతనాటకం 'ఎనాన్'లో ప్రదర్శించబడింది. 30 కిపైగా ప్రదర్శనలివ్వబడ్డాయి. దీన్ని ప్రజలు మహోత్సాహంతో చూశారు. చాలామంది మా కార్యకర్తలు, స్థానికప్రజలు ప్రదర్శనను తిలకించారు. కొందరు చాలాదూరప్రాంతాలనుండికూడా వచ్చారు ఇందులోని పాటలు బాగా జనాదరణపొందాయి. నాటకం ప్రజల్లో బాగా ప్రచారంపొందింది. వీధిలోనడుస్తుంటే కొందరు మమ్మల్నిచూపుతూ "అదుగో తెల్లకురులదేవత"అనీ, "అతనే కౌలుదారు యాంగ్"అనీ అనేవారు. చిన్నపిల్లలు మా చుట్టూచేరి చిలిపిగా "అదుగో పారిపోయే 'మూ'" – "భూస్వామి హ్యాయాంగ్! నీచుడా!" అంటూండేవారు.

ప్రజలు (ముఖ్యంగా పల్లెప్రజలు) ఈ నాటకాన్నిచూచి "ఇది యదార్థజీవితానికి ప్రతిబింబం. మనమంతా పాతవ్యవస్థనుండి వచ్చినవాళ్ళమే. ఆ అమ్మాయికి జరిగిన భయంకర సంఘటనలుచూచి ఎవరుమాత్రం కన్నీరు కార్చకుండా వుండగలరు," అని చర్చించుకునేవారు.

ఒక కార్మిక నాయకుడు ఈ నాటకం చూచి, గతంలో తను బలవంతంగా తన కూతుర్ని అమ్ముకొనాల్సి వచ్చిన దుర్భర పరిస్థితుల్ని జ్ఞప్తికి తెచ్చుకొన్నాడు.

"ఈ రోజు కమ్యూనిస్టు నాయకత్వంలో పేదప్రజలమైన మనం యజమానుల మైనాముం"టూ వుప్పొంగిపోయాడు.

'ఏనాన్' ప్రజల సాంస్కృతిక జీవితాన్ని ప్రతిబింబించేట్లుగా, యీ రూపకాన్ని ప్రత్యేక శ్రద్ధతో ప్రజలు కార్యకర్తలు పరిశీలించి, ఆసక్తికరమైన విమర్శలు చేశారు. అందువల్ల ఈ సంగీతరూపకం సలహాలు, విమర్శల ఆధారంగా ఎన్నోసార్లు మార్పులు చేసుకొంది. ప్రేక్షకులతోబాటు కూర్చొని ప్రదర్శనను మేము తిలకిస్తున్నప్పుడున్నూ— తర్వాత వారి విమర్శాపూర్వక సలహాలు వింటున్నప్పుడున్నూ- మాకు ప్రజల నుండి నిజాయితీతో కూడిన అమూల్యమైన విమర్శలు వినవచ్చేవి. అప్పుడప్పుడు మేము ప్రేక్షకులైన కార్యకర్తల్ని, మామూలు పౌరుల్నికూడా కలిసి వారి అభిప్రాయాలు స్వీకరించేవాళ్ళం.

1945 అక్టోబర్‌లో మేమీ రూపకాన్ని ప్రదర్శించడానికి 'కల్గాన్' వెళ్ళాము. సాహిత్యంలో కృషిచేస్తున్న మా కామ్రేడ్‌లు మాకు చాలా సాయం చేశారు. వారు స్థానిక సమస్యలు బాగా అధ్యయనంచేసిన అనుభవజ్ఞులు. వారి సలహాలు తీసుకొన్నాం. ఇంతకు ముందు ప్రేక్షకులు చేసిన విమర్శలు, యిచ్చిన సలహాలు, దృష్టిలోపెట్టుకొని ఈ సంగీత రూపకంలో మరికొన్ని మార్పులు చేశాం. 1947 లో కొన్ని ముఖ్యమైన మార్పులు చేశాం. 1949 లో మరికొన్ని మార్పులతో చివరిసారిగా రూపకాన్ని తయారు చేశాం.

ఈ సంగీత రూపకం ఒక కొత్త పద్ధతిలో, సమిష్టి కృషి ఫలితంగా, విశాల ప్రజాసముదాయానికి ప్రాతినిధ్యం వహించేదిగా తయారైంది. కారణం, ఇది ఒక పల్లె ప్రాంతంలో జరిగిన యదార్థగాథకు ఎందరో ప్రజలు గావించిన రూపకల్పన. తర్వాత ఈ రూపకాన్ని చాలామంది నిశితంగా అధ్యయనంచేసి, విమర్శించి, మార్పులుసూచించి, ప్రత్యక్షంగాను, పరోక్షంగాను, దీన్ని ఒక గొప్ప కళాఖండంగా రూపొందించడంలో మాకెంతగానో సహాయపడ్డారు. సమిష్టి కృషి, ప్రజా సహకారం, లేనియెడల యీ "తెల్లకురుల బాలిక" వెలువడేదే కాదు.

మరో అతిముఖ్యమైన యదార్థమేమంటే, నిపుణులనుండి, కళాకారులనుండి, కార్యకర్తలనుండి, మాకు లభించిన సహాయంకంటే- ఈ రూపకం ప్రజల సహాయ, సమీక్షల ఆధారంగానే తయారైంది. ప్రజలు మా అధ్యాపకులు, మేమెలాపనిచేయాలో వారే మాకునేర్పారు. వారే మాకు అత్యంత నమ్మకమైన న్యాయనిర్ణేతలు, మంచి విమర్శకులు. ఈ నూతన 'కళ' ప్రజలకు సేవచేస్తూ, వారి జీవితాల్ని సమగ్రంగా ప్రతిబింబిస్తుంది. ప్రజలే యిందలి పాత్రలు, విమర్శకులు. కొన్ని సమయాల్లో ఈ రూపకానికి సృష్టికర్తలుకూడా అని మేము అనుభవపూర్వకంగా చెబుతున్నాం.

స్వేచ్ఛ ఎందుకు?

మానవునిగా జీవించటానికే కాని సోదర మానవులతో పోటీపడటానికీ పీడించటానికీ కాదు.

మూలం : ఫెలిక్స్‌గ్రీన్

సంక్షిప్త స్వేచ్ఛానువాదం : చంద్రశేఖర్

1. **చైనాప్రజలు ఏయే పాలసీలను, మార్గాలను అవలంబించి విజయాలు సాధించారో, వాటిని స్వంతంచేసుకోండి!**

చైనా ప్రజలు సాధిస్తున్న విజయాలు ప్రపంచప్రజలకందరికి ఉత్సాహాన్నీ, ఊపునీ కలుగజేస్తున్నాయి, ప్రత్యేకంగా శ్రామికవర్గ సాంస్కృతిక మహావిప్లవంతర్వాత జన చైనా ప్రపంచప్రజలకు ఆశాజ్యోతిగా మరింత ముందుకువచ్చింది. వివిధ దేశాల్లోని సమాజ వ్యవస్థలమీద, సమాజంలోని వివిధవర్గాలమీద, వ్యక్తులమీద, గాఢమైన ప్రభావాన్ని కలిగించింది. చైనాప్రజలు ప్రగతిపథంలో సాధించిన విజయాలగూర్చి అనేకులు చూసివచ్చారు. అనేక వ్యాసాలు, పుస్తకాలు వెలువడ్డాయి. చైనా ప్రగతిగురించి చాల మందికి వివరంగానేతెలుసు, కాని ఈ వివరాలు తెలుసుకోవటంతోనే సరిపోతుందా? కరువుకాటకాలతో, యుద్ధాలతో, నిరుద్యోగంతో పీడించబడిన ఆనాటి చైనా ఈనాడు ప్రపంచ ఆశాజ్యోతిగా ఏ విధంగామారిందో, ఏ విధానాలవల్ల, యే మార్గాల అనుసరించడంవల్ల మారిందో పరిశీలించి స్వంతంచేసుకొని, ఆయా మార్గాలను సిద్ధాంతాలను మన సమాజానికీ, మనవ్యక్తిగత జీవితాలకూ అన్వయింపచేసుకోవాల్సిన ఆవశ్యకత వుంది.

2. **సాంకేతిక విజయాలు ప్రజాసేవకుపయోగపడాలి!**

చైనాలో అనేకమంది పర్యటించివచ్చారు. కాని అసలుసారాన్ని, కిటుకును, వారు పట్టుకోలేకపోయారు. ఈమధ్య ఒక ప్రఖ్యాత అమెరికా నిపుణుడు చైనాలో అయిదు వారాలు గడిపివచ్చాడు. చైనాప్రజలు సాధించిన విజయాల తాజా సమాచారం బుర్రలో నింపుకొని వచ్చాడు. కాని ఈ ప్రొఫెసరు అంతకుముందే ఏర్పరుచుకొన్న భావాలతో, ఆ భావాల 'రంగుటద్దాల'నుండేచూసి తప్పుడు నిర్ణయాలకువచ్చాడు. పాశ్చాత్యదేశాల సాంకేతిక విజయాలను చైనాప్రజ అనుభవించలేదనీ- రాబోవుకాలంలో ప్రజలు ఎక్కువ వినిమయవస్తువులు కోరుతారనీ, చైనా సాంకేతిక పరిజ్ఞానం ప్రజా అవసరాన్ని తీర్చ

లేదనీ, తద్వారా చైనాలో సంక్షోభం అనివార్యమనీ 'జ్యోతిషం' పలికాడు. ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి ఉన్నత విద్యాధికవర్గం అవసరముంటుందని సూత్రీకరించాడు. కాని చైనా ప్రజలకు కావలసింది— సాంకేతిక విజయాలు ప్రజాసేవకు వినియోగపడటం. అంతేకాని సాంకేతిక విజ్ఞానం సమాజాన్ని అదుపులో పెట్టకూడదు— దీన్ని అర్థంచేసుకోవటంలో ఆయన విఫలమయ్యారు. కొందరు ప్రత్యేక అంతస్థు, లేక ఆధిక్యతకల వారుగా తయారుకాకుండానే ప్రజలందరూ సాంకేతిక నిపుణులుకావచ్చుని, చైనాప్రజలు విశ్వసిస్తున్నారు. వినియోగవస్తువుల అధికవుత్పత్తి పేరిట, ఆధునిక సాంకేతిక విజ్ఞానానికి 'ప్రత్యేక హోదాకలవర్గం' ఏర్పడాలనే 'రంగుటద్దాల' భావాలను వారు ఖండించారు కనుకనే వినియోగవస్తువుల అధిక వుత్పత్తి కన్నా, ప్రజలమధ్య సరియైన సంబంధాలను నెలకొల్పటానికే ప్రాముఖ్యతనిస్తారు.

3. బూర్జువా సంస్కృతి అంతా ఈ వ్యవస్థను యథాతథంగా కాపాడటానికి వుద్దేశింపబడిందే!

మనలోని ఆశల, భయాల, ఆశయాలపై, మన ఆలోచనావిధానంపై, మన విద్యావిధానంపై, నైతిక విలువలపై, ఇతరులతో మనకుగల సంబంధాలపై అంటే, మన జీవితంలోని ప్రతి అంశంమీదా, బూర్జువాసిద్ధాంతం తన ప్రభావాన్ని కలిగిస్తుంది. మన వునికిని, మన ఆలోచనా విధానాన్ని, యీ పెట్టుబడిదారీ సిద్ధాంత బానిస సంకెళ్ళనుండి కాపాడటమే కష్టమౌతుంది. అంతేకాదు, యీ సిద్ధాంత ప్రభావాన్ని గుర్తించుటకూడా కష్టమైపోతుంది. పుట్టిన క్షణంనుండీ మనపైన పెట్టుబడిదారీ సిద్ధాంతాలు 'తాత్విక ధోరణులు' ఎంతటి క్లిష్టమైన, కనిపించని, సర్వవ్యాపిత ప్రభావాన్ని కల్గివుంటున్నవో, నేను చైనాను ఈసారి చూశాక (అదివరకటికంటే ఎక్కువగా) అర్థమయింది. వెస్టెండ్ థియేటరు, సినిమా, వినోదకాలక్షేపాలూ, రేడియో— సంస్కృతి పేరుతో రుద్దుతున్న 'చెత్త'ను చూస్తే ఇవి రాజకీయాల కతీతంగా వుంటున్నవో లేక ఈ వ్యవస్థను జాగ్రత్తగా, యథాతథంగా కాపాడుతున్నవో మన కర్థమౌతుంది. అలాగే మతం, కట్టు కథలు, రాజరిక గాథలు, పురాణ గాథలు ఈ వ్యవస్థను కాపాడడంలో తమ పాత్రను నిర్వహిస్తున్నాయి.

4. ఓటుతత్వం వచ్చిందంటే ప్రజాస్వామ్య భావన పోయినట్లే!

వయోజన ఓటింగుహక్కు కలిగివుండి, నాలుగేళ్ళకొకసారి తన ఓటును పాలకవర్గాలలోని ఎల్లయ్యకో, పుల్లయ్యకో వేయటమే ప్రజాస్వామ్య మవుతుందా? ప్రజాస్వామ్యం అంటే ఎన్నికలు మాత్రమేకాదని, అవి పై పై రూపురేఖలు మాత్రమేనని, పై అంశాల ఆవశ్యకత చాల తక్కువేనని నేను భావిస్తున్నాను. మరయితే ప్రజాస్వామ్య

మంటే ఏమిటి? మనం ఒకరినొకరం ఎలా భావించుకొంటున్నాం. ఆచరణలో ఎలా ప్రవర్తిస్తున్నాం. అంటే, ప్రజాసామాన్యంలో ఒకరియెడ ఒకరికి నమ్మకం, గౌరవం, ప్రేమానురాగాలు వున్నాయా లేవా? లేక ఎప్పుడెవరేమి చేస్తారో అనే జాగరూకత, ఆందోళన, పోటీతత్వం, మొరటుతనం పెంచే వాతావరణంలో సతమతమవుతున్నారా? అనే విషయాలు ఆలోచించాలి— నా అభిప్రాయంలో ప్రజాస్వామ్యం, పోటీతత్వం, పరస్పరం విరుద్ధమైనవి. పోటీతత్వం వచ్చిందంటే ప్రజాస్వామ్య భావమే పోయినట్లు. పెట్టుబడిదారీ పోటీ తత్వం అత్యున్నతదశకుచేరిన అమెరికాను పరిశీలిస్తే, ఈ బూర్జువా పోటీతత్వం ప్రజల్లో విషాదానికి, ఒంటరితనానికి, మానవత్వం లోపించటానికి, హింసకు, ఏవిధంగా దారితీసిందో మనకర్థమౌతుంది. రాత్రులు నగరాల్లో బజార్ల వెంట ఒంటరిగా నడచిపోవటమే 'ఒక సాహసకృత్యం'గా మారిన అమెరికాలో ప్రపంచంలో అత్యున్నత 'ప్రజాస్వామ్య'మని చెప్పబడే ఆ దేశంలో ప్రజాస్వామ్యంయొక్క నిజమైనఊపిరి ఎలా ఖూనీ చేయబడిందో మన కర్థమౌతుంది. కాని చైనాలో దీనికి పూర్తిగా భిన్నమైన వాతావరణం మనకు కనబడుతుంది. చైనాలో ఏ ప్రాంతంలోనైనా, రాత్రయినా, పగలైనా, స్వదేశీయుడైనా, విదేశీయుడైనా ఒంటరిగా నడచిపోటానికి ఏమాత్రం ఆందోళనచెంద నవసరంలేదు. చైనా ప్రజల్లో ఎంత సన్నిహిత సంబంధాలున్నాయంటే అక్కడ ఎవరూ ఎవరికి కొత్తవారుకాదు. ఒకరియెడ ఒకరు భయాలు, అనుమానాలు, ఉంచుకోవాల్సిన అవసరం లేదు.

5. **వర్గపోరాటాన్ని అర్థంచేసుకోండి! ప్రజల ఆలోచనావిధానంలో మార్పు రాకపోతే శ్రామికవర్గ రాజ్యాధికారం విప్లవద్రోహులకు బలియైపోతుంది!**

మన విద్యావిధానం, మనలోని ఛాందస భావాలను, దురభిప్రాయాలను పెంచటానికి తోడ్పడుతుంది. సామాన్య ప్రజానీకం కంటే విద్యావేత్తలు తాము ఉన్నతులైనట్లు భావించేటట్లు చేస్తుంది. అలాగే అసంఖ్యాకమైన ప్రజాసామాన్యానికి విద్యారంగంలో సామాజిక జీవితంలో పై "ఉన్నతులై"న విద్యావేత్తలకన్న తాము "తక్కువ"వారమనే "అల్పులమ"నే భావాన్ని కలుగజేస్తుంది. అంతేకాక ఈ "ఉన్నతులైన" మేధావులలో ఈ సమాజం ఏవో కొన్ని సహజమైన సూత్రాలవల్ల నడుస్తోందనీ, దాన్ని పూర్తిగా మార్చటంకానీ, కనీసం తీవ్ర మార్పులు చేయటంకానీ, సాధ్యపడదనే నిరాశావాదాన్ని కలిగించింది. కాని వాస్తవంలో తమ పరిస్థితులు మార్చాలని శ్రామిక ప్రజలందరూ తలిస్తే, ఆ శక్తి వారి చేతుల్లోనే వుంది. కాని మేధావులనబడేవారిపై ఒకరకమైన అనవసరపు గౌరవం వుండటంచే, ఆ బానిసభావం వలన శ్రామికులు కార్యాచరణనుండి దూరం చేయబడుతున్నారు. అందుకనే చైర్మన్ మావో మొదటినుండి వర్గపోరాట ప్రాముఖ్యతను నొక్కి చెపుతుండేవాడు. చైనాలోకూడ అధికారం కొద్ది మంది చేతు

ల్లోనే వుండేది. అక్కడి విద్యావిధానం మేధావులకు 'ఆధిక్యత' అపాదించటానికీ, శ్రామికవర్గ ప్రజలలో నిర్వీర్యత, నిరాశలు పెంచటానికీ పాటుపడింది. మానవ సంస్కృతుల్లోకెల్లా చైనాసంస్కృతి ఉత్తమమైనదని, గొప్పదని, దానికి చైనా పుట్టినిల్లని ఇతరులందరూ తక్కువవారనే దురహంకారపూరిత ప్రచారాన్నీ చేపట్టింది. ఈ పరిస్థితుల్లో, చైనా నాయకులు- ముఖ్యంగా చైర్మన్ మావో "వర్గ పోరాటాన్ని అర్థంచేసుకోండి"అని చైనా ప్రజలకు తోవచూపాడు. చైనా ఈనాడు తాను దేనికోసం నిలబడుతోందో, ఇతరులకు చెప్పేదికూడా అదే. వర్గపోరాటం అంటే వివిధ వర్గాలమధ్య పోరాటమే కాక మన భావాల్లో జరిగే అంతర్గత పోరాటంగాకూడా నేనర్థం చేసుకొంటున్నాను. ఇదంత తేలికయిన పని కాదు. వర్గాలు, స్వలాభాలు, ఆధిక్యతా భావాలు, చీలికలు మొదలైన పాత సమాజభావాలు తమలో ఎలా ఎంత వరకు పనిచేస్తున్నాయో చెప్పి, ప్రజలను మేల్కొల్పడానికే రాజ్యాధికారం కోసం సాగిన విప్లవం కొనసాగింపుగా 'సాంస్కృతిక మహా విప్లవా'న్ని నడపటం జరిగింది. రాజ్యాధికారం కోసం జరిగిన పోరాటం ఎంత ముఖ్యమైందో, ఈ పాత సమాజ భావాల నధిగమించటానికి, వారి ఆలోచనా విధానంలో విప్లవాత్మక పరివర్తన రావటానికి యీ సాంస్కృతిక పోరాటం కూడ అంతే ప్రాముఖ్యత కలిగివున్నది. కనుక శ్రామికవర్గ రాజ్యాధికారమే కాక ప్రజల ఆలోచనా విధానంలో సమూలమైన మార్పు రాకపోతే సమాజ నిర్మాణంలోని మార్పు క్రమంగా దిగజారి ద్రోహానికి గురిఅవుతుంది.

6. **దోపిడీసమాజంలో పీడితప్రజల సమాధులపై పునాలులేపడానికే 'స్వేచ్ఛ' ఉంటుంది. "నన్ను, నేను" అనే భావన మానవులలోని ఐక్యతనుచీల్చి ఒకరికెదురుగా మరొకరిని పోటీ పెట్టటానికే ఉపయోగపడుతుంది!**

నేను ఇంతకు ముందు చెప్పిన ప్రొఫెసరుగారు, పశ్చిమదేశాల్లో వ్యక్తిత్వానికీ, ప్రతిభకు గౌరవం, విలువ ఇస్తారు, కాని చైనాలో వ్యక్తి స్వేచ్ఛ కొరవడుతుందని చెప్పాడు. 'స్వేచ్ఛ'ను గూర్చి మనకున్న అభిప్రాయాలు చాలావరకు- 19 వ శతాబ్దిలో పైకివస్తున్న పెట్టుబడిదారి యజమానులు 'తమపై ఎటువంటి'అదుపులు ఉండకూడదనే ఉద్దేశంతో ప్రచారంలోకి తెచ్చిన అభిప్రాయాలే. అవి ఏమిటంటే- 'స్వంతం' అనేదే ప్రధానం" "ప్రతి వారూ తన కోసమే" "గుంజుకోగల్గినంత గుంజుకో" "ఇలా ఎవరికి వారుచేస్తే సమాజం ఏదో విధంగా లాభం పొందుతుంది." "స్వంతం ప్రధానం" అనే భావం మన అలోచనా విధానంలో నాటుకు పోయింది. అందుకనే మానవుల్ని ఒకరికి ఎదురుగా మరొకరిని పోటీకిపెట్టే ఈ వ్యవస్థలో జీవితం గడపాలంటే- పోటీపడటానికీ నిరంతరం యాతన పడటం, మెరుగైన వుద్యోగాలకోసం ప్రాకులాడటం, ఇతరుల

కంటే పైకిపోవాలని శతవిధాల ప్రయత్నించటం తప్పనిసరి. సమాజంలో ముందుకు పోవటమనేది తప్పకుండా ఇతరుల వెనుకకునెట్టడం లేక నష్టపరచడం మీదనే జరుగుతుందని తెలిసికూడా "నన్ను నేను" ఎక్కువచేసుకోడానికి ప్రయత్నించడం, ముందుకు తోసుకుపోటానికి, "అభివృద్ధి చెందటానికి", ఎక్కువ డబ్బు సంపాదించటానికి, ప్రయత్నించటం మనం చూస్తూనే వున్నాం. దీనినుండే "నేను" "నా వ్యక్తిత్వం" "నా సృజనాత్మకత" అనేవాటికి పవిత్రత వచ్చింది, కాని నిజంగా ఇది స్వేచ్ఛయేనా?

పాశ్చాత్యదేశాల్లోని వ్యక్తిత్వాన్నిగూర్చిన యీ భావన సరియైంది కాదని, ఇది మరోరకపు బందిఖానా అని, చైనా ప్రజలు మనకు చూపెడుతున్నారు. అదంతా "నాలోనే నన్ను" ఖైదు చేసుకోవటం. నాలోనే నన్ను, నా కోర్కెలు, నా భయాలు, ప్రయత్నాలు, స్వీయ రక్షణలతో నన్ను నేనే కప్పివుంచుకోవటం— ఇదంతా ఇతరులనుండి వేరు పర్చుకోవటమే. "నేను, నన్ను" అనే భావనలు జైలులాంటివి, వీటిని మనం అసహ్యించుకొంటాం. మానవులందరూ ఒకరినుంచి ఒకరిని వేరుచేయని సమాజంలో భాగస్వాములు కావాలని మనం కోరుకొంటాం. పరస్పర సహకారంమీద ఆధారపడినదిచే సమాజంలో పైదానికి భిన్నమైన నీతి, స్వేచ్ఛ, వుంటాయని చైనాలో నేర్చుకొన్నాను. ఆ సమాజం మనల్ని 'నేను, నన్ను' అనే అల్ప ప్రపంచం అనే ఖైదునుండి విముక్తం చేస్తుంది. ఆ సమాజంలో ఒకరినొకరు నెట్టుకోనక్కరలేదు, ముసలితనంలో ఎలా జీవించాలనే భయంగాని, తమ జీవితం గడవడానికి డబ్బు ఎలా సంపాదించాలనే ప్రతి రోజు ఆందోళనగానీ లేక ఒకరితో ఒకరు పోటీపడాల్సిన అవసరంగానీ లేకుండావున్నందువల్ల చైనా ప్రజల శక్తి సామర్థ్యాలు, చొరవ, ఎంతగా అభివృద్ధి చెందినవో నేను చూశాను. "స్వేచ్ఛా సమాజం" అనబడే సమాజంలో జీవిస్తున్న మనలను రోజురోజూ వెంటాడుతున్న అనేక ఆదుర్దాలు, ఆందోళనలనుండి వారు స్వేచ్ఛగావున్నారు. వాటిలో వారు వ్యక్తిగతంగా స్వయం రక్షణ చేసుకోవాల్సిన అవసరంలేకుండా, పోటీ పడాల్సిన పరిస్థితిలేకుండా, ఒకరితో ఒకరు మానవులుగా సంబంధాలు కలిగి వుంటున్నారు. అందరూ తమ తమ వ్యక్తిగత వ్యవహారాలకంటే మించిన వున్నతమైన కృషిలో భాగస్వాములవుతున్నారు.

చైనా సందేశం ప్రపంచవ్యాపితమైంది. అది ఒక్క చైనాకు మాత్రమే పనికొస్తుందని కాదు. మనందరి హృదయాల్లో వున్నదాన్నే ఆ సందేశం వినిపిస్తోంది. మనం నిజంగా మానవులుగా వుండగల్గే సమాజం యొక్క అవశ్యకతను ఆ సందేశం వినిపిస్తున్నది.

[ఫెలిక్స్ గ్రీన్ (ఇంగ్లండు) ఈ సంవత్సరారంభంలో 5 నెలలపాటు చైనాలో గడిపి వచ్చిన తర్వాత ఇచ్చిన ఉపన్యాసం.]

ఒక మహత్తర నూతన సామాజిక వ్యవస్థకు దిక్సూచి- 'మార్పు'

ఎనభైకోట్ల చైనా ప్రజల గురించీ; వారు గడచివచ్చిన దారులు, నడచి వెళు తున్న మార్గాలగురించీ తేటగానూ తెల్లంగానూ చిన్నపిల్లలకు సైతం తేలిగ్గా వంటబట్టే టట్టు చిత్రించుతున్న పన్నెండు కథల సంకలనం 'మార్పు'. నిజానికి- శీఘ్రంగా మారి పోతూ వచ్చిన యిటీవలి యాభై ఏళ్ళ చైనా సామాజిక చరిత్రకు, పరిణామగతికీ ఎత్తి పట్టిన అద్దం. చైనా చరిత్రలోకెల్లా మహత్తరమైనదీ, నిర్ణయాత్మకమైనదీ, ప్రపంచా నికే అద్వితీయమూ, అపురూపమైనదీ ఈ కాలపు చైనా చరిత్ర.

"చైనాలో విప్లవానికి ముందు నుండి ఈనాటివరకూ వేర్వేరు కాలాల్లో వ్రాయబ డిన [....దాదాపు నూరు చైనీస్ కథలనుండి ఎన్నికచేసి అనువదించిన] పన్నెండుకథలు ఈ సంపుటిలో ఒక క్రమంలో ఉన్నాయి. ఆ విధంగా వివిధ దశల చైనీస్ కథానికా సాహిత్యం పరిచయం చేయబడుతున్నది. ఆయా దశల్లో చైనా ప్రజా జీవనం, వారి ఉద్యమాలు ఎలా పరిణామం చెందుతూ వచ్చిందీకూడా ఈ కథలు వివరిస్తాయి-" అతి శయోక్తికి తావులేకుండా ప్రచురణకర్తలు ఎంతో ఆచి తూచి చెప్పిన మాటలివి. ఈ కథలు చదివిన ఎవరేనా దీనిని ఒప్పుకుంటారు.

ఇరవైఏడేళ్ళ స్వరాజ్యంలో; ఆకలితో, అనారోగ్యంతో, దుర్భరమైన దోపిడికి తీరని వైఫల్యాలకూ గురిఅవుతూ దీనాతి దీనంగా బతుకులు తెల్లార్చుకుంటున్న కోట్లాది అభాగ్యులు, అన్నార్తులతో నిండిన దేశం మనది. బడుగు తనంలో, పేదరికంలో నిన్నటివరకు మనలనుమించి దోపిడికీ, అణచివేతకూ గురైన ప్రజలు ఆశ్చర్యకరమైన విజయాలను సాధిస్తూ ప్రపంచాన్నే దిగ్భ్రాంతి చెందిస్తున్న 'మహాద్భుతం'- చైనా!... నిన్నటికి భిన్నమైన, పూర్తిగా కొత్తదయిన యీ చైనా, నవచైనాను, దాని ప్రగతినీ, అర్థంచేసుకోడాని కిప్పుడు దేశదేశాల నిపుణులూ, నిష్ణాతులూ, ప్రపంచ నాయకులూ, 'వేళంవెర్రి'గా ఎగబడడాన్ని మనం చూస్తున్నాం. జనచైనా ఘనవిజయాలతో, ప్రపం చం దృష్టిని అంతగా తనవేపు ఆకర్షించుకుంది మరి.

ఇది ఎలా సాధ్యమయింది ?- "ఏ దిశగా వారు పయనిస్తున్నారు?...వీటన్నిటికీ సాహిత్యరూపంలో యీ పన్నెండు కథల్లోనూ రేఖామాత్రంగా సమధానాలు లభిస్తాయి" అన్నారు ప్రచురణకర్తలు.

సమాధానాలు లభించడమేకాదు, ప్రవహించేనదిలాగా, పయనించే 'బిడారు'లాగా ఒక సజీవమైన చరిత్ర చిత్రం, ఓ మహత్తర సామాజిక పరిణామక్రమం, మన కళ్ళ ముందు అలా కదిలి సాగిపోతుందీ కథల్లో. తరచు అతిసామాన్యమైన, అప్రధానమైన

అంశాలే 'వస్తువు'గా నడిచే యీ కథల్లో ప్రతి వ్యక్తి ప్రతి సంఘటన పఠితల మనసుల మీద గాఢమైన ముద్రలు వేసుకు హత్తుకుపోతూవుంటుంది 'స్వాతంత్ర్యం' అనే దాని అసలు స్వరూపమూ, నవజాగృతీ, పునర్నిర్మాణమూ, వాని నిజమైన అర్థమూ మన కిందులో కనిపిస్తాయి. చైనాను దాని గమనంలో చూడ్డానికీ, చైనా ప్రజల కృషికి, సంకల్పబలానికీ కారణమైన అంశాలను అవగాహన చేసుకోటానికీ యీ కథల సంపుటి చక్కని దిక్సూచి. భారతీయులమైన మనకు దీని అవసరం, ప్రయోజనమూ ఎంతైనా వుంది.

నిన్నటిచైనా నేటి భారత దేశ పరిస్థితులను గడచివెళ్ళిన బడుగు దేశమే. అందువల్లనే యీ కథల సంపుటిలో నేడు ఛిన్నాభిన్నమై శిథిలమైపోతున్న గ్రామీణ ఆర్థిక వ్యవస్థ రూపురేఖలు; రైతాంగం గ్రామీణ పనివారు, గురిచేయబడుతున్న దుర్భరమైన దోపిడిని, దారిద్ర్యాన్ని; ధనం 'పిడికిలి'లో విలవిలలాడి నిస్సహాయంగా అంతరించి పోయే మానవవిలువలు, మనకిందులో కళ్ళకు కట్టినట్లు కనిపిస్తాయి. 'పునరపిమరణం–పునరపి జననం'గా మరల మరల కొల్లగొని దోచుకోబడుతున్న కుటుంబాల నుండి, కమ్యూనిస్టుల మాటలు విని 'చెడి'పోతున్న మన కుర్రవాళ్ళను, వాళ్ళ సాగించే తిరుగుబాటును– త్యాగాలను. వాని విజయాన్నీకూడా మనం యీ కథల్లో చూస్తాం. చివరకు యీ త్యాగాలు, పోరాటాల ఫలితంగా ఏర్పడే ఓ నూతన సామాజిక వ్యవస్థ; ఆ వ్యవస్థలో సగర్వంగా తలెత్తిలేచే ఒకానొక నూతన మానవుడూ, 'మార్పు, బాధ్యత' అన్న కథల్లో మనకు సాక్షాత్కరిస్తాడు.

అన్నిటికీ మించి, "గేదెకన్నా పందికన్నాకూడా" దీనంగా, హీనంగా 'కొనబడి–అమ్మబడే' నిస్సహాయురాలయిన స్త్రీ సమున్నతంగా నిలచి, సామాజికోత్పత్తిక్రమంలో తన స్థానం స్వీకరించి; నాయకత్వం వహించగల శ్రామిక మేధావినిగా పరిణతినందే ఒక ఉజ్జ్వల క్రమాన్ని యీ కథలు మనకు చూపుతాయి. స్త్రీ యొక్క యీ రెండు రూపాలనూ మరింత స్పష్టంగా వ్యక్తంచేసేవి 'బానిసత్వం'. 'కళాకారుని కళ' అనే కథలు.

"చైనాలో విప్లవానికిముందు కాలంలోగల ప్రజల దుర్భర దారిద్ర్యాన్నీ, భూస్వాముల దోపిడినీ చిత్రించే రెండు కథలను యీ సంపుటి మొదట్లోను, 'సాంస్కృతిక విప్లవానంతర కాలంలో వ్రాయబడిన' మూడు కథలను చివరలోనూ, చేర్చారు.— మార్క్సిస్టు మూలసూత్రాలను, మౌలిక అవగాహనను, సమాజంలోని అన్నిరంగాలకు– అన్నిఆలోచనలకు, అందరు వ్యక్తులకు, సృజనాత్మకంగానూ, సరిగానూ, దృఢంగానూ అనువర్తింపజేసే ప్రయత్నమే చైనాలో సాగిన సాంస్కృతిక విప్లవం లక్ష్యంగా తోస్తుంది. విస్తృత ప్రాతిపదికపై ఆయాచోట్లన్నింటా పెటీ బూర్జువా అలవాట్లను,

ఆలోచనాక్రమాన్ని, దాని ఆధిక్యతనూ, బద్దలుకొట్టి, ఆ స్థానంలో శ్రామికవర్గ సంకల్ప విశిష్టతను, స్ఫూర్తినీ, మార్క్సిస్టు మౌలిక అవగాహననూ, బలంగానూ, పటిష్టంగానూ, ప్రతిష్ఠించటమే యీ విప్లవంగా చివరి మూడు కథలూ నిరూపిస్తాయి.

ఒకదానికన్న మించి మరొకటి మిన్నగా అనిపించే నూరు మంచి కథల నుండి పన్నెండు మేలితునకలను ఎన్నికచేయటం ఎంత కష్టమో, వాటిని ఒక వరుసక్రమంలో కూర్చటంకూడా అంత కష్టం. ఈ రెండు పనులను అనాయాసంగా సాధించిన సంకలనకర్త, అంతకు మించిన ప్రతిభను అనువాదకృషిలో ప్రదర్శించటంతో యివి 'సహజ' మూలరచనలుగానే మనకు తోస్తాయి. పేర్లు, స్థలాలుమార్చితే అచ్చంగా యివి తెలుగు ప్రజా జీవితంనుండి ఉద్భవించిన తెలుగు రచనలే— మూలంలో రచయితలు సాధించిన వాస్తవికతతోపాటు తెలుగు చేయటంలో అనువాదకుడు నిరూపించుకున్న సృజనాత్మక కౌశలం యిందుకు కారణమయింది. ప్రతి కథకూ మొదట ఆ కథలోని బలమైన సన్నివేశాన్నో, భావాన్నో తెలిపే చక్కని చిత్రాలను చేర్చారు. తెలుగు ముద్రణ పరిశ్రమలో 'రాజలాంఛనమై' కళ్ళకు ముళ్ళలాగా గుచ్చుకు పొడుస్తూండే అచ్చుతప్పులు (ఒకటీ అర మినహా) లేకుండా జాగ్రత్తపడ్డారు. మంచి కాగితం, మంచి ముద్రణతో ఆకర్షణీయంగా వెలువడిన యీ సంకలనానికి అంతకన్నా ఆకర్షణీయమైన ముఖచిత్రమూ జతపడి ప్రతి ఒక్కరినీ 'చదివి తీరాలి' అని ప్రలోభపెట్టేంతలా అమిరాయి.

ప్రారంభించిన కొద్దికాలంలోనే 'జనత ప్రచురణలు' అందించిన మంచి పుస్తకాలలో మరో మంచి ముత్యమిది. అన్నివిధాలా మేలిముత్యమే. ఇదివరకే కొందరికి తెలిసివుండకపోతే యీ కథల సంపుటితో, తెలుగున శ్రీ ప్రసాదరావు ఉత్తమశ్రేణి అనువాదకుడుగా సంకలనకర్తగా స్థిరపడ్డారు. కథల ఎన్నికలో ఆయనవేసిన తూకం, చూపిన అభిరుచీ, హాయిగా, అభినందనీయంగా వున్నాయి

మన కాలపు మంచి కథానికల సంపుటిల్లో; ప్రయోజనకరమైన సృజనాత్మక అనువాద సాహిత్యంలో 'మార్పు' ఒకటి. అనువాదకుని ప్రతిభ దీనిని బాలసాహిత్యమంత సరళంగా చేసింది. ...ఒక్కమాటలో నేటి(జన)చైనాను అర్థం చేసుకోటానికీ, చైనా ప్రజలను తెలుసుకోటానికీ— మనమూ ఓ సంకల్పం ఏర్పరచుకోడానికీ, సంగ్రహంగా 'మార్పు' ఒక్కటి చాలు.

— రవి.

"నా చిరునామా నాకే దక్కకుండా పోయింది"

జ్వాలాముఖి

'ఓటమి తిరుగుబాటు'- నగుబాటు

విప్లవ రచయితల సంఘం ప్రణాళికకు కట్టుబడివుంది. విప్లవ రచనలుచేసి ప్రజల్లో విప్లవ రచయితగా గుర్తింపు పొందినవాళ్లు వున్నారు. సైద్ధాంతిక అవగాహనతో విప్లవకవిత్వం రాయకుండానే విప్లవ కవిగా ఎక్కువ పేరుతెచ్చుకున్నవాడు జ్వాలాముఖి. విరసం సభ్యత్వం. దిగంబరకవితా వుద్యమం వుపన్యాస నైపుణ్యం నలుగురులోనూ జ్వాలాముఖి ప్రాచుర్యం పొందటానికి ప్రధాన కారణాలు. మొదట్లో సాధారణ పీడిత జనపక్షపాతంతోనూ, జీవిత అనుభవంలోవున్న అశాంతి, నిరుద్యోగం, దారిద్ర్యం, సంక్షోభం కారణంగా చాలామంది యువకులు విరసంలో చేరారు. పోరాట వీరుల త్యాగదీపాలుకూడా యువరచయితల్ని విరసంలోకి ఆకర్షించాయి. సాధారణంగా యువకుల్లో కనిపించే నిస్వార్థం, సాహసప్రవృత్తి ఆదర్శోత్సాహంకూడా యువరచయితల్ని విప్లవోద్యమంలోకి తెచ్చాయి. అయితే క్రమంగా సమిష్టి చర్చలవల్ల, పోరాటాల ప్రభావంవల్ల, రచనాచరణవల్ల, విరసం సభ్యులు ఈ నాలుగుసంవత్సరాల్లో విప్లవ సిద్ధాంత అవగాహన బాగా పెంచుకున్నారు. మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనా విధానం, ప్రస్తుత భారత ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక విషయాలమీద అవసరమయినంత మేరలో విరసం సభ్యులకు ఈనాడు పరిజ్ఞానం వుంది. ఈనాటి చారిత్రక దశకు మార్క్సిజం-లెనినిజాన్ని సృజనాత్మకంగా అన్వయించటంలో జరుగుతున్న ప్రయోగాలమీద విప్లవరచయితలకు స్పష్టమైన అవగాహనవుంది. ఈ పరిణామం ఖమ్మం సభలనుంచీ కర్నూలు మహాసభలదాకా వేదిక లోపలా వెలుపలా జరిగిన చర్చలను పరిశీలిస్తే తెలుస్తుంది. విప్లవ రచయితల రచన లోతుగా అధ్యయనంచేసినా అవగాహనా పరిణామాన్ని గ్రహించవచ్చును.

జ్వాలాముఖి సిద్ధాంత పరిజ్ఞానంలో మౌలికమైన పరిణామం కానీ స్పష్టత కానీ రాలేదు. క్రమంగా అధ్యయనాన్ని పెంచుకోవలసిందిపోయి అయోమయ గుండంలో పడిపోయాడు. విరసం ఆరంభమయినప్పుడు పత్రికల్లో జ్వాలాముఖి రాసిన వ్యాసాల్లో, కవితల్లోవున్న సిద్ధాంతస్థాయే ఇటీవల విరసం మూడవ సంచికలోనూ, 'ప్రజాసమస్యలు' లో సీరియల్ వ్యాసాల్లోనూ కనిపిస్తుంది. అభివృద్ధి కనబడదు సరికదా విప్లవసాహిత్య శ్రేణుల్లో భావ గందరగోళాన్ని, భావ అనైక్యతను సృష్టించటం మాత్రం జరిగింది.

జ్వాలాముఖి చేసిన ఈ ప్రయత్నాన్ని విరసం సభ్యులు, విప్లవాభిమానులు తిప్పికొట్టారు. సిద్ధాంత విషయంలో యిలా వుంటే కవితావస్తు శిల్పవిషయాల్లోకూడా జ్వాలాముఖి మారింది ఏమీలేదు. ప్రేమ కవిత్వం, అభ్యుదయ కవిత్వం, అభ్యుదయ కాల్పనిక కవిత్వం, నిరసన కవిత్వంరాస్తూ దిక్కుతోచక కొట్టుకుంటున్న అనేక మంది రచయితలు విరసంలోకి ప్రవేశించారు. చిత్తశుద్ధితో, నిరంతర శ్రమతో తమ తమ పూర్వాశ్రమాలనుంచీ బయటపడి ప్రక్రియలో, భాషలో, భావ ప్రతిమల్లో, అనుభూతుల్లో విప్లవీకరింపబడి విప్లవ రచయితలుగా మేల్కొన్నారు. ఈ నాలుగు సంవత్సరాల విప్లవ కవిత్వాన్ని పరిశీలిస్తే రచనా శిల్పంలో విరసం సాధించిన పరిణామం కనిపిస్తుంది. జ్వాలాముఖి కవితా శిల్పపరంగాకూడా పరిణామాన్ని సాధించలేదు. కఠినమైన, కేవలం పండితులకుమాత్రమే అర్థమయ్యే సమాసాలు, అసహజమైన పదబంధాలు, వాక్య పరిచ్ఛేద దోషాలు, భావక్షుద్రీకరణం (Vulgarisation of ideas) మత పదజాలం తన కవిత్వం తనకే అర్థంకాని శోచనీయస్థితి ఆరంభంనుంచీ యిప్పటికీ జ్వాలాముఖి కవిత్వ లక్షణాలు. ఇటు సిద్ధాంత పరిజ్ఞానంలోకానీ, అటు భావజాల నిబద్ధత (idealogical Commitment) లో కానీ, కవిత్వ రచనా పద్ధతిలోకానీ మౌలికమైన మార్పు జ్వాలాముఖి సాధించలేదు

ప్రజలపక్షం వహించిన కవికి వినయం, ఋజుత్వం, సమిష్టి ఆలోచన, విమర్శ, సహనం, ఆత్మవిమర్శలాటి సామాన్య గుణాలయినా వుంటాయి. ఆలోచనలో, అభివ్యక్తిలో కనీస ఫ్యూడల్ వలయాలనుంచి అయినా విముక్తి పొందుతాడు. జ్వాలాముఖి వేళ్లు యింకా ఫ్యూడల్‌చట్రంలోనే పాతుకొని వున్నాయి. అహంకారం, స్వార్థస్పృహ వ్యక్తిగత ఆడంబరధోరణి, పరదూషణ, లోపాలను దాచుకోవాలనే ప్రయత్నం. పాఠకుల, విమర్శకుల దృష్టిని తన తప్పుడు సూత్రీకరణలవైపు మళ్ళించాలనే డాంబికమైన ప్రయత్నం— ఇవి 'ఓటమి తిరుగుబాటు' కవితల్లోనూ, ఆత్మవిమర్శ పేరుతో తానే రాసుకున్న వుపోద్ఘాత వ్యాసంలోనూ కనిపిస్తాయి కవి అనేవాడికి కవితా ఋజుత్వం వుండటం ప్రాథమిక లక్షణం. అందులోనూ ప్రజా వుద్యమాల్లో వుండే కవులకు చిత్తశుద్ధి, సంస్కారం లేకపోతే ఆ వుద్యమం పరువుపోతుంది. ప్రజల్లో దాని ప్రతిష్ఠదెబ్బతింటుంది. ఉద్యమానికి మంచి చేయలేకపోయినా చెడు చేయకుండావుంటే అంతేచాలు. గతశతాబ్ది మధ్యభాగంలో తెలుగు కవిత్వానికి సేవచేసిన సి. పి. బ్రౌన్ తాళపత్ర గ్రంథాలంటే మహా యిష్టపడేవాడు. పండితులంటే చాలా అభిమానించేవాడు. ప్రాచీన సాహిత్యాన్ని సంస్కరించి ముద్రించి వెలుగులోకి తీసుకురావటానికి కృషి చేశాడు. కొంత మంది దొంగ పండితులు తామే తాళపత్రాలమీద పద్యాలు రాసి ప్రాచీన కవిది లభ్యమయినట్టు

బ్రౌన్‌ను మధ్యపెట్టేవారు. ఆయన పరిహారంగా డబ్బు యిచ్చేవాడు. జ్వాలాముఖిపై పండితులకంటే చేయరానిపని చేశాడు.

'ఓటమి తిరుగుబాటు'లో వున్న సర్వమానవ కళ్యాణం, సూర్యస్నానం, కిలికించితం, పునర్ యోనీ ప్రవేశం, శస్త్రచికిత్స, ఓటమి తిరుగుబాటు అనే ప్రధానమైన రచనలు దిగంబరకవిగా దిగంబర సంపుటాల్లో రాసినవి ఎర్రఅట్ట సంకలనంలో చేర్చాడు. మొదట సంపుటాల్లో వచ్చాయి. తర్వాత శేషాచలం వాళ్లు వేశారు. అయినా తనివి తీరక వాటినే విప్లవ కవిత్వ రూపంలో, విరసం కార్యవర్గ సభ్యుడుగా, విరసంమూడో మహాసభల సందర్భంలో ప్రచురించి ఆవిష్కరించాడు. 'విప్లవ రచయితల సంఘం' పేరుతో ఒక ప్రజా విప్లవ సాంస్కృతిక ఉద్యమాన్ని నడుపుతున్న రచయితలు తాము చిన్నప్పుడురాసిన విప్లవ ప్రతీఘాతుక రచనలు ఇప్పుడు ప్రింటుచేసుకోవటం ఎందుకు? ఇంతకంటే సందర్భశుద్ధిలేని పని మరొకటి వుండదు. రాసినవన్నీ వేసుకోవాలంటే షష్టిపూర్తి సందర్భంలో వేసుకోవచ్చు. రాసిన పది పన్నెండుగేయాల్నే మూడురకాల అట్టబొమ్మలతో తెచ్చుకొని వ్యాపారం చేయాలనుకోవటం బుద్ధితక్కువ పని. అందులోనూ జ్వాలాముఖి దిగంబరకవినుంచీ విప్లవకవిని అయ్యాను అనుకుంటూ, దిగంబర కవిగాకూడా వామపక్ష పక్షపాతంవున్న వ్యక్తిగా గుర్తింపబడుతూ, ఆ దిగంబరరచనలే ఇంకా కొన్ని బాల్య రచనలుకలిపి సంకలనంగా తేవటం చాలా లేకిపని. ఇంతవరకైనా క్షమించవచ్చు. దిగంబర గేయాల్ని మధ్య మధ్యలో మార్చి ఆ స్థానాల్లో విప్లవ పద జాలాన్ని ఇరికించి విప్లవ కవిత్వపు పూత పూయటం సాహిత్య మూర్ఖత్వం, సాంస్కృతికనేరం, ఈ రకపు దొంగ కవులు విరసంలాటి సంస్థలను నవ్వులపాలు చేస్తారు. ఆ మార్పులయినా సరిగా వున్నాయా? అంతా అర్థరహితమై చారిత్రక విషయాలను తలక్రిందుచేసేటట్టుగా వున్నాయి. రచన అంతా దిగంబర ధోరణిలో అరాచక నిరసన వుంటుంది. మధ్యలో జ్వాలాముఖి చేర్చుకున్న సాయుధ పోరాటం, విప్లవ విముక్తి పోరాటాలు, పాలకవర్గం, వర్గ సమాజంలాటి మాటలు దిగంబర వుద్యమ చరిత్రమీద మసిపూసి విప్లవ సాహిత్యంమీద వెన్నుపోటు పొడిచాయి. జ్వాలాముఖి కవిత్వాన్ని దిగంబరపూర్వదశ, దిగంబర దశ, దిగంబర కవితల్లో విప్లవ పదజాలం చేర్చిన దశ, విప్లవ కవిత్వ దశలను వరసగా పరిశీలించవలసివుంది, ఆ తర్వాత "వైరుధ్యాలమధ్య నేను-నా కవితావేశం" పేరుతో చేసుకున్న 'ఆత్మవిమర్శ'లాటి వ్యాసాన్ని విశ్లేషించాలి.

2

చిన్నప్పటినుంచీ కొంతలోకొంత సాంఘిక స్పృహవుండి వర్తమాన కవితా వుద్యమాల ప్రభావంవుండి, క్రమంగా ఆ సాంఘిక స్పృహ శాస్త్రీయ సాంఘిక చైత

న్యంగా పరిణతి చెందినప్పుడు, వర్తమాన వుద్యమాల స్వభావం గ్రహించి లోపాలను పరిశీలించి నూతన వుద్యమంలో అడుగుపెట్టినప్పుడు తన పాత రచనలను ప్రచురిస్తే పరిణామాన్ని పాఠకులు గ్రహించగలరు. ఆదినుంచీ ఫలానా కవిలో సామాజికతవుం దని అన్వేషణలో శాస్త్రీయ సామాజిక స్థాయికి, చారిత్రక వాస్తవానికి చేరుకున్నాడని విశ్లేషించవచ్చును, ఇప్పుడు సిగ్గుపడవలసిన రచనలుకూడా చిన్నప్పుడు కొన్ని చేస్తాం. మన పరిసరాలు, మన మానవ సంబంధాలు, శృతపాండిత్యం, ఇవన్నీ కలిసి తెలిసో తెలీకో రచనలుచేసినా అవి విప్లవ ప్రతీఘాతుక రచనలని మనకే తెలిసినప్పుడు disown చేసుకుంటాం. రాసిన ప్రతి చెత్తా ప్రింటుచేసుకోవాలనుకునే వాడు కీర్తి దురదగలవాడు.

జ్వాలాముఖి 'మనిషి' అనే సుదీర్ఘ గేయం విప్లవ ప్రతీఘాతుకమైన రచన- కవితాస్పర్శకూడా లేదు. ఫ్యూడల్ సమాజపు భ్రమలను ఒక అపరిపక్వ మనఃస్థితిలో రాసిన భంగుసన్యాసి గేయం! ఆ ఫ్యూడల్ భావజాలం అయినా సరిగా అర్థమయిందా అంటే అదీలేదు. అపరిణీతమైన మిడిమిడిజ్ఞానంతోకూడిన, ఆధ్యాత్మిక మూఢభావాల రాశి మనిషి. కవితగా ఒక భావధారలేకుండా పరస్పర విరుద్ధమైన, పిరికితనంతో కూడిన ఫ్యూడల్ రచన ఇది.

"మాయాలోకపు మర్మం తెలుసుకో" (మనిషి)

ఫ్యూడల్ దోపిడీవ్యవస్థను గూర్చిన సామాజిక పరిజ్ఞానాన్ని ప్రజలలో అరికట్ట టానికి, శాశ్వతంగా ప్రజల్ని ఫ్యూడల్‌వర్గ రథచక్రాలకింద నలిపివేయటానికి, ప్రజలను తాత్వికంగా ఉరితీయటానికి ఫ్యూడల్ తత్వవేత్తలు సృష్టించింది మాయావాదం. దీని మీద జ్వాలాముఖికి సాంప్రదాయికమైన మమతవుంది. ఈ గేయం అంతా ఈ వాదమే పునాదిగా రాయబడింది.

"పరమాత్మను నీ హృదికి దించు"
"మెతుకు కోసం బ్రతుకునంతా
చితుకగొట్టి శిధిల పరచకు"
"ఊరకే ఉదర పోషణార్థం
అశుద్ధం మేయుచు
ఊరూరా తిరిగే
స్వార్థం నిండిన
ఊరపందివి మాత్రం కాకు"

(బతుకు తెరువు కోసం జ్వాలాముఖి కొన్నాళ్లు వూరువిడిచి బెంగుళూరువెళ్లాడు. (చూ. పే VI) అక్కడ ఏం మేసాడో తెలీదు)

"ఐహికాముష్మికములు
త్యజింతురు త్యాగరాజుల
త్యాగరాజువుకా"

"జితేంద్రియుడవై
దేవత్వాన్ని నీలోన సృష్టించుకో"

"పవిత్ర మత సిద్ధాంతాలను
పాడు పొట్టకై కళంకితం చేయకు"

"మహోన్నత మతాశయకర్తల
మొఖాలకు మసిని మాత్రం పూయకు"

ఇవి జ్వాలాముఖి 'మనిషీ' గేయంలోని "శ్రీసూక్తులు" ఇంతకంటే అసహ్యకరమైన 'నగ్న భంగు వేదాంతం' రాయగలసత్తా ఏ ఫ్యూడల్ కవితకయినా వుందా? R.S.S. కవి ముదిగొండ శివప్రసాద్ కంటే "ధర్మజడుడు" జ్వాలాముఖి. ఈగేయంలో కనిపించే జ్వాలాముఖి 'మహంతు మఠాధిపతి'లా వున్నాడు. ఈ రచనలో ప్రజా వ్యతిరేక భావాల్ని ఎవరైనా పసిగడతారని, అడ్డుగోడగా 'కరుణశ్రీ' యోగ్యతాపత్రాన్ని భారతీయ సాహిత్య పరిషత్తు బహుమతి వుదంతాన్ని జ్వాలాముఖి పీఠికలో వుటంకించుకున్నాడు. "విలాపకవి" కరుణశ్రీని జ్వాలాముఖి విమర్శకునిగా నిలబెడుతున్నాడు– ఇదంతా ఆత్మరక్షణావల. ఈ 'మనిషీ'కవితమీద జ్వాలాముఖికి విడదీయరాని మమత వుంది. ఫ్యూడల్ భావాలమీద మమకారం ఫ్యూడల్ వ్యవస్థమీద మమకారానికి శక్తివంతమైన నిదర్శనం. ఇంత ఫ్యూడల్ బురదను మొఖానరాసుకొని జ్వాలాముఖి "మతములన్నియు మాసిపోవును, జ్ఞానమొక్కటె నిలిచి వెలుగును"– "మంచిగతమున కొంచెమేనోయి"– "నాది ప్రజా వుద్యమం, దాన్ని ఎవరి కోసం వదులుకోను" అని చెప్పిన యుగకర్త గురజాడ అప్పారావును ఫ్యూడల్ కవి అని, నవీన చాదస్తుడని ప్రచారం చేస్తున్నాడు– అవును మరి, జ్వాలాముఖిది సనాతన చాదస్తంకదా! అన్నిగేయాలమీద ఆత్మవిమర్శ పేరుతో స్వీయాభిప్రాయాలను రాసుకున్నాడు. తన రచనలమీద యీ అభిప్రాయాలు వుండేవాడు అసలు ప్రచురించటానికి సాహసించడు. కాని జ్వాలాముఖి వంచనా శిల్పం అదికాదు తన రాతలన్నీ విరసం మహాసభల వేదికమీద విడుదల కావాలి. విప్లవ ప్రతీఘాతుక అభిప్రాయాలు విప్లవ సాహిత్య ముసుగులో బయటకు పోవాలి. ఆత్మవిమర్శ చేసుకున్నట్టే చేసుకుంటూ మధ్యలో 'ఆత్మస్తోత్రం' చాలా చతురంగా చేస్తాడు. "మనిషీ రచనలో దేవుని భావనను అలాగేవుంచి తప్పుడు దేవుణ్ణి 'అతీతశక్తిని' కూలదోసి ఆ చోటనే 'మంచిమానవుణ్ణి' కూర్చోబెట్ట ప్రయత్నించాను."

(III) అని రాసుకున్నాడు. ఇదొక కుహనాకల్పన. 'మనిషి' గేయంలో ప్రతి అంగుళంలోనూ అతీతశక్తిని అంగీకరించాడు.

"పరంలేదా తెలీదు మనకు
ఐనా ఇహ సౌఖ్యమే పరమావధి అనకు"
"విరాట్ స్వరూపాన్ని చూపించు"
"నిటలాక్షుని తెరిపించు"
"మృత్యుంజయవీరుని మోసే"

ఇలా అన్ని సందర్భాల్లోనూ అతీతశక్తిని ఆహ్వానించాడు. "ఆదర్శ జీవితం" "మహోన్నత మానవతా వాదం" ఈ రచనలో వున్నాయట. మానవత్వాన్ని అవమానించే ఈ మతోన్మాద తుచ్ఛ రచనలో లేని గుణాలున్నవని చెప్పటం సాహిత్య వంచన. కవితకు కావలసిన భావనాశక్తి యీ రచనలో అబ్బిందట. జీవితాన్ని దృశ్యరూపంలో శక్తివంతంగా చెప్పటం భావనాశక్తి. ఇలాంటి శక్తి యీ గేయంలో కాగడాపెట్టి వెతికినా దొరకదు. ఇంతటితో ఆత్మ ప్రశంస ఆగలేదు. ఈ గేయం "ముగింపులో భౌతికవాద దృక్పథాన్ని చూడమంటున్నాను" (P / V) ఈ 'మనిషి' గేయంలో ముగింపు వాక్యాలు యివి—

"దేవుడన్న వెతుకులాట
జీవుడులోని వెలుగు వెతుకులాట
మానవుడగుటకది మొదటిబాట
దేవుడు దానిపై మొలిచి పూచిన విముక్తి పూదోట"

ఈ వాక్యాల్లో భౌతికవాదం వున్నదట— తెలిసీ తెలియని విశిష్టాద్వైతం చెపుతూ 'భౌతికవాద దృక్పథం' అనటంకంటే దారుణమైన అజ్ఞానం ఎక్కడవుంది. ప్రమాదం కానివిధంగా 'ఆత్మవిమర్శ' చేసుకుంటూనే మధ్యలో ఆత్మస్తోత్రం చేసుకోవటం, పాత కుళ్ళి తప్పుదోవల్లోకి మళ్ళించటం జ్వాలాముఖి శిల్పం "ఇది ఆధునికమైన అంత్య ప్రాసల గేయ ప్రక్రియ" అట. ఆధునిక కవిత్వం గురించి తెలిసినవాడు అనేమాటేనా ఇది? 'అంత్యప్రాస' అంటే ఏమిటి? ప్రపంచవ్యాప్తంగా బూర్జువా విప్లవం ఫ్యూడల్ వ్యవస్థమీద చావుదెబ్బ కొట్టింది. దీని ఫలితంగా ఫ్యూడల్ కర్మ, ఆత్మసిద్ధాంతాలు మూఢ విశ్వాసాలు బూర్జువా విజ్ఞాన కాంతి ముందు వెలవెల పోయాయి బూర్జువాలు క్రమంగా గుత్తపెట్టుబడిదారులై, ప్రగతి అంశను కోల్పోయి తాము సాధించినవిజయాలను తామే నాశనం చేస్తారు. అప్పుడు మళ్ళీ కొనవూపిరితోవున్న ఫ్యూడల్ విశ్వాసాలు మానవతావాద రంగుపూసుకొని నగ్నతాండవం చేస్తాయి. ఈ స్థితికి అస్తవ్యస్తంగా ప్రాతినిధ్యం వహించే రచన జ్వాలాముఖి 'మనిషి'

ఈ ఫ్యూడల్ పునాది జ్వాలాముఖి కవిత్వం అంతా ఆవరించి వున్నది. విప్లవ భావాల్నికూడా ఫ్యూడల్ మధ్యయుగాల మత పరిభాషలో చెప్పటం జ్వాలాముఖికి అలవాటు భాష అనేది మానవచైతన్యంలో బలమైన అంతర్భాగం. సంఘంలో ఏ వర్గంతో మన active సంబంధాలు, Emotional సంబంధాలు వుంటాయో ఆ వర్గభాషే మనకు సహజంగా వస్తుంది. పరిసరసంబంధాలు, అధ్యయనం ఈ రెండింటివల్లమనకు మానవ సంబంధాలు, భాష వీటినుంచీ చైతన్యం ఏర్పడతాయి. జ్వాలాముఖికివున్న కుటుంబవృత్తి సంబంధాలు మధ్యయుగ సంస్కృతి ఓటమి తిరుగుబాటు రచనల్లో స్పష్టంగా కనిపిస్తుంది. 'అంకితం, దీపావళి ఎందుకు? నేటి మానవుడు, నిశ్శేషుడు' లాటి దిగంబర పూర్వ రచనల్లోకూడా ఆధునిక భావదారిద్ర్యం, ఫ్యూడల్ ఆధ్యాత్మిక మూఢవాద భావవాదచట్రంలోనే కొట్టుకుపోవటం కనిపిస్తుంది. "అరిషడ్వర్గాలు విశ్వాసఘాతుకములు"(అంకితం) కామం, క్రోధం, లోభం, మోహం, మాత్సర్యం ఆరు శతృగుణాలని మనిషి వీటిని జయించాలని ఆధ్యాత్మిక మూఢ వాదం ఋషివేషధారులు చెప్పి పోయారు. ఇవన్నీ పనికిమాలినవని జనం నమ్మితే రాజులు రాణులు, మంత్రులు ఋషులు గుండెలమీద చేయివేసుకొని నిద్రపోవచ్చు. ఇంతకీ వీటిని ఋషులే జయించలేదు. ఈ రకం గంజాయివాదం జ్వాలాముఖి కవితలన్నిటిలోనూ పరమ వికృతంగా ప్రత్యక్షం అవుతుంది.

"ముక్తి దాహాన్ని ఆసక్తితో కోరుతున్న మనిషి"(అంకితం)కి "గంగానది సలిలం"గా జ్వాలాముఖి తన కవిత్వాన్ని అర్పిస్తున్నాడు. ఇదే జ్వాలాముఖికోరే'జాగృతి' ఈ అర్థరహితమైన వేదాంతమే మనిషి "ఒంటరివాడు"గా "తోవ తప్పినవాడు"గా జ్వాలాముఖి వూహించటానికి కారణం.

"ఉరగంలా వచ్చిన యువత
నిర్దాక్షిణ్యంగా వేసిన కాటు" (నిశ్శేషుడు)
"వాంఛ వేసిన శిక్షకు
భర్తనై బాధపడ్డాను" (నిశ్శేషుడు)
"కృత్రిమ బంధనాల కుడ్యాలపై
వికృతరూపాల మమకారాలు" (నిశ్శేషుడు)

అంటూ అసలు మాయావాదాన్ని చెపుతూ దీన్ని 'మానవతా వాదంగా' చిత్రించుకున్నాడు. వర్గాలు తెలీవు- వర్గసంబంధాలు తెలీవు. మధ్యతరగతివాళ్లు 'ఇడియట్స్' అట- 'స్టుపిడ్స్' అట. ఆధునికశాస్త్ర విజ్ఞానంలో. ప్రజావిప్లవ పోరాటాల్లో మధ్యతరగతివాళ్లు నిర్వహించిన పాత్ర అంతా జ్వాలాముఖి దృష్టిలో "సాంప్రదాయాల ఛాదస్తం

కళ్లాపి" అయిపోయింది. నిజానికి 'ఇడియట్' గేయంలో చిత్రించబడిన మధ్యతరగతి వాడు తనే. ఇందులోనూ తనకు మమకారంవున్న ఫ్యూడల్ భావజాలం "చవట చందనం"గా కనిపిస్తునే వుంది.

"ఈ పితాల వ్రణం" "విధివిలాస శాపం" గుళ్లో విరిగిన గంటవి"

"నీ దహన సంస్కారం
అతి నిరాడంబరంగా జరుగుతుంది" (ఇడియట్)

(ఇది ప్రత్యేకంగా జ్వాలాముఖికి బాధకరంగదా)

ఈ గేయంలో మధ్యలో

"విప్లవం - తిరుగుబాటు
సాహసం - సాయుధపోరాటం"

చేర్చేశాడు- ఇది 1966 లో రాసింది. నక్సల్‌బరీకన్నా ముందే జ్వాలాముఖి 'సాయుధపోరాటాన్ని' గూర్చి వూహించి చెప్పగలిగారు- "కవిక్రాంతిదర్శి" గదా; పరిశీలకుల్ని తప్పుదోవల్లోకి మళ్లించటానికి జ్వాలాముఖి పన్నిన వంచనావల ఇది. నానా బండబూతులు తిడుతూ, అశాస్త్రీయమైన అవగాహనతో ఈ గేయంలో మధ్యతరగతి వాళ్లను de-class కమ్మని అభ్యర్థిస్తున్నాడట. ఇలా దిగంబర అవతారం ఎత్తక ముందు జ్వాలాముఖి కవిత్వం అంతా మధ్యయుగాల భావాలతో నిండినదే. ఇంతవరకు కవితా శిల్పం ప్రాథమిక దశగా కూడా అలవడలేదు.

దిగంబరకవిత్వం సంచలనవాద కవిత్వం. సాహిత్యం స్తబ్దంగా యథాతథవాద కూపంలో పడివున్న దశలో కొన్ని అసంప్రదాయిక మార్గాలతో దిగంబర కవులు ఆధునిక సాహిత్యరంగంలోకి ప్రవేశించారు. ప్రపంచవ్యాప్తంగా యువతరం అశాంతిని, అసంతృప్తిని ప్రదర్శిస్తున్న సమయంలో తెలుగునాట దిగంబరకవులు అతృప్త యువ జీవనాడిని వ్యక్తంచేశారు. అన్ని సామాజిక విలువల్ని నిలబెట్టి ప్రశ్నించి నిరసన తెలియజేసారు. ఈ నిరసనను దిగంబర కవులు సమిష్టిగా చేసినా ఎవరి విధానం వాళ్లదిగా వుంది. నిఖిలేశ్వర్ పాశ్చాత్యవాసనలు, చెరబండరాజులో సామాజికవేదన, నగ్నముని, మహాస్వప్నల్లో సర్వతీవ్ర నిరసన భైరవయ్య, జ్వాలాముఖుల్లో సాంప్రదాయిక వలయంలోనే నిరసన తాండవం చేయటం కనిపిస్తుంది. జ్వాలాముఖి దిగంబర కవిత్వం దీర్ఘ సమాసాల్తోనూ, కృతకపదబంధాలతోనూ, కవితాశక్తిలేని వాక్యాలతోనూ నిండివుంటుంది. జ్వాలాముఖి దిగంబర కవితలోని మొదటిది 'సర్వమానవ కళ్యాణం'. ఇందులోనూ ఫ్యూడల్ మతవలయాన్ని దాటలేదు.

"ధర్మ దేవత
చర్మం వొలిచీ"

ఎవరా ధర్మదేవత ? ధర్మం అంటే ఏమిటి ?

"మనమంతా జగన్నాటక సూత్రధారులం
మనమంతా బృహన్నాటక సూత్రధారులం"

"అవయవాల యంత్రాలం"

ఇవి మన 'వెర్రి వేదాంతం పైత్యం' పట్టిన పండితుల మాటలే కదా !

"స్వార్థపరత్వపు వేశ్యారతిలో" స్వార్థానికి వేశ్యారతికి పోలిక ఏమిటి ?

"సంకుచిత తత్వాన్ని మనమంతా
సాంప్రదాయ బద్ధం చేసేసుకున్నాం
కాబట్టీ మనకింకా అర్థంకానిది
సర్వమానవ కళ్యాణం..."

సర్వమానవ కళ్యాణమనేది బూర్జువా నినాదం. స్వేచ్ఛావ్యాపారానికి ఇది ఆదర్శీకరణం. సాంప్రదాయంఅంతా సంకుచితతత్వమే. సర్వమానవకళ్యాణం లేకపోవటానికి కారణం సంకుచితత్వం కాదు. ప్రపంచంలో పెట్టుబడిదారీ సమాజాలు సోషలిస్టు సమాజాలు వున్నంతవరకు సర్వమానవకళ్యాణం వుండదు. ప్రపంచం అంతటా సోషలిజం వచ్చినప్పుడే అది సాధ్యం. (ఇంతకీ మనం అంతా జగన్నాటకసూత్రధారులం అయిన తర్వాత ఇక సర్వమానవకళ్యాణం ఏమిసాధిస్తాం) అభ్యుదయానికి పోవాలంటే జ్వాలాముఖి చూపించే పరిష్కారమార్గం ఏమిటి ?

"అవయవాల యంత్రాలే
అరిషడ్వర్గాలకు ఆలవాలం
అందుకే మనమేనాటికి
అభ్యుదయానికి పోజాలం"

అభ్యుదయం సాధించాలంటే మనం "జితేంద్రియులం" కావాలి. ఇలాంటి రచన చేసి దీనిమీద తన అభిప్రాయాన్ని ఇలా చెప్పుకున్నాడు. "మొదటినుండీ నన్ను పరిపాలిస్తున్న మతవ్యతిరేక మానవతావాదం సంస్కరణదశను దాటి ఒక అసమ్మతిని ఒక నిరసనను తెలియజేసే ఎదురుతిరిగే దృక్పథాన్ని అలవరచుకుంది. నిర్ణయాత్మకమైన మార్గానికి అన్వేషణ ఆరంభమయింది." VI

ఇది పూర్తిగా అబద్ధం. మొదటినుంచీ జ్వాలాముఖిని పరిపాలిస్తున్నది మతమే. మానవతావాద, సంస్కరణవాద దశలు జ్వాలాముఖిలో లేవు. నిర్ణయాత్మకమైన మార్గం అంటూ ఇప్పటికీ తేలలేదు. ఎప్పుడు అన్నిదశలలోనూ గందరగోళమే. సర్వమానవ కళ్యాణం రచనమీద తానురాసుకున్న అభిప్రాయం కావాలని చేసిగుణాన్ని ఆరోపించుకునే వంచన.

దిగంబరగేయాల్లో నిరసనకూడా జ్వాలాముఖి ఫ్యూడల్ చట్రంలోనే చేస్తాడు. నగ్నముని, పెటీబూర్జువాగా నిరసన ఆయుధాన్ని ప్రయోగిస్తే జ్వాలాముఖి ఫ్యూడల్ పండితుడులా నిరసనను ప్రయోగించాడు. సాధారణంగా ఫ్యూడల్ మేధావులు వ్యతిరేకించే నాగరికత, శాస్త్రవిజ్ఞానం, బూర్జువా ప్రజాస్వామ్యాలను జ్వాలాముఖి బలంగా నిరసిస్తాడు.

"మతమీమాంసలో కోరలు పెంచిన మలావిష్టుల్ని చెవినిపట్టి చెంపకొట్టి"అంటూనే"దేవతలు భూలోకం సరిహద్దులుదాటి...వలస వస్తున్నారని...సానుభూతితో.... వసతి సౌకర్యాలు" చేయిస్తున్నారట. "దిగంబర దేవుడ"కు స్వర్గంలో దేవతలు 'సన్మానం'చేశారట. జ్వాలాముఖి 'న్యూడిస్టు-కాలనీ'కి పోయినా తనతోబాటు తన 'దేవతల్ని' 'జీవుని శైశవ కళేబరాన్ని' 'మహా కల్ప వృక్షాన్ని' 'జనన మరణాలులేని, వ్యాధీ వార్ధక్యాలురాకుండా' తన'ఆత్మ, స్వర్గవాదాల్ని తీసుకెళ్ళవలసిందే. మొత్తంమీద బూర్జువా వ్యవస్థను జ్వాలాముఖి ఫ్యూడల్ Stand తో విమర్శిస్తాడు. ఖండిస్తాడు. తన 'దిగంబర దేవుడు' యమలోకంలోకికూడా వెళ్లాడు. అక్కడ జ్వాలాముఖి అతి జాగ్రత్తగా తనకోసం "నరకాన్ని రద్దుచేసే ఆర్డినెన్స్" జారీచేయించుకున్నాడు. మౌలికమైన తిరుగుబాటు ధోరణి యీ రచనలో వుందట. ఇది ఫ్యూడల్ మనస్తత్వవలయంలో లేచిన ఒక వికార అరాచక చిత్రం. పైకి దిగంబరపూత- లోపల 'కుండలాల' చప్పుడు.

'కిలికించితం' పేరే ప్రబంధయుగంపైపు దృష్టిని మళ్లిస్తున్నది. రాజులకాలంలో కవులకు రాజుల, రాణుల శృంగారమే వస్తువయింది ఆ వర్గ ప్రయోజనాలను సాంస్కృతిక రంగంలో శాశ్వితం చేయటానికి అలంకార శాస్త్రాలపేరుతో ఆనాటి సాహిత్య విమర్శకులు శాశ్వితసూత్రీకరణలు చేశారు. శృంగారాన్ని వర్ణించటంలోకూడా ఫ్యూడల్ వర్గ చట్రంలో బిగించారు. శృంగార నాయికలు మొదలు శృంగారావస్థలవరకు నా నా విధదశల్ని, భావాల్ని విశ్లేషించారు. 'వీటిల్లో ఈ కిలికించితం' ఒకటి. జ్వాలాముఖికి ఈ కొవ్వు శృంగారచేష్ట ఆకర్షణీయంగా కనిపించింది. దీన్తో 'కిలికించితం'అనే రచన చేశాడు. ఈ స్త్రీ శరీరచేష్టావిశేషాన్ని దేశపరిస్థితులకు జోడించాలనే ఆలోచనే అజ్ఞానం సంభోగపూర్వదశను "స్వరాజ్యం, స్వాతంత్ర్యం(?)పేరుతో జరిగిన కుట్రగా చిత్రించటం సాధ్యమయ్యే పనికాదు. (ఇందులో) రోషము, అశ్రు హర్ష, భీతి మొదలయినవి ఒకేస్థితిలో స్త్రీకి అనుభవంలోకి రావటాన్ని కిలికించితం అంటారు. వీటి వెనుక మోహసాంద్రత పునాదిగా వుంటుంది- ప్రేయసికి ప్రియునిపరంగా వచ్చే ఈ కామోద్రేకఅవస్థను దేశపరంగా అన్వయించలేక నానా గందరగోళంలో చిందులాడి చివరకు కిలించితానుభూతినిపొందిన యువతిని పతిత. భ్రష్టహీన, దీననుచేసిపారేశాడు. పాండిత్యం లేకపోవటం నేరం కాదు. కానీ వున్నట్టు నటించటం పరమమోసం. ఇలాంటివిశృత పాండిత్యంతో రాయటానికి పూనుకోవటం దుస్సాహసం. సిగ్గుపడవలసిన విషయం. శీర్షికనుంచీ ఈ రచన అంతా జ్వాలాముఖికి ప్రియమైన ఫ్యూడల్ వలయంలోనేవుంది

"పగులుతున్న జాతి దర్పణంలో
మహాత్ముల త్యాగఫలం
నిష్ఫలమై స్రవిస్తోంది (కిలికించితం)

ఎవరా మహాత్ములు ? విశ్వామిత్రాదులా ? శ్రీమద్ రామానుజులా ? గాంధిగారేనా ? 'ధర్మ చక్షువు'లట 'శ్రీచందనము'ట 'తిలాంబరాలు, హక్కుల దుక్కులు, ఊర్ధ్వ పుండ్రాలు, యజ్ఞంలో స్వాహాకారాల ప్రతిధ్వనులు, ఇంద్రప్రస్థాలు, కార్తీకస్నానాలు, విషాదయోగాలు-' ఇలా గేయంనిండా జ్వాలాముఖి ఫ్యూడల్ సంస్కారం కింపుకొడు తోంది. అలాగే ఫ్యూడల్ సన్నాసుల్లాగా-

"పాలిండ్లు గట్టి కట్టి- పగిలి పోతున్నాయి" లాంటి జుగుప్సాకరమైన వేదాంతంకూడా చెపుతున్నాడు. "అలంకార అంధకార దుర్గాల్లో చిక్కుకుపోయాడు జ్వాలాముఖి 'విముక్తి'అని కొత్తగా పేరు మార్చుకున్న 'పునర్ యోనీప్రవేశం' అ ఫ్యూడల్ భావాల కొనసాగింపే "పంచభూతాల పాలిండ్లు పిండి పిండి" "నాద బ్రహ్మంలో బ్రహ్మాండం" "ఈప్సితారణ్యాలు, 'అహమంధతా సముద్రాలు' 'హృదునిఘాలం' 'మసీదులో నమాజు' 'ఆశాపిశాచాలు' 'త్రిగుణాత్మక త్రిదళలు' 'మాయ-మాయ-మాయ'లు 'యజ్ఞోపవీతాలు' 'పరంజ్యోతి' మొదలైన తుక్కువేదాంతమే నిబద్ధించాడు ఇందులో విశేషమేమిటంటే ముస్లింపదజాలాన్నికూడా యధేచ్ఛగా కలిపాడు. దీన్తో రచన 'మనః కుతారాల'కు బద్దలుకానంత ఆయోమయ విచిత్ర వికార గందరగోళంలో పడిపోయింది. ఈ గేయం ముగింపులో జ్వాలాముఖి సంస్కారగతమైన మత మమకారం దిగంబరంగా కనిపిస్తుంది.

"ముక్తి
ముక్తి
ఆశానురక్తి నుండీ
విషయవాంఛాసక్తి నుండీ
దేహం నుండి
ఇహం నుండి
ఇహం నుండి
పరం నుండి- విముక్తి, విముక్తి"

ఇదట విముక్తి. ఇంతకంటే గంజాయి వేదాంతం ఎవరైనా చెప్పగలరా ! ఆశానురక్తి, విషయవాంఛాసక్తినుండా విముక్తి కావలసింది ? ఇక పోరాటాలు ఎందుకు ? విప్లవాలు ఎందుకు ? అర్థం తెలిసి రాయటమేనా ఇది. 'ఇహపరాల' నుంచీ విముక్తి కోరినతర్వాత 'ఆశానురక్తి లాంటి లిస్టు ఎందుకు ? సర్వమానవ కార్యకలాపాల్ని నిరుత్సాహపరచి, ప్రజల్ని భ్రమల పుకితాళ్ళతో వురితీసే ఫ్యూడల్ వేదాంతుల మోక్షవాదాన్ని చెపుతూ ఈ జ్వాలాముఖి దిగంబరకవిగా, విప్లవ కవిగా ఎలా గుర్తింపబడుతున్నాడు ?

(ఇంకా వున్నది)

ది మార్నింగ్ డెల్యూజ్ (*The Morning Deluge*)
'ఉదయపు వెల్లువ'

జనచైనా చుట్టూసామ్రాజ్యవాదం నిర్మిస్తున్న ప్రచ్ఛన్నయుద్ధం గోడలను భేదించుకొని, ప్రతివారం చైనాగురించి ఒక కొత్త పుస్తకం వెలువడి చైనాగురించి ఈనాడున్న పుస్తకాల, టెలివిజన్ ప్రదర్శనల, డాక్యుమెంటరీల ప్రవాహాన్ని ఉధృతంచేస్తున్నాయి. 1949లో విముక్తితర్వాత జీవన పరిస్థితులు ఎలామారినవో, చూపుతూ, ఇటీవలే తాము పర్యటించిన సందర్భంగా సేకరించిన తాజా విజయాలవార్తలు, అనుభూతులను తెలుపుతూ అనేక పుస్తకాలు ప్రచురించబడ్డాయి. చైనాలో ప్రజల జీవనపరిస్థితులు ఎలా మెరుగుపర్చబడ్డాయనే విషయం అనేకమంది అమెరికా ప్రజల్ని ఆకర్షించుతోంది. వారింకా ఎక్కువ తెలుసుకోవాలని ఆసక్తి చూపుతున్నారు. విప్లవంగురించి, సోషలిజం గురించి తెలుసుకోగోరుతున్నారు.

ఇటీవలనే రాయబడిన, మన దేశంలో లభ్యమౌతున్న కొద్ది పుస్తకాలలో ఒకటయిన హాన్‌సూయిన్ రాసిన (The Morning Deluge) పుస్తకం చైనా విప్లవాంశాన్ని సజీవంగానూ, సులభశైలిలోనూ మనముందుంచుతుంది.

చైనావిప్లవ చరిత్రను (1893–1954) గురించి, విప్లవ రథసారథి ఛైర్మన్ మావోగురించిన రెండుభాగాల్లో 'ది మార్నింగ్ డెల్యూజ్' (The Morning Deluge) మొదటిభాగం. (రెండవభాగం ఇంకా రచనలోనేవుంది.). ఈ పుస్తకంలోని ప్రత్యేకత ఏమిటంటే ఇది దాదాపు నవలారూపంలోవుంది. వందలాది కార్మికులతో రైతులతో, సైనికులతో కమ్యూనిస్టు కేడరులతో తీసుకొన్న ఇంటర్వ్యూల నాధారంగాచేసుకొని రాయబడింది. వీరిలో అనేకమంది 'లాంగ్‌మార్చ్'లోనూ, 'జపాను వ్యతిరేక ప్రతిఘటనా యుద్ధం'లోనూ, అర్థశతాబ్దిగా ప్రజాపోరాటాల్లో పాల్గొని రాటుతేలినవారే.

హాన్ సూయిన్ చైనాలో తన వేసవికాలాన్ని గడిపింది. మావోపుట్టిన పట్టణ రైతాంగంతోకలిసి మాట్లాడింది. పార్టీ ఆర్గనైజేషన్‌ను మావో తొలిసారిగా మొదలుపెట్టిన అన్‌యువాన్ గనులలోని కార్మికుల్ని కలుసుకొని మాట్లాడింది. తొలిరోజుల నాటి సామ్రాజ్య వ్యతిరేక విద్యార్థి ఉద్యమంలోపాల్గొన్న ప్రజలను, అనేకమంది సైనికులను, దీర్ఘకాల అనుభవంకలవారిని కలుసుకొని ఇంటర్వ్యూచేసింది.

రెండు పంథాల మధ్య పోరాటం.

ఈ పుస్తకంయొక్క గొప్పతనమేమంటే— చైనా కమ్యూనిస్టుపార్టీలో రెండు పంథాలమధ్య జరిగిన పోరాటాన్ని చక్కగా చిత్రీకరించింది. 1935 కు పూర్వం పార్టీని

నడిపిన చెన్‌టూషీ, లీలీసాన్, వాంగ్‌మింగ్‌ల, తదితరుల అవకాశవాదపంథా చైనా ప్రజల శత్రువులకు ఎలాతోడ్పడిందో, ప్రజా ప్రయోజనాలకు, పోరాటాలకు వ్యతిరేకంగా వారేవిధంగా నిలబడ్డారో, హాన్‌సూయిన్ రచన స్పష్టంగా తెలుపుతుంది. పార్టీలోని తప్పుడుపంథాకు సరియైనపంథాకు మధ్య జరిగే పోరాటంలో వర్గపోరాటం ఎలా ప్రతిబింబించుతుందో, ప్రతిసారి తప్పుడుపంథా ప్రజల శక్తిని, చొరవను ఎలా నీరుకార్చిందో, అదేసమయంలో సరియైన పంథా ప్రజలను ముందుకు యెలాతీసుకువెళ్ళిందో ఆమె పుస్తకం చక్కగా చూపింది.

కాని ఈ పుస్తకంలోని ప్రధాన బలహీనత ఏమిటంటే- సరియైన పంథాయొక్క ప్రాముఖ్యతగూర్చి ఒత్తిచెప్పినా, ప్రజాప్రయోజనాలను ఎలుగెత్తిచాటిన మావో తదితరులు ఏవిధంగా మార్క్సిజం- లెనినిజం అనే విజ్ఞానశాస్త్రంపై ఆధారపడ్డారో, పోరాటాల, పంథాల, భావాల, వర్గస్వభావాన్ని ఎలా అర్థంచేసుకొన్నారనే విషయాన్ని 'ది మార్నింగ్ డెల్యూజ్' (The Morning Deluge) చూపించలేకపోయింది. ఉదాహరణకు– "గనులలోని, ఫ్యాక్టరీలలోని కార్మికవర్గంపై పార్టీ ఆధారపడి, అక్కడ రిక్రూట్‌చేసుకొన్న కార్మికవర్గ కేడరును చైనానలుమూలలా పార్టీని నడపటానికి పంపటం"అనే పంథాగురించి రచయిత్రి రాసింది, కాని కార్మికవర్గ నాయకత్వంలోనే పార్టీ, విప్లవపోరాటం నడపవలసిన కీలక అవశ్యకతగురించి ఆమె ఎక్కడా వివరించలేదు. మరోచోట, మావోకు "మహిళల విమోచనోద్యమంపైగల గాఢమైనశ్రద్ధ"కు మావోపై వున్న మావోతల్లి ప్రభావం కారణంగా చూపుతుంది. అంతేకాని స్త్రీలవిముక్తి కార్మికవర్గ దృక్పథమని, శ్రామికవర్గ దృక్పథంనుండి దీనిని వేరుచేయలేమనే వాస్తవాన్ని ఈ పుస్తకం వివరించకుండా మరుగుపరుస్తుంది.

లోపాలు :

రచయిత్రి తానెక్కడా 'కమ్యూనిస్టు'నని ప్రస్తావించుకోలేదు. ఈమె 'మావో అభిమాని'మాత్రమే. ఈమె రాసిన రచనలలోని కవిత్వధోరణి ఆమె భావాలను స్పష్టంగా వ్యక్తంచేయడానికి బాగా వుపయోగపడింది. కాని మావో ఆలోచనావిధానం, కార్మికవర్గ దృక్పథమనే వాస్తవాన్నిచూడకుండా, మావో ఆలోచనావిధానం మావో "స్వంత ఆలోచనలు"గా ఈమె చూడటం ఈ పుస్తకంలోని ప్రధానలోపం. చైనా విప్లవానికి సరియైనపంథాను నిర్ణయించటానికి, ప్రజల అనుభవాలను క్రోడీకరించటానికి, చైర్మన్ మావో మార్క్సిజం-లెనినిజం అనే శాస్త్రవిజ్ఞానంపై ఆధారపడి దానిని నూతన యుగానికి అనుగుణంగా అభివృద్ధిచేశాడనే వాస్తవాన్ని యీ పుస్తకం త్రోసిపుచ్చుతోంది. అలాగే అవకాశవాదం అనేది బూర్జువావర్గాల ప్రయోజనాలనుండి, వారి

దృక్పథంనుండి పుట్టుకొస్తుందనే సూత్రీకరణను మరుగుపరచి, కొంతమంది వ్యక్తుల వ్యక్తిగత ఆశల (Personal Ambitions) మూలంగా అవకాశవాదం తలెత్తుతుందని సూత్రీకరించింది.

అంతేకాక, రచయిత్రి కొన్నిసార్లు అధిభౌతికవాద దృక్పథంలో పడిపోతుంది. నీళ్ళు, ఈత అంటే మావోకున్న ఇష్టాన్ని, తన జీవితంలోని కీలకసమయాల్లో మావోపై నీళ్ళు 'మంత్ర' (Magical) ప్రభావం కలిగించినట్లుగా చిత్రించింది. అలాగే విప్లవం ఒక 'కళ'అని, మావో అన్నిటికన్నా ఒక గొప్ప 'కళాకారుడ'ని అనేకసార్లు వర్ణిస్తుంది. చరిత్రలో వాస్తవ పరిస్థితుల ప్రముఖపాత్రను మరచిపోయి, కొంత మంది వ్యక్తులపాత్రను పైకెత్తటానికి ప్రయత్నించింది.

ఉత్పత్తి శక్తుల పాత్రనుగూర్చి, భౌతిక ప్రపంచంగురించి కవిత్వధోరణిలోనే, కళాత్మకంగానో వర్ణించటంకాదు కావలసింది. దానికి విరుద్ధంగా, ప్రపంచాన్ని మార్చటానికి శాస్త్రీయ దృక్పథంలో అర్థంచేసుకోవాలని, శ్రామికవర్గ శాస్త్రీయవిజ్ఞానం ప్రపంచాన్ని మార్చటానికి పోరాటంమీదే ఆధారపడుతుందనే మార్క్సిస్టు ప్రాథమికసత్యాలను సూటిగా చాటిచెప్పాలి. ఈ అవగాహనలేకపోతే, ఈ పుస్తకం మావోచుట్టు 'వ్యక్తి పూజ' (Cult of Personality) పెరగటానికే, (దాన్నుండి రచయిత్రి తప్పించాలని అనుకొన్నా) ఉపయోగపడుతుంది. దీనినుండి ఆమె తప్పించలేదు ఎందుకంటే— సరియైనభావాలు ఎక్కడినుండివస్తాయనే విషయాన్ని అర్థంచేసుకోకుండా, అవి ఛైర్మన్ మావోయొక్క అద్భుత మేధాశక్తి నుండి ఉద్భవించాయనేవిధంగా చిత్రించింది తన పుస్తకంలో.

స్టాలిన్‌పై దాడి :

కమ్యూనిస్టు ఇంటర్నేషనల్ (కొంమింటర్న్) చైనా కమ్యూనిస్టుపార్టీకిచ్చిన సలహాల విషయంలోకూడ పై బలహీనతయే కొమింటర్న్‌ను రచయిత్రి విమర్శించటానికి దారితీసింది ఈ సలహాలవిషయం చైనా విప్లవానికి ప్రపంచ కార్మికవర్గంయొక్క, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంయొక్క మద్దతివ్వటంగాకాక, చైనావిప్లవంలో జోక్యం కలుగజేసుకొంటున్నారని విమర్శించింది. స్టాలిన్‌పై ఆమెకున్న దృక్పథం పూర్తిగా 'కమ్యూనిస్టు వ్యతిరేక'మైనదే, కొమింటర్న్‌లోవచ్చిన ఒడుదొడుకులు, స్టాలిన్ మరణం తర్వాత సోవియట్‌యూనియన్ రివిజనిస్టుల చేతుల్లోకి పోవటానికి కారణం, ఏదో విధంగా స్టాలినే వ్యక్తిగతంగా కారణమన్నట్లు ఈమె చిత్రీకరించింది. సోవియట్ యూనియన్‌లోనూ, అలాగే చైనాలోనూ రెండు పంథాలమధ్య తీవ్రమైన పోరాటం జరిగిందని, దానిలో అవకాశవాదానికి వ్యతిరేకంగా శ్రామికవర్గ ప్రయోజనాలకోసం నిలబడింది స్టాలినేఅనే వాస్తవాన్ని చూడలేకపోయింది.

మావోపై వ్యక్తిగా అభిమానం వుండటంవలన, ఆయన ఆశయం గొప్పదనే భావన వుండటంవలన, సోవియట్ రష్యా, విముక్తి పోరాటాన్ని సమర్థిస్తూనే, అదే సమయంలో చాంగ్-కై-షేక్‌తో దౌత్యసంబంధాలు ఎందుకు కలిగివుందో అర్థంచేసుకోలేకపోయింది. వర్గపోరాటదృక్పథం లోపించటంతో దాన్ని వివరించలేకపోయింది

కాని సరిగ్గా యిదేరకమైన విదేశాంగ విధానాన్ని ఈరోజు చైనా ఆచరిస్తోంది. సరియైన విముక్తి పోరాటాలన్నిటినీ బలపరుస్తూనే, వారు వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రభుత్వాలతో సంబంధాలను అదే సమయంలో కలిగి వుంటోంది: విప్లవ పోరాటాల బలపర్చటంకోసం వైరుధ్యాలను ఉపయోగించుకోటానికి అవలంబించే పాలసీలను, సరియైన వర్గపోరాట అవగాహన లేకపోతే భావోద్రేకాలు, ఆదర్శాలతో నిర్ణయానికి రావటంద్వారా అర్థంచేసుకోలేము.

ఈ లోపాలు వాస్తవమైనవి. చైనా విప్లవంగురించి సరియైన వివరణకావలసిన కార్మిక వర్గం యొక్క, అభ్యుదయకర ప్రజల ప్రయోజనాల దృక్పథంతోచూస్తే, పై లోపాలు పుస్తకంయొక్క ఈ ప్రయోజనాన్ని తక్కువచేస్తున్నాయి. అయినా ఈలోటుపాటులున్నప్పటికీ, ఈ పుస్తకం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా చైనా ప్రజల పోరాటాన్ని చక్కగా చిత్రీకరించింది. చైనా, అమెరికా ప్రజలమధ్య స్నేహమూ, సంఘీభావమూ పెరగటానికి దోహదం చేసింది.

['రెవల్యూషన్' ఏప్రిల్ 74 ఆంగ్ల పత్రికనుండి]

"తుపాకీనుండి విముక్తిని పొందడానికి
తుపాకీనే చేత బట్టాలి"—

చైనాలో కన్‌ఫ్యూషియస్, లిన్‌పియావోలను తోసిపుచ్చుతున్నారు: ఎందుచేత?

ఏదేశంలోనైనా దోపిడీవర్గస్వభావం ఒక్కలాగే ఉంటుంది— తరతరాలచరిత్రలో దోపిడీదార్లు తమ దోపిడీ సజావుగా కొనసాగడానికి అనేక హంగులు సృష్టించుకొన్నారు. మతమూ పవిత్ర గ్రంథాలూ, గురువులూ, గురుపూజా, ఆచార వ్యవహారాలూ కర్మ సిద్ధాంతాలూ 'సర్వమానవ కళ్యాణమూ'— అన్నీ దోపిడీ వర్గప్రయోజనాలను కాపాడడానికే—

మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచనావిధానం ఆయుధంగా చైనా 1949లో సామ్రాజ్యవాదులనుండి విముక్తిని సాధించిన తరువాత యీ 25 ఏళ్ళ కాలంలో గొప్ప విజయాలు సాధించింది. దోపిడీవర్గాల ప్రయోజనాలకు కాపాడే బూర్జువా కళలూ, సాహిత్యమూ, విద్యావిధానం మొదలగు సామాజిక జీవితంలోని అన్నిరంగాల్లో సమూలమైన, విప్లవాత్మకమైన శ్రామికవర్గ ప్రయోజనకరమైన మార్పు తీసుకరావడానికి చైనా ప్రజలు చైర్మన్ మావో మార్గదర్శకత్వంలో శ్రామిక జన సాంస్కృతిక మహా విప్లవాన్ని చేపట్టి గొప్ప ఫలితాలు సాధించినారు.

ప్రస్తుతం చైనాలో 'కన్ఫ్యూషియస్' లిన్ పియావోలను ఖండించే ప్రజా ఉద్యమం తీవ్రంగా కొనసాగుతున్నది- ఎందుచేత ?

"ఫ్యూడల్ వ్యవస్థ తల యెత్తుతూ బానిస సమాజం శీఘ్రంగా పతనమౌతున్న కాలంలో (క్రీ.పూ. 557-479) కన్ఫ్యూషియస్ జీవించి, జీవితమంతా బానిస-యాజమాన్యపాలనను నిలబెట్టే ప్రయత్నమే చేశాడు. పాత వ్యవస్థను పునఃస్థాపించడం, పాలకులకు వ్యతిరేకంగా ప్రజలుచేసే తిరుగుబాట్లను, అన్నిరకాల సంస్కరణలను 'వ్యతిరేకించడం అతని సిద్ధాంతానికి కేంద్రబిందువు- సరిగ్గా యీ కారణంవల్లనే యిన్నియుగాలుగా ఆయన సిద్ధాంతం అభివృద్ధి నిరోధక పాలకవర్గాలకు పట్టుగొమ్మ అయింది- "ఆయన పూజార్హమై, ఉత్తేజాన్నిచ్చే శిఖరాలకు ఎత్తబడేదాకా ఎన్నోతీర్లుగా ఆయనకు వెల్లవేస్తూ పోయారు- ఈ విధంగా పాతవ్యవస్థను కాపాడడానికి లేదా పునఃస్థాపించడానికి ప్రజలమనసులను కలుషితంచేసి బానిసలుగా మార్చటానికి వాళ్ల ప్రయత్నించారు. అతనిచుట్టూ యిట్లా 'పూజ'ను అల్లింది అతనిమీద నిజమైన గౌరవంతోకాదు- అతణ్ణి తమ ప్రయోజనాలకు 'సాధనంగా' వాడుకున్నారు-

గడచిన రెండువేల సంవత్సరాలుగా అభివృద్ధినిరోధకవర్గాలు కన్ఫ్యూషియస్ను 'ఋషి'గా ప్రశంసిస్తున్నారు- ఆధునిక యుగంలో ద్రోహి చాంగ్ కై-షేక్ కన్ఫ్యూషియస్ను పూజిస్తున్నాడు. సామ్రాజ్యవాదులు, సోవియట్ రివిజనిస్టులుకూడా అదే పని చేస్తున్నారు పెట్టుబడిదారీ విధానాన్ని పునఃస్థాపించాలనే తన నిరర్థక ప్రయత్నాలన్నీ అమలుచేయడానికి లిషావ్-చి కన్ఫ్యూషియస్ను ప్రశంసించాడు. పెట్టుబడిదారీవిధానాన్ని పునఃస్థాపించడానికి లిన్పియావో కూడ "నిగ్రహాన్ని అలవరచుకొని ఆచార వ్యవహారాలను కాపాడాలని (restraining one self and restoring the rites) తహ తహలాడిపోయాడు- "విశిష్టతను కాపాడడానికి విజయమో మరణమో" (succeed or die to preserve virtue.) పొందమని తన అనుచరులకు పిలుపు యిచ్చాడు- అయినా కన్ఫ్యూషియస్ అనే భూతాన్ని పెకిలించి తీసి, అభివృద్ధి నిరోధకవర్గాలు తమచావును తప్పించుకోలేక పోయాయి.

ప్రస్తుతం లిన్‌పియావోను, కన్‌ఫ్యూషియస్‌ను ఖండించే ప్రజాఉద్యమం చైనాలో చాలా మౌళికంగా అభివృద్ధిచెందుతున్నది– కన్‌ఫ్యూషియస్‌ను ఖండించడమనేది; లిన్‌పియావోను ఖండించడంలో చాల ముఖ్యమైనఅంశం- లిన్‌పియావోను సంపూర్ణంగా ఖండించాలంటే, కన్‌ఫ్యూషియస్‌నుకూడా తిరస్కరించాలి– కన్‌ఫ్యూషియనిజం అభివృద్ధినిరోధక సిద్ధాంతాలను విమర్శించడంద్వారానే లిన్‌పియావో అతనిముఠా పెట్టుబడిదారీ విధానాన్ని, తిరోగమనవాదాన్ని పునఃస్థాపించడానికి చేసిన ప్రయత్నాల్లోని విప్లవ ప్రతిఘాతుక నేరాలను, లిన్‌పియావో రివిజనిస్టుపంథాను, అభినవమితవాద స్వభావాన్ని (ultra rightist nature) ప్రజలు మరింత స్పష్టంగా చూడగలుగుతున్నారు– లిన్‌పియావో అభివృద్ధినిరోధక ఆలోచనలకు వేర్లు ఎక్కడ వున్నాయో తవ్వి తీసి లిన్‌పియావో, కన్‌ఫ్యూషియస్‌ల అభివృద్ధినిరోధక ఆలోచనల ప్రభావాన్ని సమూలంగా తుడిచిపెట్టడానికి యిది ప్రజలను సమర్థుల్నిచేస్తుంది– ఇదంతాకూడ మహత్తరశ్రామిక వర్గ సాంస్కృతిక విప్లవం సాధించిన అపారమైన ఫలితాలను విస్తృతపరచి ప్రజల ప్రయోజనాన్ని ముందుకు తీసుకపోవడానికి తోడ్పడుతుంది.

(Confucius, 'Sage' of All Reactionary classes in China— Chinese Literature No 6–1974. లో కొంత భాగం.)

బీహార్ ఉద్యమం : వార్తలు:

వీధుల్లో రచయితలు - కళాకారులు

విద్యార్థుల ఆందోళనగా ప్రారంభమైన బీహార్ ఉద్యమం, క్రమంగా పరివర్తన కోరుతున్న ప్రతిమనిషీ యిందులో తాను ఏ పక్షం ఎన్నుకోవాలో ఆలోచింపచేస్తున్నది. ఆలోచకులందరూ వీధుల్లోకివస్తున్నారు. బీహారు రచయితలూ, కళాకారులూ, యితర హిందీ భాషారచయితలూ కళాకారులకన్న ఎక్కువ సంవేదనశీలంకలవాళ్ళు– కనీసం, భావుకత కలవాళ్ళు.

ఈ ఉద్యమం బీహార్ రచయితలను, కళాకారులను నిజంగానే బజార్లలోకి తెచ్చింది- రచయితలు, కళాకారులు తమ ప్రదర్శనలు నిర్వహించని ఒక్కవీధికూడ పాట్నాలో మిగలలేదు. రెండుకర్రలుపాతి, వేదిక ఏర్పాటుచేయడం పాట్నా కాలేజ్ విద్యార్థులు 27 సంవత్సరాల కాంగ్రెస్ ఫాసిస్ట్‌విధానాలు, భ్రష్టాచారాలు- చిత్రాలద్వారా ప్రదర్శించారు. పెట్టుబడిదార్లతో లంచాలుతింటున్న నేతలు, అమాయకప్రజలమీద తుపాకిగుండ్లు కురిపిస్తున్నపోలీసులు రిజర్వ్‌పోలీస్ దురాచారాలవల్ల హింసలపాలయిన నోరులేని పిల్లలు, పేదల హాహాకారాలు- ఇవీ యీ చిత్రాల వస్తువులు. వేలమంది

యీ చిత్రాలనుచూసారు— రిక్షావాళ్ళు, కార్మికులు, ఉద్యోగులు, గృహిణులు. ఫణీశ్వర నాధరేణు అన్నట్లు :

"ఇప్పటిదాకా మీరు లేడీ స్టీఫెన్సన్ హాల్‌లోనో, సెనెట్ హాల్‌లోనో, రాజభవన్ లోనో చక్కగా అలంకరించబడిన ఫ్రేముల్లో కళాప్రదర్శనలు చూసేవాళ్ళు ఇవ్వాల రోడ్లమీద చూస్తున్నారు."

రోడ్డుమీద కవిసమ్మేళనంలో 'నాగార్జున' అనే కవి చదివిన యీ కవిత ఎంతో మందికి నోటికయిపోయింది.

"ఇందుజీ, ఇందుజీ; ఏమయిందినీకు?
విద్యార్థుల నెత్తుర్ల మరక అంటిందినీకు
నల్లడబ్బు నునుపైన మస్కా అంటిందినీకు
(మస్కా—అంటే వెన్న—పక్షపాతమని భావం)
ఎవరైనా వేలెత్తి చూపితే ఎక్కుళ్ళువచ్చినయి నీకు
పిచ్చెత్తి అడ్డందిడ్డం అరుస్తున్నావ్
అధికారగర్వం నషా(మత్తు) ఎక్కిందినీకు."

ఈ ఆందోళన నూతన కవులను, నాటకకారులనుకూడ సృష్టిస్తున్నది. 27 సం వత్సరాల హరిజన ప్రజాకవి బాబూలాల్ మధుకర్, యిప్పుడు బీహార్‌లో అందరికీ తెలుసు.

"సూర్యుడు తూర్పున ఉదయించేది సత్యమేఅయితే
యీ దుష్టవ్యవస్థ అంతంకూడ సత్యమే"

అనే యితనికవిత కవిసమ్మేళనాల్లో జనప్రియమయింది.

కవిసమ్మేళనాలు, చిత్ర ప్రదర్శనలేకాదు. ప్రజలకు నాటకాలుకూడ కావాలి. "18 మార్చిరోజు" అనే నాటకం జుగ్‌నూశారదేష్ రాసాడు. ఇది సైన్యమూ, పోలీసులు— అన్నితీర్ల రక్షణవుండికూడ ప్రాణభీతితో వణికే అబ్దుల్‌గఫూర్ (బీహార్ ముఖ్య మంత్రి) మానసిక స్థితిని చిత్రిస్తుంది.

వసంతకుమార్‌రాసిన నాటకం ఒకటి— ఢిల్లీ దర్బార్‌లోని ఒకమంత్రి (ఎల్. ఎన్. మిశ్రా? బీహార్‌లో నగద్‌నారాయణ అని యితన్ని పిలుస్తారు) తన చెమ్చాలకు (బంట్లకు) డబ్బిచ్చి అబద్ధాలాడటం నేర్పుతాడు. చివరన ఆ చెమ్చాలే ఇతని అబద్ధా లతో విసిగిపోయి ఇతణ్ణిచంపేస్తారు.

పాట్నాలోనేకాదు, యితర పట్టణాల్లోకూడ కవిసమ్మేళనాలు, చిత్రప్రదర్శనలు నాటకాలు జరుగున్నాయి.

(చౌరంగివార్త— హిందీ వారపత్రిక- కలకత్తా ఆగస్టు 5—12 సంచిక ఆధారంగా)

అధ్యాపకులు, మేధావులు :

రెండురోజుల తేడాతో బెనారస్‌లో రెండుఘటనలు జరిగాయి. కాశీవిద్యాపీఠం వైస్ చాన్సలర్ రఘుకుల తిలక్ జయప్రకాశ్ ఉద్యమంలో చేరడానికి తనపదవికి రాజీనామాయిచ్చాడు. రెండోది; కాశీ హిందూ విశ్వవిద్యాలయం అధ్యాపకులు 40 మంది జయప్రకాశ్‌ను వ్యతిరేకిస్తూ ఒక ప్రకటన ఇందిరాగాంధీకి పంపించారు.

ఇవ్వాళ బీహార్‌లో అధ్యాపకులను రకరకాల చట్టాలకింద అరెస్టుచేస్తున్నారు. ఉద్యోగాలు తీసేస్తామని బెదిరిస్తున్నారు. అయినా యీ 40 మంది సిగ్గులేని అధ్యాపకులకు ఫికర్‌లేదు. తమ ఉద్యోగాలు కాపాడుకోవటానికి, అవినీతికి ఆలవాలమైన కాలూలాల్ శ్రామాలికీ (కాశీ హిందూ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్) చాప్లుసీ (సేవలు) చేయడానికీ యీ ప్రకటనచేసి ప్రధానికిపంపారు. వీళ్ళలో చాలమంది 1968–69 లో జనసంఘం, ఆర్.ఎస్.ఎస్.లో వున్నవాళ్ళు. ఇప్పుడు శ్రామాలీ బంట్లయ్యారు. ఇంకా వీళ్ళలో చాలమందికి ఉద్యోగాలు శాశ్వతంకాలేదట; ఇందిరాగాంధీకి ప్రకటన పంపారు గనుక యిపుడింక నమ్మకంగా అవుతాయి. కాశీవిద్యాపీఠం వైస్‌ఛాన్సలర్‌ను అనుసరించి శ్రీమాలీనికూడ రాజీనామా అడగాలని విద్యార్థులు ఆలోచిస్తుండగానే శ్రామాలి ఎత్తువేశాడు– యీ 40 మంది ప్రకటన యిప్పించాడు.

ఇటువంటి చాప్లూస్ (చేతులునలిమే) స్వార్థపరులైన అధ్యాపకులు ఏం చదువు చెప్తుతారు? విద్యార్థులు వీళ్ళనుంచి ఏంనేర్చుకుంటారు? అన్యాయాన్ని సమర్థిస్తూ ప్రకటనలుచేసే వీళ్ళను ఏమనాలి? మేధావులు?– మేదకులు?

(చౌరంగివార్త – హిందీ వారపత్రిక, కలకత్తా ఆగస్ట్ 5–12 సంచిక ఆధారంగా)

భారత ప్రభుత్వం గుప్పిట్లో సిక్కిం

నేను సిక్కిం కాంగ్రెస్ సభ్యుడిని. సిక్కిం భవిష్యత్తు గురించి ఇటీవల చేయబడ్డ నిర్ణయాలు నాకు చాలా ఆందోళనను కలిగించినవి. ప్రజా ఉద్యమాలతో నాకుగల సంబంధం యొక్క అనుభవాన్నిబట్టి చూస్తే– మా ప్రజలు ఇండియా పార్లమెంటులో తమ ప్రాతినిధ్యానికి సుముఖంగాలేరు. ఇండియా ప్రజాస్వామ్యంలో భాగస్వామి గావడానికి కొత్త రూపాల గురించి అసెంబ్లీ మే 11 తీర్మానము మమ్మల్ని చాలా ఆశ్చర్యపరచింది. ఇండియా అధికారిచే రాయబడ్డ యీ తీర్మానపు పదజాలం చాలా మందికి అసలు అర్థమేకాలేదు ఆ తీర్మానాన్ని చర్చకిపెట్టడానికికూడా అసెంబ్లీకి ఎట్టి అవకాశం యివ్వలేదు. 80% సభ్యులకు అర్థంగాని ఇంగ్లీషులో రాయబడ్డ ఆ తీర్మానం, గుడ్డిగా మెంబర్లు చేతులెత్తడం ద్వారా ఆమోదించడం జరిగింది. తీర్మానంలోని విషయాలను గురించి నిరసన తెలియచేస్తూ ఆర్గురు అసెంబ్లీ సభ్యులు తీర్మానంపై సంతకాలు పెట్ట నిరాకరించారు. ఇద్దరు అసెంబ్లీ గేట్ల బయట నిరాహారదీక్ష మొదలుపెట్టారుకూడా. ఈ తీర్మానం లోక్‌సభలో సిక్కిం మెంబర్లకు ప్రాతినిధ్యం యివ్వడానికి ఉద్దేశించింది

కాదని ఇండియా పొలిటికల్ ఆఫీసర్ శ్రీ కె. యస్. బాజ్‌పాయ్ మమ్మల్ని దగాచేస్తే, మరోపక్క సిక్కిం ప్రజలు ఇండియా లోక్‌సభలో ప్రాతినిధ్యాన్ని కోరుతున్నారనే అసత్యాన్ని భారత ప్రజలకు చెప్పటం జరిగింది. శాంతిభద్రతల విభాగం, మరి ఇతర ముఖ్యమయిన ప్రభుత్వశాఖల అధికారాలు మా మంత్రుల చేతుల్లోకాక ఇండియా నామినేట్ చేసే చీఫ్ ఎగ్జిక్యూటివ్ చేతుల్లోనే వుంటవి. దీన్నిబట్టి సిక్కిం తన ప్రత్యేక ప్రతిపత్తిని (1950 ఇండో-సిక్కిం ఒప్పందం) కోల్పోయినట్టేకదా! ఇంతా చేస్తే యీ నిర్ణయాల గురించి సిక్కిం ప్రజలకు తెలియచెప్పటం అసలు జరగనే జరగలేదు. ఈ కొత్త రాజ్యాంగానికి వ్యతిరేకంగా బ్రహ్మాండమయిన నిరసన ప్రదర్శనలు జరిగినవి. మా నాయకులు మమ్మల్ని మోసపుచ్చడమో లేక వారే మోసపోవడమో జరిగింది. ప్రజాస్వామ్యవాదిగా నేను మమ్మల్ని బలపరిచేవారు కోరేది— సిక్కిం ప్రజానీకం యొక్క అభిప్రాయాన్ని జనవాక్య సేకరణద్వారా ధృవపరచాలి. అంతేగాని ప్రజావ్యతిరేక కార్య కలాపాలద్వారా కాదు.

—కె.యస్. ఉప్రెటీ (గాంగ్‌టక్. సిక్కిం యూత్‌కాంగ్రెస్ ప్రతినిధి) సెప్టెంబర్ 3

* * *

సిక్కిం విషయంలో భారత ప్రభుత్వ చర్య సిక్కిం ప్రజల్లో భయాందోళనలు రేకెత్తించింది— ఈ చర్యకు సంబంధించిన వార్త విన్న వెంటనే 400 మందికిపైగా సిక్కిం విద్యార్థులు తమ నిరసన తెలుపడానికి గాంగ్‌టక్ బజారులో బహిరంగసభ ఏర్పాటు చేశారు— సభకు పర్మిషన్ తీసుకోలేదని పోలీసులు మైక్‌లు లాగేశారు... రెండోరోజు పర్మిషన్ కోరితే నిరాకరించారు—

ఏ జాతీ తన జాతీయహక్కులను ... ఇష్టపూర్వకంగా యితరులకు దత్తత చేసుకోదు— భారతదేశపు యీ చర్య అందరికీ ముఖ్యంగా సిక్కిం భవిష్యత్ నిర్ణేతలైన అక్కడి యువకులకు ఆగ్రహం కలిగించింది—

— బిటీయ్ పి. ప్రధాన్
(సిక్కిం విద్యార్థి సంఘ జాయింట్ సెక్రటరీ)
('ది స్టేట్స్‌మన్' పత్రికనుండి)

[పై రెండూ యింకా యిలాంటి అనేక నిరసన లేఖలూ, వార్తలూ, పొరుగు రాజ్యాలయెడ భారత ప్రభుత్వపు దొంగనాటకాన్నీ రాజ్యవిస్తరణ విధానాన్ని దక్షిణ ఆసియాలో అగ్రరాజ్యంగా రూపొందాలనే ప్రయత్నాన్నీ బట్టబయలుచేస్తున్నాయి— ఏప్రిల్ ఎన్నికల తతంగంలో సిక్కింలో భారత సైనికుల బాయ్‌నెట్లకింద తమకు యిష్టంవచ్చిన వారిని ఎన్నికచేయించడం, చైనా సిక్కింను తన గుప్పిట్లో పెట్టుకోవడం, సిక్కిం—చైనా సరిహద్దులో పెద్ద మిలిట్రీని దింపడం, మాస్కో బాస్ ఇండియాచే చేయిస్తున్న చైనా వ్యతిరేక చర్యలని స్పష్టమౌతున్న సత్యం.]

విరసం కార్యదర్శిగా వుంటున్న భూషన్‌ను, న్యాయవాది శివారెడ్డిని, మెడికల్ స్టూడెంటు మల్లయ్యను, వెటర్నరీ స్టూడెంటు నాగేశ్వరరావును ఇంకా రామ్మూర్తి నారాయణరెడ్డి రంగనాథం మొదలగువారిని ఈ నెల 6, 7 తేదీలలో తిరుపతి పోలీసులు అరెస్టుచేశారు. వీరిపై 'చిత్తూరు కుట్రకేసు' బనాయించారు. నేడోరేపో జ్యోతి(విరసం) ఈశ్వరయ్య, B A, లను అరెస్టు చేయబోతున్నారు ఈ అరెస్టులు తిరుపతిలో గొప్ప సంచలనాన్ని కలిగించాయి. దాదాపు అన్ని కళాశాలల విద్యార్థులూ 9వ తేదీ ఈ అరెస్టులకు నిరసనగా తరగతులు బహిష్కరించారు. జూనియర్ కళాశాల విద్యార్థులు యిప్పటికీ సమ్మె సాగిస్తూనేవున్నారు. 9వ తేదీన 1000 మంది విద్యార్థులుదాకా ఊరేగింపువెళ్లారు. విప్లవ ఆవశ్యకతనుచెప్పే నినాదాలు మారుమ్రోగాయి. పోలీసు స్టేషనులోవున్న భూషన్ మొ॥వారిని కోర్టువెనక జైల్లోవున్న శివారెడ్డి మొదలగువారిని బయటకు తీసి తీరాలని విద్యార్థులంతా పట్టుబట్టారు. పోలీసులు ఆ ఒత్తిడికి తలొగ్గక తప్పలేదు. ఆకాశాన్నంటే చప్పట్లు, నినాదాల మధ్య భూషన్, శివారెడ్డి ప్రసంగించారు.

సికిందరాబాదు కుట్రకేసులోని మధుసూదనరావును మళ్ళీ ఈ చిత్తూరు కుట్రకేసులో యిరికించారు. ఒక్కటి మాత్రం స్పష్టం అయింది. ఈ అరెస్టుల్లో, ప్రజల్లో, విద్యార్థుల్లో విప్లవ సంచలనం కలిగింది. తిరుపతి గోడలన్నీ విప్లవ నినాదాలతో నిండిపోయాయి. ఈ కుట్రకేసుల 'కుట్ర'ను ప్రజలు బద్దలుచేసే రోజులు ఇంకెంతో దూరం లేవని ఆశిద్దాం—

— తిరుపతి వి.ర.సం. శాఖ

భూషన్, శివారెడ్డి మొదలగువారి అరెస్టుల సందర్భంలో జరిగిన విద్యార్థుల ప్రదర్శన వివరాలతోకూడిన యిదేవిధమైన సుదీర్ఘమైన ప్రకటన తిరుపతి విప్లవ విద్యార్థులుకూడా పంపిస్తూ అరెస్టులతో బెదిరి విరసం సభ్యులు అస్త్రసన్యాసంచేయడం అసంభవమని పేర్కొన్నారు—

* * *

27-9-74 న తిరుపతికోర్టులో విప్లవరచయిత "జ్యోతి" చదివిన ప్రకటన సాయుధపోరాట ఎర్రజెండావెలుగులో విప్లవ రచయితల సంఘం సాంస్కృతిక పోరాటం చిరకాలం వర్ధిల్లాలి:

యమధర్మరాజు రాజ్యాంగ కుట్ర చట్రంలో ఉక్కుపళ్ళమధ్య విప్లవ కవుల్నీ, విప్లవకారుల్నీ, నిరుద్యోగ యువతరాన్నీ, విద్యార్థుల్నీ బిగించి విప్లవాన్ని ఆపేశామంటూ చంకలు గుద్దుకుంటూ పెద్దమనుషులుగా చెలామణీ అవుతున్న రాబందులమధ్య నిలబడి విప్లవాన్ని ఆలింగనచేస్తున్నాను. పిడికిలిబిగించిన అశేషపీడిత, తాడిత ప్రజలమీద అచం

చలమైన ప్రగాఢవిశ్వాసంతో ఈ దేశవిముక్తి కోసం నడుంబిగించే, జనతా ప్రజాస్వామిక విప్లవాన్ని పరిపుష్టం చేసే శక్తులమీద మా హృదయాన్నీ, వ్యధనూ వుంచి వర్గశత్రు నిర్మూలనాత్మకమైన పోరాట ఎర్రజెండా కవిత్వాన్ని గానంచేస్తాము ప్రజాజీవిత, జీవన సౌధాల పునాదులు లేవకుండా తరతరాలుగా కొల్లగొడుతున్న భూస్వామిక, పెట్టుబడిదారీ, దళారీ యంత్రాంగంమీద కొరడాలా మా కవితా ఖడ్గాన్ని ఝళిపిస్తాం.

విప్లవ రచయితలపై బనాయించే అక్రమ తప్పుడుకేసులకు అనతికాలంలో ప్రజలే సమాధికడతారు.

విప్లవం వర్థిల్లాలి ! వి.ర.సం. వర్థిల్లాలి !!

*　　　*　　　*

2–8–74 నాడు ఖమ్మం జిల్లా పాల్వంచ అడవుల్లో బంగారు జలప్రాంతంలో ఒక నక్సలైటు పోలీసులతో జరిగిన కాల్పుల్లో మరణించినట్లు పత్రికా ప్రకటన చేయబడింది– పంచాది కృష్ణమూర్తి, వెంపటాపు సత్యంవంటి నక్సలైట్ నాయకుల పట్టుకొని కాల్చిచంపిన అనుభవందృష్ట్యా పై ప్రకటన అనుమానానికి తావిస్తున్నది– వెంటనే విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తున్నాను.

— పత్తిపాటి వెంకటేశ్వర్లు
ప్రధాన కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం.

'ప్రజాహక్కుల సంఘం' బరంపురం (ఒరిస్సా) పక్షాన 14–9–'74 న స్థానిక ప్రకాశం హాల్‌లో ఏర్పాటు చేయబడిన బహిరంగసభలో ప్రఖ్యాత విప్లవ రచయితలు శ్రీయుతులు రాచకొండ విశ్వనాథశాస్త్రి, కాళీపట్నం రామారావు, చలసాని ప్రసాదరావు గారలు మాట్లాడుతూ దేశంలో ప్రజాహక్కులను తొక్కివేసే ప్రభుత్వపు దమననీతిని, నిర్బంధకాండను ఖండించారు– సభకు ప్రముఖ ట్రేడ్‌యూనియన్ నాయకులు వై.యల్. సీతారామయ్యగారు అధ్యక్షత వహించారు.

— పి. వి. రాజు.
కార్యదర్శి, ప్రజాహక్కుల సంఘం, బరంపురం

7–9–74 న జరిగిన 'తెలుగు సాహితి' సమావేశంలో ఈ క్రింది తీర్మానం ఆమోదించబడింది.

"రచన చెయ్యడం కుట్రకాదు. రచయితల్ని కుట్రకేసులో యిరికించడం అనాగరికం. సికింద్రాబాదు కుట్రకేసు పేరుతో అరెస్టుచేసిన విప్లవ రచయితలు వరవరరావు, త్రిపురనేని మధుసూదనరావు, చెరబండరాజు, కె. వి. రమణారెడ్డి, యం. టి. ఖాన్, రంగనాథంలను వెంటనే విడుదలచెయ్యవలసిందిగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం."

మరువాడ రాజేశ్వరరావు, న్యూఢిల్లీ.

సూర్యోదయం కుట్రకాదు! విప్లవ రచయితలు కుట్రదారులు కారు!

వర్తకసంఘంలో బహిరంగ సభ రాత్రి 7 గంటలకు
జననాట్యమండలి హైదరాబాద్ వారిచే సాంస్కృతిక కార్యక్రమము

10-10-74 గురువారం రాత్రి గం॥ 5 లకు ఖమ్మం వర్తకసంఘ భవనము నుండి ఊరేగింపు.

మరణశయ్య మీదున్న ఈ ప్రభుత్వం పిచ్చిగా పైశాచికంగా వ్యవహరిస్తోంది. పౌరహక్కులపై ప్రభుత్వం కొనసాగిస్తున్న దాడిని ప్రజాస్వామ్యవాదులైన ప్రజలందరూ ఖండించాలి విద్యార్థులు మేధావులు. కార్మికులు, కర్షకులు, పీడితులు, తాడితులు అరెస్టులను ప్రతిఘటించాలి. విప్లవ రచయితల, కార్యకర్తల విడుదలకు ఉద్యమించి ప్రభుత్వ కుట్రను భగ్నంచేయాలి,

ఖమ్మం విద్యార్థులు, ఖమ్మం.

దారుణ హింసలు + మానభంగాలు + ఊహించలేని అవమానాలు + కాల్చివేతలు + హత్యలు = ఈనాటి భారతదేశపు జైళ్ళు

ఈ మధ్య Amnesty International (లండన్) వారు పశ్చిమబెంగాల్ జైళ్ళ దారుణ పరిస్థితులను ప్రపంచదృష్టికి తీసుకువచ్చారు- వేలాదిఖైదీలు ముఖ్యంగా నక్సలైట్లు క్రిక్కిరిసిన జైళ్ళలో సంవత్సరాలతరబడి ఏ విచారణలేకుండా వైద్యసౌకర్యమూ కరువై, అమానుష చిత్రహింసలకు గురిచేయబడుతున్న ఉదంతాన్ని బయటపెట్టారు. అయితే ఇందిరాప్రభుత్వం ఈ ఆరోపణలు (ఖైదీలసంఖ్యతోసహా) పూర్తిగా నిరాధారమైనవని, అసత్యాలని త్రోసిపుచ్చింది- కాని పశ్చిమబెంగాల్ ప్రభుత్వమే నియమించిన 'జైల్‌కోడ్ డివిజన్‌కమిటి' ఈ ఆరోపణలు సత్యమైనవే అని ఒప్పుకొన్నది- దీంతో యీ దేశంలోఉన్న ప్రభుత్వం ఎంత దివాళాకోరుదో, ఎలా అబద్ధాలమీద, కుట్రలమీద బతుకుతున్నదో ఎంతటి ప్రజాశత్రువో తెలుస్తున్నది. అసలు ఈ ప్రభుత్వం తన వైఫల్యాలను ఎప్పుడైనా ఒప్పుకొన్నదా? తన కాంగ్రెస్ తొత్తుల మెజారిటీతో పోలీసు మిల్ట్రిబంటుల అండతో ప్రజలకోరికల తొక్కివేయడం, ఆరోపణలనెట్టివేయడం, దేశ దుర్భర పరిస్థితికి ప్రతిపక్షాలో, యింకెవ్వరో కారణమనడం యీ దగాకోరు ప్రభుత్వానికి అలవాటేకదా?

నక్సలైట్ ఖైదీలకు యితరఖైదీలవలె అన్ని సౌకర్యాలున్నాయనీ, వారి వారి పార్టీ పత్రికలుకూడా వారికి యివ్వడం జరుగుతున్నదనీ యీ ప్రభుత్వం (Amnesty International వారి ఆరోపణల ఖండిస్తూ పేర్కొన్నది. 6 మాసాలక్రితం ఆంధ్రప్రభుత్వం బనాయింపు కుట్రకేసులో యిరికించిన 'సృజన' 'పిలుపు' సంపాదకులు వరవరరావు, రంగనాథం, ఎం. టి. ఖాన్‌లకు వారివారి పత్రికలు యివ్వడం నిరాకరిం

చింది. ఇలా రచయితలకే వారి పత్రికలు నిరాకరించిన ప్రభుత్వం (కేంద్రమైనా, రాష్ట్రమైనా ఒక్కటే) పార్టీ వ్యక్తులకు జైళ్ళలో వారివారి అధికార పత్రికలు యిస్తున్నదంటే నమ్మగలమా?

'ప్రజాహక్కులసంఘం' (Association for protection of Democratic Rights) అనేసంస్థ, విచారణలోఉన్న నక్సలైట్లమీద, శ్రీ ఖైదీలమీద పోలీసులు ఎంతటి కిరాతకహింసలు జరుపుతున్నరో అత్యంతహేయమైన అవమానాలకు గురిచేస్తున్నారో, తరచుగా ఏవోకొన్ని కారణాలుసృష్టించి ఎలా కాల్చికొట్టి చంపుతున్నారో, విచారణలోఉండగానే ఎందరు ఖైదీలు యిలా ప్రభుత్వ రాక్షసచర్యకు బలియై పోతున్నారో తెలిపారు.

ఈమధ్య నెల్లూరు విప్లవ యువకులు విశాఖ సెంట్రల్ జైలు సూపరింటెండెంట్ కపాడియా అక్కడ మార్క్సిస్ట్-లెనినిస్ట్ ఖైదీలపై, సాధారణ ఖైదీలపైకూడా ఎలా ఘోర దౌర్జన్యకాండ జరిపిస్తున్నదీ, ఏవోకొన్ని కారణాలుకల్పించి 'భద్రత' పేరిట వారినెలా కండెమ్ సెల్స్‌లో పెడుతున్నదీ, తలలుపగిలేలా లాఠీచార్జ్ చేస్తున్నదీ, యిలా గతంలో రాజమండ్రి జైలులో ఇద్దరు ఖైదీల, వరంగల్ సెంట్రల్ జైలులో ఒకరి దారుణ మరణానికి ఎలా కారకుడయ్యాడో ఒక కరపత్రంలో వివరించారు.

నేరము-శిక్షకు సంబంధించిన మౌలికమైన ఆలోచనలేమారిన యీ రోజుల్లో భారత దేశపు జైళ్ళలో యీనాటికీ 1910 నాటి జైళ్ళచట్టం (Prison's Act) ఖైదీల చట్టం (Prisoners Act) అమలులో ఉన్నాయని 'ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పేర్కొన్నది.

1919 లో బ్రిటిష్‌వాళ్ళ హయాంనుండి నేటివరకు జైళ్ళకమిటీలు ఎన్ని సంస్కరణలు సూచించినా అమలుజరుగలేదు. ఖైదీలమీద రాక్షసత్వం జరుగుతున్న యీ దేశంలో అవి అమలుజరుగుతాయనుకోవడం భ్రమ.

ఒక కవిమిత్రుడు చెప్పినట్లు యీ వ్యవస్థే ఒక జైలు- వ్యవస్థమారనిదే జైళ్ళు ఎలా మారుతాయి. అందుకే యీ పీడకుల వ్యవస్థనూ, జైళ్ళనూ బద్దలుకొడదాం—

అరెస్టులు— ఖండనలు

ఆగస్టునెల చివరివారంలో విప్లవ రచయితల సంఘం సభ్యులు డా॥ కొటా నారాయణరావు, పింజెర్ల రామమోహనరావుగార్లను రాజమండ్రిలో అరెస్టు చేసారు.

ఆగస్టు నెల మొదటివారంలో శ్రీయుతులు కడియాల రాఘవేంద్రరావు, మరో నల్గురిని రాజమండ్రిలో అరెస్టు చేసారు.

జులై నెలలో ప్రముఖ న్యాయవాది, కృష్ణాజిల్లా పౌరహక్కుల సంఘం అధ్యక్షులయిన K.V.S.S. ప్రసాదరావుగారిని విజయవాడలో అరెస్టు చేసారు. తిరుపతిలో విరసం కార్యదర్శి భూమన్, సభ్యుడు శివారెడ్డిలను అరెస్టుచేసి కుట్రకేసులో ఇరికించారు,

ఇలా అనేక మందిని విప్లవభావాలు కల్గివున్నందుకు, విప్లవభావాలు ప్రచారం చేస్తున్నందుకు కక్ష సాధింపుచర్యగా తప్పుడు కేసులలో యిరికిస్తూ పౌరుల ప్రాథమిక హక్కులకు పోలీసులు భంగం కల్గిస్తున్నారు. వీరి యీ చర్యలను గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం తీవ్రంగా ఖండిస్తూ విప్లవకారులపై మోపిన కేసులన్నిటిని ఎత్తివేసుకోవాలని డిమాండు చేస్తోంది.

— జి. కోటేశ్వరరావు
కార్యదర్శి గుంటూరు జిల్లా పౌరహక్కుల సంఘం

ప్రభుత్వ దమనకాండను త్రిప్పికొట్టండి!

విప్లవ రచయితల సంఘం నిర్వాహక కార్యదర్శి శ్రీ భూమన్‌ను, శ్రీ శివారెడ్డి, జ్యోతిని ఈమధ్యనే అరెస్టుచేసి, వారిని చిత్తూరు కుట్రకేసులో యిరికించినట్లు తెలుస్తున్నది.

తూర్పు గోదావరిజిల్లా విరసం కన్వీనర్ డాక్టర్ కాటా నారాయణరావునుకూడా ఈ ఫాసిస్ట్ ప్రభుత్వం ఈ మధ్యనే అరెస్టుచేసి అతడిపై కేసు బనాయించింది. భారత ఫాసిస్ట్ ప్రభుత్వం రచయితలపై, మేధావివర్గంపై సాగిస్తున్న దమనకాండను ఖండించవలసిందిగా విజ్ఞప్తిచేస్తున్నాం.

విప్లవ రచయితల సంఘం, (జిల్లాశాఖ) అనంతపురం.

ప్రజా రచయితలపై మరోసారి ప్రభుత్వ పాశవిక హస్తం

ఈ ధనస్వామ్యరాజ్యం విప్లవ రచయితల సంఘం ప్రస్తుత కార్యదర్శి భూమన్, శివారెడ్డి, జ్యోతి గార్లను ఏ కారణంలేకుండా 7 వ సెప్టెంబరునాడు జైల్లో వేసింది.

మేధావులూ, విద్యార్థులూ, ఉద్యోగులూ, శ్రామికులూ యీ దేశ ప్రజలపంతా కలాలకు సంకెళ్లులేవని గళమెత్తి చాటుదాం. వేల లక్షల సంఖ్యలో ఈ దేశ విముక్తి కోసం ఉద్యమిద్దాం.

విప్లవ రచయితల సంఘం,
నగరశాఖ, హైదరాబాదు.

విప్లవ రచయితలు శ్రీయుతులు భూమన్, రాజేశ్వరరావు, శివారెడ్డి, కోటయ్య శ్రీరామ్మూర్తి మొదలగువారి అయిదుగురి అరెస్టులను నిజామాబాద్ విరసం యూనిట్, చేతనా సాహితి సమిష్టిగా ఖండిస్తున్నాయి.

వీరిని వెంటనే విడుదల చేయవలసిందిగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి

విరసం యూనిట్, చేతనా సాహితి,
నిజామాబాద్.

ప్రభుత్వపు సరికొత్త కుట్ర ! ?

ప్రభుత్వం మళ్ళీ కుట్రకేసుల్లో విరసం ముఖ్యులైన భూమన్ తదితరులను ఇరికించాలని దుష్ట ప్రయత్నం చేస్తున్నది.

ప్రభుత్వం ఎన్ని కుట్రలుచేసినా యీనాడు వీస్తున్న విప్లవ ఝంఝ వీచక మానదు, విప్లవ రచనలు సాగక మానవు.

విప్లవ రచయితల సంఘం,
ఖమ్మం జిల్లా శాఖ.

సికిందాబాద్ కుట్రకేసులో నిందితులైన విరసం ప్రధానకార్యదర్శి త్రిపురనేని మధుసూదనరావు ఇతర కార్యవర్గ సభ్యులు సెప్టెంబర్ 12న సికిందాబాద్ 10 వ మేజిస్ట్రేట్ కోర్టులో, అక్రమకేసుల్లో యిరికించి విరసం తాత్కాలిక కార్యదర్శి భూమన్‌ను కార్యవర్గ సభ్యులు డా॥ కాటా నారాయణరావును, సభ్యుడు పి. రామమోహనరావును, రాడికల్ స్టూడెంట్స్ అధ్యక్షుడు శివారెడ్డి (అడ్వొకేట్)ను, ఇంకా యితర రాడికల్ స్టూడెంట్స్‌ను అరెస్టుచేయడాన్ని తీవ్రంగా ఖండించారు.

*　　　*　　　*

ఇదే కేసులో నిందితుడుగాఉన్న మార్క్సిస్ట్-లెనినిస్ట్ నాయకుడు ఇంగువ మల్లికార్జునశర్మ సెప్టెంబర్ 12 వ తేదీన 10 వ మేజిస్ట్రేట్ కోర్టులో సిక్కింలో కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేసి సిక్కింప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా దానికి, అసోసియేట్ ప్రతిపత్తి కలిగిస్తూ భారత పార్లమెంట్ చేసిన శాసనాన్ని భారత ప్రభుత్వ విస్తరణ వాదంగా పేర్కొంటూ భారతప్రజలు దీన్ని ఖండిస్తున్నారన్నాడు- భారత విస్తరణ వాదాన్నిఖండిస్తూ కొత్తకొత్త నినాదాలు యిచ్చారు. ఇక్కడి చందా కాంతయ్య మెమోరియల్ కాలేజీకిచెందిన 80 మంది లెక్చరర్లు ఒక ప్రకటనలో ఆ కాలేజీ సీనియర్ లెక్చరర్, ప్రఖ్యాత విప్లవకవి అయిన శ్రీ వరవరరావును అరెస్టుచేసి బనాయింపు కుట్రకేసులో యిరికించినందులకు తమ నిరసనను తెలియజేస్తూ దేశంలో విప్లవ రచయితలయెడ, మేథావులయెడ కొనసాగుతున్న ప్రభుత్వపుదమననీతిని తీవ్రంగా ఖండించారు.

*　　　*　　　*

విరసం తాత్కాలిక కార్యదర్శి కా॥ భూమన్, సభ్యులు జ్యోతి, శివారెడ్డి, రామ్మోహన్ మొదలగువారిని అరెస్టుచేసి తిరుపతి కుట్రకేసులో యిరికించారు- కుట్రల్లోపుట్టి కుట్రల్లోపెరిగి కుట్రల్లోజీవిస్తున్న ఆంధ్రప్రభుత్వం కుట్రలుపన్నడంతప్ప మరింకేం చేస్తుంది?- ప్రజాతంత్రవాదులంతా సమీకృతమై యీ కుట్రల్ని భగ్నచేయాల్సిందిగా వరంగల్ విరసం విజ్ఞప్తి చేస్తున్నది- విప్లవ రచయితలను వెంటనే విడుదలచేయాలని డిమాండ్‌చేస్తున్నది.

కన్వీనర్ విరసం, వరంగల్, శాఖ.

RADIO PEKING:
ENGLISH LANGUAGE TRANSMISSIONS

South Asia:	GMT	Local Standar'd Time	Metre Bands	Kc/s
	14–00-	19 . 30	40, 30	7470, 9860
	15–00	20 . 30 (Delhi-Colombo)	19*	15095*
	15–00-	20.30 - 21.30	30, 19*	9860, 15095*
	18 . 00	23 . 30	248	1210
	19 . 00	00 . 30 (Delhi)		

* Effective only from May to October

SRJANA Telugu Monthly Oct. '74 H/WL-I
Regd. No. with Registrar of News Papers 10953/67

విరసం సాహిత్య పాఠశాల

విశాఖపట్నం : అక్టోబరు 23, 24, 25.

గత నాలుగేళ్ళుగా విరసం సాహిత్య, సాంస్కృతిక సంస్థగా, ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నది. అదే మన కిరాతక ప్రభుత్వానికి కన్నెర్రఅయింది. అందుకే పగబట్టిన పాములాగా విరసాన్నికాటేస్తోంది. మనకవులు, రచయితలు, త్రిపురనేని మధుసూదనరావు కె. వి రమణారెడ్డి, ఛూమ్స్. యం. టి. ఖాన్, వరవరరావు, చెరబండరాజు, డా. కాటా నారాయణరావు, శివారెడ్డి, జ్యోతి రామ్మోహనరావు, రాజేశ్వరరావు శ్రీరామ్మూర్తి మొ॥ వారిపై కుట్రకేసులు బనాయించి జైళ్ళలోపెట్టింది–

విరసం అగ్రగాములను కటకటాల వెనక్కునెట్టివేసినంతమాత్రాన మన కార్యకలాపాలు ఆగిపోవడంకల్ల. అదివరకు అనుకున్నప్రకారం సాహిత్య పాఠశాల నిర్వహించబోతున్నం. ప్రజల అండదండలే మన ఊపిరి, మన ఉత్తేజం.

ప్రపంచంలో అన్నిసంపదలూ, సాహిత్యం, కళలూ సంస్కృతి, అన్నింటికీ సృష్టికర్తలు కష్టజీవులే. అదే విరసం దృక్పథం. దోపిడి వ్యవస్థను కూకటివేళ్ళతో పెకిలించాలన్నదే మనకృతనిశ్చయం. కష్టజీవుల రాజ్యస్థాపనే మన అభిమతం. అందుకు అడ్డుగోడలుగా నిలచిన కుహనావేదాంతాన్ని, మతంఅనే మత్తుమందును, కలవారి సాంస్కృతిక సిద్ధాంతాలను, వర్గసామరస్యం అనేమోసాన్ని బట్టబయలుచేయడానికి మనం కంకణం కట్టుకున్నాం. అందులో ఒక భాగంగానే ఈ సాహిత్య పాఠశాల నిర్వహిస్తున్నాం.

భారత దేశ చరిత్ర సాహిత్యం, సంస్కృతి వర్గ సంఘర్షణ, ఆర్థికవ్యవస్థ వీన్నిటిపై– మార్క్సిస్టు అవగాహనను పెంపొందించేందుకే ఈ పాఠశాల.

అందరూ విరివిగా చందాలిచ్చి మాకు తోడ్పడాలని కోరుతున్నాం.

అక్టోబరు 23, 24, 25.

విరసం సభ్యులుకానివారుకూడా కన్వీనరు, సిఫార్సుచేస్తే, పాఠశాలలో పాల్గొనవచ్చు.

ప్రతినిధి రుసుం రూ. 15/-

ఆ మూడురోజులు, భోజనం, వసతి సౌకర్యాలు మేమే ఏర్పాటుచేస్తాం.

పూర్తి వివరములకు :–

సి. వి. సుబ్బారావు, కన్వీనర్.
15–SEA SANDS, VISAKHAPATNAM—530003.

విప్లవ రచయితల సంఘం, విశాఖపట్నం

SRJANA
Hanamkonda
Warangal 506001

2 Rs